www.visalaandhra.com
Dwaraka
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 202 | శుక్రవారం 12-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

పోలవరం కొత్త టెండర్లు వాయిదా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీపీఏ సీఈఓ ఎస్‌కే హల్దార్

16న అథారిటీ మరోసారి భేటీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కొత్త టెండర్లను వాయిదా వేశారు. వాస్తవానికి శుక్రవారం తెరవాల్సిన ఈ టెండర్లను ఈనెల 18వ తేదీ వరకూ గడువు పొడిగించాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ప్రభుత్వానికి సూచించింది. టెండర్లపై పలు అంశాలను పరిశీలించేందుకు ఈనెల 16వ తేదీన భేటీ కావాలని పీపీఏ నిర్ణయించింది. పోలవరం పనుల పురోగతిపై గురువారం విజయవాడలోని జలవనరులశాఖ కార్యాలయంలో పీపీఏ సీఈఓ ఎస్‌కే హల్దార్ నేతృత్వంలో సమీక్ష నిర్వహించారు. ప్రాథమికంగా టెండర్ల విషయంలో ముందుకు వెళ్లాలని ప్రభుత్వానికి సూచించిన పీపీఏ... మరోసారి ఈ విషయమై చర్చించి ఆ తర్వాత ముందుకు వెళ్లాలని భావిస్తోంది. ప్రభుత్వం 60సీ నిబంధన కింద కొన్ని పనులు విభజించి రూ.1395 కోట్ల పనులకు టెండర్లు పిలిచింది. స్పిల్‌వే లోని కాంక్రీటు పనులు, స్పిల్, పైలట్ ఛానళ్ల నిర్మాణం తదితర అంశాలను ప్రధాన కాంట్రాక్టరు నుంచి తప్పించి కొత్త వారికి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ టెండర్లు తెరిచేందుకు ఈ నెల 12వ తేదీతో గడువు ముగుస్తుండటంతో పీపీఏ నిర్ణయం ప్రకారం ఈనెల 18వ తేదీకి వాయిదా పడింది. ఇదిలా ఉండగా స్పిల్‌వే పనులు ఆశాజనకంగా జరగడం లేదని అథారిటీ సీఈవో

- మిగతా 2 లో

స్పిల్ వే పనులు అడ్డుకున్న పోలవరం కార్మికులు



ట్రాన్స్‌ట్రాయ్‌కి మరో ఎదురుదెబ్బ

11లో

నాలా బిల్లుకు గవర్నర్ ఆమోదం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ నాలా బిల్లుకు గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ఎట్టకేలకు ఆమోదం తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందిన ఆయన ఆర్డినెన్స్‌కు ఆమోదముద్ర వేశారు. గతంలో ఈ బిల్లును తిప్పిపంపిన గవర్నర్ బుధవారం మరోసారి వెనక్కి పంపారు. గతంలో ఆర్డినెన్సు రూపంలో తెచ్చినప్పుడు లేవనెత్తిన అభ్యంతరాలనే గవర్నర్ మరోమారు వ్యక్తం చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో ఈ బిల్లుపై ప్రభుత్వం గురువారం మరోసారి గవర్నర్‌కు వివరణ ఇచ్చింది. దీనిపై సంతృప్తి చెందిన ఆయన ఎట్టకేలకు నాలా బిల్లుకు ఆమోదముద్ర వేశారు. గవర్నర్ నిర్ణయంతో ఏపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల ముగిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో ఏపీ వ్యవసాయ భూమి (సాగేతర అవసరాలకు భూమి మళ్లింపు- నాలా) చట్టానికి సవరణలు చేస్తూ బిల్లును ఆమోదించారు. అయితే, ఫీజు తగ్గింపు, ఇతర కీలక సవరణలపై అసెంబ్లీ ఆమోదించిన ఈ బిల్లుపై రాజముద్ర

- మిగతా 2 లో

రైల్వే ప్రాజెక్టులకు రాజకీయ గ్రహణం!

- కమీషన్ల కోసం కాంట్రాక్టర్లపై తీవ్ర ఒత్తిడి
- సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో నేతల తిష్ట
- చంద్రబాబు దృష్టికెళ్లినా ఫలితం శూన్యం
- మోడీ వద్దకు కమీషన్ల పంచాయితీ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ప్రాజెక్టులు పూర్తయితేనే రాష్ట్రం అభివృద్ధిపథంలో నడుస్తుందని వల్లెవేసే రాజకీయ నాయకులే కమీషన్ల కోసం ప్రాజెక్టులకు అడ్డు పడుతున్నారు. రైల్వే ప్రాజెక్టు పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్లపై కమీషన్ల కోసం ఒత్తిడి తీసుకురావడంతో వివిధ ప్రాంతాల్లోని ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయి. ముఖ్యంగా నడికుడి-శ్రీకాళహస్తి నూతన రైలు మార్గం పనుల్లో రాజకీయ నాయకులు జోక్యం చేసుకుంటున్నారు. గతంలో నెల్లూరు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధి తనకు కమీషన్ ఇవ్వకపోతే పనులు సాగనివ్వనని బెదిరించడంతో ఆ కాంట్రాక్టరు పోలీసులకు ఫిర్యాదు చేయడమే కాకుండా విలేకరుల సమావేశంలో ఆ నేతల తీరును ఎండగట్టారు. తాజాగా ఇదే ప్రాజెక్టులో గుంటూరు జిల్లాకు చెందిన అధికార పార్టీ ప్రజా ప్రతినిధి కుమారుడు కమీషన్ల కోసం కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేయడంతో అతను కొన్నాళ్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఈ విషయం ఇతర నేతల దృష్టికి రాగా వారు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. అయితే ఆ నేత ప్రభుత్వంలో కీలక పదవిలో ఉన్నందున సీఎం కూడా పట్టించుకోపోవడంతో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వద్దకు ఈ పంచాయితీ వెళ్లింది. ప్రాజెక్టులు వేగవంతం కావాలనుకునే ఎంపీలు కొందరు దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రధాని వద్ద మొరపెట్టుకున్నట్లు అధికార పార్టీ నేతలే చెబుతున్నారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి స్పష్టమైన హామీ రావడంతో కాంట్రాక్టర్ తిరిగి పనులు ప్రారంభించినట్లు విశ్వసనీయ సమాచారం. రైల్వే జీఎం మంగళవారం విజయవాడలో ఏర్పాటు చేసిన ఎంపీల సమావేశానికి హాజరైన నరసరావుపేట ఎంపీ రాయపాటి సాంబశివరావు వద్ద విలేకరులు కమీషన్ల విషయాన్ని ప్రస్తావిస్తే

- మిగతా 2 లో

నేటి నుంచి సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సమితి సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దాసరిభవన్‌లో రెండ్రోజులపాటు జరిగే ఈ సమావేశాల్లో తొలిరోజు ఉదయం పార్టీ రాష్ట్ర కార్యవర్గం జరుగుతుంది.

మధ్యాహ్నం పార్టీ జాతీయ కార్యదర్శి కె నారాయణ సమితి సమావేశాలను ప్రారంభిస్తారు. ఈసందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, చంద్రబాబు ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ప్రాజెక్టు నిర్వాసితులు తదితర సమస్యలపై చర్చించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. పార్టీ బలోపేతానికి చేపట్టవలసిన చర్యలపైనా చర్చిస్తామన్నారు.

సుప్రీంకోర్టు జడ్జీగా ఇందు మల్హోత్రా ?



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించి కొలీజియం ఇద్దరి పేర్లను సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు సీనియరు మహిళ న్యాయవాది ఇందు మల్హోత్ర, ఉత్తరఖండ్ ప్రధాన న్యాయమూర్తి కేఎం జోసెఫ్‌లను న్యాయమూర్తులుగా నియమించాల్సిందిగా సుప్రీంకోర్టు కొలీజియం గురువారం ఏకగ్రీవంగా సిఫారసు చేసింది. న్యాయవాదిగా పని చేస్తూ నేరుగా సుప్రీంకోర్టుకు న్యాయమూర్తిగా నియామకానికి సిఫారసు పొందిన తొలి మహిళ న్యాయవాదిగా ఇందు మల్హోత్ర గుర్తింపు పొందారు. 2007లో ఇందును సీనియరు న్యాయవాదిగా నియమించారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో జస్టిస్ ఆర్ భానుమతి ఒక్కరే మహిళన్యాయమూర్తిగా పని

- మిగతా 2 లో

బీటీ కాటన్ విత్తనాలు నిషేధించాలి

రైతులతో ముఖాముఖిలో ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్‌కుమార్ అంజాన్


రైతులతో మాట్లాడుతున్న అతుల్‌కుమార్ అంజాన్, ముప్పాళ్ల, రావుల వెంకయ్య, జంగాల అజయ్, ప్రసాద్ తదితరులు

విశాలాంధ్ర - వట్టిచెరుకూరు (గుంటూరుజిల్లా) : రైతును నష్టపరిచిన బీటీ కాటన్ విత్తనాలను వెంటనే నిషేధించాలని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్‌కుమార్ అంజాన్ డిమాండు చేశారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు గ్రామంలో బీటీ కాటన్ విత్తనాల వలన నష్టపోయిన రైతులతో ఆయన గురువారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు నష్టం జరిగిందని రైతులు ఆయనకు వివరించారు. మోనోశాంటో విత్తనం గులాబీ రంగు పురుగును తట్టుకోలేక పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బిక్కి శ్రీనివాసరావు అనే రైతు మాట్లాడుతూ 30 ఎకరాల పత్తి వేశానని ఎకరాకు ఒక క్వింటా 50 కిలోల పత్తి మాత్రమే దిగుబడి వచ్చిందని ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. హరిప్రసాద్ అనే రైతు మాట్లాడుతూ 110 రోజులు బీటీ ప్రభావం ఉంటుందని మాయమాటలు చెప్పి విత్తనాలు అమ్మారన్నారు. అతుల్‌కుమార్ అంజాన్ మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు పంట నష్ట పరిహారం రూ.40 వేలు

- మిగతా 11 లో



23 ఏళ్ల తరువాత రూపాయి నోటు

9లో

జ్వర చికిత్సకు రూ.18 లక్షలు

ఓ కార్పొరేట్ ఆస్పత్రి నిర్వాకం

9లో

సాధించేనా?

- నేడు మోడీతో చంద్రబాబు భేటీ
- నియోజకవర్గాల పెంపు, పోలవరానికి నిధులే కీలకం
- ఢిల్లీ వెళ్లిన సీఎం



విశాలాంధ్ర-అమరావతి : ప్రధాని నరేంద్రమోడీతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం భేటీ కావటంపై రాజకీయవర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇందుకు ప్రధాన కారణం దాదాపు ఏడాది తర్వాత మోడీ, చంద్రబాబు సమావేశం కావటమే. రాష్ట్ర విభజన బిల్లులో చాలా అంశాలు అపరిష్కృతంగా ఉన్నాయి. అయితే మోడీ, చంద్రబాబు భేటీలో చర్చకు వచ్చే ప్రధాన అంశం అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు. వీరిద్దరి భేటీ తర్వాత నియోజకవర్గాల పెంపునకు మోడీ గ్రీన్ సిగ్నల్ ఇస్తే రాజకీయంగా చంద్రబాబు విజయం సాధించినట్లేనని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలు పెంచాలని రెండేళ్లుగా తెలుగురాష్ట్రాల చంద్రబాబు సహా తెలంగాణ సీఎం చంద్రశేఖర్‌రావు కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారు. వెంకయ్యనాయుడు కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు జరుగుతుందని అధికార పార్టీ నేతలు, ముఖ్యమంత్రులు ఊదరగొట్టారు. అయితే ఆ అంశం ఇప్పటివరకు కొలిక్కిరాలేదు. వెంకయ్య

- మిగతా 2 లో

ఇదీ లోకం!



కోడి పందేలపై నిషేధం ఉందా.. లేదా..!

- గ్రామాల్లో జోరుగా చర్చలు
- ఉభయ గోదావరి జిల్లాలకు పందేల రాయుళ్లు
- హైకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తామంటున్న పోలీసులు
- ఇప్పటికే పందెపు ప్రాంతాలకు చేరిన కోడి పుంజులు


విజయవాడ సమీపంలోని నున్నలో పుంజుల పెంపకం కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న విజయవాడ నార్త్‌జోన్ ఏసీపీ శ్రావణి, సీఐ సహేరా, ఎస్సై శివ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : సంక్రాంతి పండుగ మూడు రోజులలో కోడి పందేలు ఉంటాయా, ఉండవా.. పందేల బరులకు పోలీసులు అనుమతించారా.. ఎంపీ, ఎమ్మెల్యేలు అదే పనిలో ఉన్నారా.. రాష్ట్రంలో ఎక్కడ అనుమతించకపోయినా ఉభయ గోదావరి జిల్లాల్లో పందేలు ఆగే ప్రశ్నే ఉండదు. ఎందుకైనా మంచిది ముందుగానే పందేలు జరిగే చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుందాం.. ఇది రాష్ట్రంలోని పలు గ్రామాల్లోనూ, నగరాల్లోనూ వినిపిస్తున్న మాటలు. పక్షం రోజులుగా కోడి పందేల నిర్వహణపై పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో పందెపు రాయుళ్లలో పందేల నిర్వహణపై ఆసక్తి పెరుగుతోంది. ఎవరికి వారు గ్రామంలో పందేల నిర్వహణకు అనుమతి తేవాలంటూ రాజకీయ నేతలపై ఒత్తిడి తెస్తున్నారు. పోలీసుల బెడద తాళలేని వారు మాత్రం పందేలకు ఉభయ గోదావరి జిల్లాలకు వెళ్లండంటి సలహా ఇచ్చేస్తున్నారు. కోడి పందేల నిర్వహణపై ఎలాంటి స్పష్టత లేకపోవటంతో పందేలరాయుళ్లు డోలాయమానంలో ఉన్నారు. సంక్రాంతి అనగానే ఎవరికైనా కోడి పందేలే గుర్తుకు వస్తాయి. పండుగ మూడు రోజుల్లో ఆబాల గోపాల పందేలు చూసేందుకు ఎగబడతారు. ఏటా కోడి పందేల నిర్వహణ పెద్ద సంకటంగా మారుతోంది. పందేలు నిర్వహించొద్దని హైకోర్టు ఆదేశించటం, కోర్టు ఆదేశాలను అమలు చేస్తామని పోలీసులు చెప్పటం, అదే పోలీసులపై రాజకీయ పార్టీల నేతలు పందేలకు అనుమతి ఇవ్వాలంటూ ఒత్తిళ్లు తేవటం సర్వ సాధారణంగా మారిపోయింది. అటు కోర్టు, ఇటు రాజకీయ పార్టీల నేతల మధ్యలో పోలీసులు కొన్ని చోట్ల

- మిగతా 2 లో

బ్రతిమిలాడితే నిధులు రావు

- కేసుల వల్లనే బాబు, జగన్‌లకు భయం
- చిరునవ్వుతో మొండిచేయి చూపుతున్న మోడీ
- సీపీఐ నేత నారాయణ విమర్శ



విశాలాంధ్ర అమరావతి : బ్రతిమిలాడితే నిధులు రావు, పోరాడి రాష్ట్రానికి నిధులు తీసుకురావాలని సీపీఐ కార్యదర్శి కె. నారాయణ ముఖ్యమంత్రి చంద్రబాబుకు హితవు పలికారు. గురువారం వెలగపూడి సచివాలయానికి సైకిల్‌పై నారాయణ తన మిత్రులతో కలిసి వచ్చారు. సచివాలయం రెండవ గేటు వద్ద భద్రతా సిబ్బంది సైకిల్‌పై లోపలికి వెళ్లటానికి అనుమతి లేదంటూ నిరాకరించారు. నడిచివెళ్లాలని సూచించారు. నారాయణ వెనుదిరిగి సచివాలయం బయట పరిసర ప్రాంతమంతా సైకిల్‌పైనే కలియ తిరిగారు. ఎన్టీఆర్ అన్న క్యాంటీన్‌లో అల్పాహారం తీసుకున్నారు. మందడంలోని పార్టీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్ష నేత జగన్‌రాష్ట్రానికి రావాల్సిన వాటిపై కేంద్రాన్ని, ప్రధాని మోడీని నిలదీయలేకపోతున్నారన్నారు. లాలూ ప్రసాద్‌యాదవ్‌లాగా జైలులో పెడతారని భయపడుతున్నారని, పొగిడితే ఈ విషయం బయటపెడుతున్నారన్నారు. రాజకీయ పోరాటం సాగించటం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవటం సాధ్యపడుతుంది. చంద్రబాబును ప్రమాణస్వీకారానికి

- మిగతా 2 లో

టునీషియాలో ఉద్యమం ఉధృతం



టునిస్ : నిత్యావసర వస్తువుల ధరల పెంపు, పన్నుల పెంపుదల, నిరుద్యోగ సమస్యపైన ప్రజల ఆందోళన ఉధృతమైంది. రెండుమూడు రోజులకుపైగా ప్రజా సమూహాలు ప్రదర్శనలు నిర్వహిస్తున్నాయి. ఉద్యమం దేశమంతటికీ విస్తరించింది. సైన్యం రంగంలోకి దిగి 300మందికి పైగా నిరసనకారులను అరెస్టు చేశారు. పలు పట్టణాలు, నగరాలలో సైన్యాన్ని నిలిపివుంచారు. అల్జీరియా సరిహద్దులోగల తల పట్టణంలో జాతీయ భద్రతా భవనానికి నిప్పుపెట్టి దగ్ధం చేయడంతో సైన్యం వచ్చి నిరసనకారులను చెల్లాచెదురు చేశారు. ఆ పట్టణంనుంచి ఆందోళనకారులను బయటికి తరిమివేశారు. అరబ్ దేశాలలో టునీషియాలోనే ప్రజాస్వామిక వ్యవస్థ విజయవంతమైంది. సైనిక నియంత జినేఅల్‌అబిదిన్‌బెన్‌అలీని పదవినుంచి దించివేసిన తరువాత దేశంలో 9 ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అయినప్పటికీ ఆర్థిక సమస్యలు పెరుగుతున్నాయేగాని తరగటంలేదు. బుధవారం రాత్రి ఆందోళనకారులు లూటీలకు పాల్పడినట్టుగా ఆరోపిస్తూ 330 మందిని అరెస్టు చేశామని దేశీయాంగశాఖ ప్రతినిధి తెలిపారు.

కొరియాల స్నేహంపై భద్రతామండలి హర్షం



ఐరాస : ఉత్తర దక్షిణ కొరియాల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పడటంపై ఐక్యరాజ్యసమితి భద్రతామండలి హర్షం తెలిపింది. అయితే ఉత్తర కొరియాపై విధించిన ఆంక్షలు విషయం భద్రతామండలి ప్రస్తావించలేదు. మండలి సభ్యదేశాల ప్రతినిధులు బుధవారం ఇక్కడ సమావేశమై ఈ పరిణామాన్ని ఆహ్వానించారు. మండలికి ప్రస్తుత అధ్యక్షుడుగా పనిచేస్తున్న కజకిస్తాన్ రాయబారి కైరట్‌ఉమ్రావ్ మాట్లాడుతూ సభ్యులంతా రెండు కొరియాలమధ్య సంబంధాలు ఏర్పడటంపై సంతోషాన్ని వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రాథమికంగా జరిగిన చర్చలు కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు తగ్గి ఆ తరువాత అణ్వస్త్రరహిత పరిస్థితి ఏర్పడేందుకు అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. ఇలాంటి చర్చలు అణ్వస్త్ర రహిత ప్రాంతంగా ఏర్పడేందుకు దోహదం చేయగలవని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

విశాలాంధ్ర ప్రపంచం

శరణార్థుల రాకపై ఈయూ దేశాల ఆంక్షలు



రోమ్ : పశ్చిమాసియా ఉత్తరాఫ్రికా నుంచి వస్తున్న శరణార్థులను ఐరోపాలోకి ప్రవేశించకుండా సరిహద్దులను కట్టుదిట్టం చేయాలని పలు ఈయూ దేశాలు నిర్ణయించాయి. సైప్రస్, ఫ్రాన్స్, గ్రీసు, ఇటలీ, మాల్టా, పోర్చుగల్, స్పెయిన్ దేశాల నేతలు ఈమేరకు ఒక సంయుక్త ప్రకటనను రోమ్‌లో విడుదలచేశారు. ఏడు దేశాల నేతలు ఇక్కడ సమావేశమై ఈయూ దేశాలన్నీ వలసలపైన ఒకే అభిప్రాయానికి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఆయా దేశాల పౌరులకు అక్కడి ప్రభుత్వాలు జవాబుదారీగా ఉండవలసిన అవసరం ఉందని ఆ ప్రకటన పేర్కొంది. శరణార్థులకు కట్టుదిట్టం చేయడంతోపాటు పేదరిక నిర్మూలనకు, ఘర్షణల నివారణకు కృషి చేయాలని నిర్ణయించారు. శరణార్థులు ప్రధానంగా గ్రీసు, ఇటలీ, స్పెయిన్ దేశాలలో ముందుగా ప్రవేశించి అనంతరం ఈయూలోని ఇతర దేశాలకు విస్తరిస్తున్నారు. అందువల్ల ముందుగా ఈ మూడు దేశాలలో ప్రవేశించకుండా నిరోధించేందుకు అవసరమైన సహాయాన్ని అందించాలని కూడా సమావేశమైన నేతలు పిలుపునిచ్చారు. శరణార్థులను అనుమతించటం వల్ల అనేక విధాలుగా భారం అవుతుందని ఈనేతలు భావించారు. సరిహద్దులను కట్టుదిట్టం చేసేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని తీర్మానించారు. కట్టుదిట్టమైన వలస విధానాన్ని ఈయూ రూపొందించాలని, ఎక్కువగా శరణార్థులు ప్రవేశిస్తున్న దేశాలకు సంఘీభావం ప్రకటించాలని గ్రీకు ప్రధానమంత్రి అలెక్సిస్ సిప్రాస్ అన్నారు. అనేక వందలవేల మంది శరణార్థులు గ్రీసు, ఇటలీలలో ప్రవేశిస్తున్నారని వారిని భరించటం కష్టమౌతుందని పోలెండు, జకోస్లావేకియా వ్యాఖ్యానించాయి. యూరోపియన్ యూనియన్ దేశాల మధ్య మరింత సయోధ్యను సాధించి యూనియన్‌ను మరింత మెరుగుపరిచేందుకు కృషి జరగాలని ఈ సమావేశం తీర్మానించింది. ఇందుకోసం పౌరులను భాగస్వాములను చేయాలని కూడా తీర్మానించినట్లు ఆ ప్రకటన పేర్కొంది. యూరోపియన్ యూనియన్ పార్లమెంటుకు పోటీచేసే అభ్యర్థుల జాబితాలను రూపొందించాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ చేసిన ప్రతిపాదనను ఈ ఏడు దేశాల నేతలు అంగీకరించారు.

సైనిక విన్యాసాలు నిలిపివేయాలి

దక్షిణకొరియాకు ఉత్తరకొరియా సూచన



సియోల్ : అమెరికా, ఫ్రాన్స్ దేశాలతో కలిపి కొరియా ద్వీపకల్పంలో సైనిక విన్యాసాలు జరపకుండా నిలిపివేయాలని దక్షిణకొరియాకు ఉత్తరకొరియా సూచించింది. సైనిక విన్యాసాల మూలంగా ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. అదే సమయంలో యుద్ధ రిస్క్ పెరుగుతుంది. అందువల్ల సైనిక విన్యాసాలను ఆపివేయాలని ఉత్తరకొరియా కోరింది. దక్షిణకొరియా ప్రభుత్వం నిజంగా శాంతిని, సయోధ్యను కోరుకున్నట్లయితే ముందుగా సైనిక విన్యాసాలు తలపెట్టరాదు. సోదరదేశమైన దక్షిణకొరియా కోసం అమెరికాకు వ్యతిరేకంగా తాము పోరాడామని ఉత్తరకొరియా పేర్కొంది. ఈ అంశాలన్నిటినీ ఉత్తరకొరియా వర్కర్స్ పార్టీ వార్తాపత్రిక రొడాంగ్‌సిన్‌మన్ ప్రచురించింది. సైనిక విన్యాసాలే ఉద్రిక్తతలకు ప్రధాన కారణం. ఇవి ప్రమాదకరమైన పరిస్థితిని తెచ్చిపెట్టాయి. ఫలితంగా ఎప్పుడేం జరుగుతుందో ఊహించలేని స్థితి ఏర్పడింది. రెండు దేశాల సైనిక నేతలు ఈనెల 9వ తేదీన చరిత్రాత్మకమైన సమావేశాన్ని నిర్వహించి పలు అంశాలపైన అవగాహనకు వచ్చిన విషయాన్ని ఆ పత్రిక పేర్కొంది. తదుపరి చర్చలు జరిగే తేదీలను దక్షిణకొరియా ఈ వారాంతంలో ప్రకటించే అవకాశం ఉంది. ఫిబ్రవరిలో వింటర్ ఒలింపిక్స్ జరగనున్నందున వార్షిక సైనిక విన్యాసాలను వాయిదా వేసుకోవాలని దక్షిణకొరియా వాషింగ్టన్ అంగీకరించిన కొద్దిరోజుల తరువాత ఉత్తరకొరియా తాజా సూచనచేసింది. ఈ సూచన అంగీకరించినట్లయితే ఈ ప్రాంతంలో సాధారణ పరిస్థితులు ఏర్పడి శాంతి నెలకొంటుంది. రెండు కొరియాల మధ్య తీవ్రమైన సైనిక ఉద్రిక్తతలనుంచి ఉపశమనం పొందవలసిన అవసరం ఎంతైనావుందని ఆ వార్తాపత్రిక ప్రచురించిన వ్యాసంలో ఉత్తరకొరియానేత కిమ్‌జాంగ్‌ఉన్ నొక్కిచెప్పారు.

బలమైన సైనిక శక్తి లక్ష్యం : ట్రంప్

వాషింగ్టన్ : బలమైన సైనిక శక్తి అపారంగా చమురు, గ్యాస్ నిల్వలు, తద్వారా అత్యధిక విద్యుత్ ఉత్పత్తి తన లక్ష్యమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో జరిపిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత్, రష్యా, చైనాలతో కలిసి పనిచేయడం మంచి విషయమేనన్నారు. మాస్కోతో సంబంధాలను పెంపొందించుకోవాలన్న లక్ష్యాన్ని ఆయన ప్రకటించారు. నార్వే ప్రధానమంత్రి ఎర్నాసోల్‌బర్గ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. తమ లక్ష్యాలను రష్యా అధ్యక్షుడు పుతిన్ అంగీకరించకపోవచ్చునని ట్రంప్ అన్నారు. ప్రస్తుతం సమస్యాత్మకంగావున్న ఉత్తరకొరియాతోను సంబంధాలు ఏర్పరుచుకోవడం మెరుగైనదిగా ఉంటుందని ట్రంప్ తెలిపారు. హిల్లరీ క్లింటన్‌పై వ్యాఖ్యానిస్తూ ఆమె బలమైన సైనిక శక్తి అని కోరుకోపటంలేదని అన్నారు 2016లో అధ్యక్షపదవికి తన ప్రత్యర్థిగా పోటీ చేశారని ఆమె నాకు ఏరోజు సమస్య కాలేదని చెప్పారు. ఆమెకి ఇతరతరహా శక్తి ఉండవచ్చుగాని ప్రస్తుతం దేశానికి అవసరమైన శక్తి నైపుణ్యం లేవని ఆరోపించారు. ఉత్తరకొరియా సమస్యపైన చైనాతో కలిసి పనిచేస్తున్నామని, ఇంకా అనేక దేశాలతో కలిసి పనిచేస్తున్నామని వారందరితోను చక్కగా ఉన్నామని, చర్చలు చాలా సజావుగా సాగుతాయని ఇవన్నీ మీకు తెలిసిన అంశాలేఅని విలేకరులనుద్దేశించి ట్రంప్ పేర్కొన్నారు. రష్యాతో సోల్‌బర్గ్‌కు చాలా మంచి సంబంధాలున్నాయన్నారు. ఆ ప్రాంతంలో ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని సోల్‌బర్గ్ చెప్పారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకున్నట్లు వచ్చిన ఆరోపణలపైన ప్రశ్నించగా అందుకు ఎలాంటి ఆధారాలులేవని సోల్‌బర్గ్ అన్నారు.

ప్రభుత్వానికి ఈజిప్టు అధ్యక్షుడి సూచన



కైరో : అనేక దశాబ్దాలుగా దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు వ్యవస్థీకృతమైన పునాదులను పటిష్టం చేయాలని ప్రభుత్వానికి ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్‌ఫతాహ్ అల్‌సిసి సూచించారు. తాత్కాలిక ప్రధాని, గృహనిర్మాణశాఖ మంత్రి ముస్తఫామద్‌బౌలితో సమావేశమైన సందర్భంగా సిసి ఈ సూచన చేశారు. ఆర్థిక లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన ఆర్థిక సంస్కరణలను దశలవారీగా విశ్లేషించడంతోపాటు ద్రవ్య, ఆర్థిక సూచికలను పరిగణలోకి తీసుకోవాలని సిసి కోరారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఆర్థికరంగ సామర్థ్యాన్ని సమీక్షించారు. కొన్ని సంవత్సరాలుగా ఈజిప్టులో ఆర్థికమాంద్యం కొనసాగుతున్నది. రాజకీయ కల్లోలమే ఇందుకు ప్రధాన కారణం. ధరలు బాగా పెరిగాయి. ద్రవ్యోల్బణము అధికమయ్యింది. ఈనేపథ్యంలో ఐఎంఎఫ్ ఒత్తిడిపైన ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టారు.

పోలవరం కొత్త టెండర్లు వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

హల్దార్ తెలిపారు. హల్దార్ విలేకరులతో మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణంలో స్పిల్‌వే పనులే అత్యంత కీలకమన్నారు. అయితే ఇవి ఆశించినంత వేగంగా జరగడం లేదన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. స్పిల్‌వే పనులు 2018 డిసెంబరు నాటికి పూర్తయితే 2019 నాటికి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చిందని ఆయన తెలిపారు. ఈ ఏడాది డిసెంబరు చివరి నాటికి నీరు ఇవ్వడంపై ఇప్పుడేమీ చెప్పలేమన్నారు. టెండర్లపై ముందుకు వెళ్లాలని ప్రభుత్వానికి సూచించామని, అప్పర్ కాఫర్ డ్యామ్ నిర్మాణానికి ఇప్పటికే అనుమతులు ఇచ్చామన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి పెరిగిన అంచనాలపై క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ 2019 నాటికి పోలవరం పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, వారంలోగా టెండర్లు తెరచి కొత్త వారికి పనులు అప్పగిస్తామన్నారు. పీపీఏ కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నట్లు హల్దార్ పేర్కొన్నారు.

బ్రతిమిలాడితే నిధులు రావు

(మొదటిపేజీ తరువాయి)

ముందే కలిశాము. ఉమ్మడి రాజధాని ఉన్నప్పటికీ ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లమని చెప్పాం. హైదరాబాద్‌లో పదేళ్లు ఉండే హక్కులను ఎలా వదులుకుంటానని చంద్రబాబు అన్నారు. అయితే సంవత్సరం తర్వాత ఓటుకు నోటు కేసు వచ్చేసరికి పరిగెత్తుకుంటూ వచ్చారు. అప్పుడే వచ్చివుంటే ఈ పాటికి శాశ్వత భవనాల నిర్మాణం పూర్తి కావచ్చేది. కొత్త రాష్ట్రాలైన తెలుగురాష్ట్రాల పట్ల మోడీ వివక్ష చూపిస్తున్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిచేస్తే చంద్రబాబు బలపడతాడేమోనని, అలా బలపడితే తనకేంటి లాభం అని ప్రధాని ఆలోచిస్తున్నారన్నారు. సీపీఐ పోలవరం ప్రాజెక్ట్ కావాలని ఒకే మాటమీద ఉందన్నారు. అమరావతి ప్రారంభమైనప్పుడు ప్రధాని వచ్చి మీకు అండగా ఉంటాను, అమెరికా, సింగపూర్ వంటి మెరుగైన నగరాలను నిర్మిస్తానని హామీ ఇచ్చారు. తెలుగు ప్రజలందరూ నమ్మారు. ఆరోజు మట్టీ, నీళ్లు ఇచ్చి, అవసరమైన నిధులివ్వడం లేదని, కొత్త రాష్ట్రాలు ఎక్కడ ఏర్పడినా, రాజధాని ఎక్కడ నిర్మించినా అయ్యే ఖర్చు కేంద్రమే భరించాలన్నారు. జాతీయ ప్రాజెక్ట్‌గా గుర్తించిన పోలవరానికి నూటికి నూరుశాతం వారే ఖర్చు చేయాలన్నారు. ప్రత్యేక హోదా కల్పించే చట్టం రావాలి, అదీ లేదు. పోలవరం ప్రాజెక్ట్ లేదు. అమరావతి లేదు. చంద్రబాబుకు మోడీ మూడు నామాలు పెట్టారన్నారు.

సుప్రీంకోర్టు జడ్జీగా ఇందు మల్హోత్రా?

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. జస్టిస్ 1989లో సుప్రీంకోర్టు తొలి మహిళ న్యాయమూర్తిగా జస్టిస్ ఫాతిమా బీవి నియమితులైనారు. ఆ తరువాత కాలంలో జస్టిస్ సుజాతా వీ. మనోహర్, జస్టిస్ రూమా పాల్, జస్టిస్ జ్ఞాన్ సుధా మిశ్ర, జస్టిస్ రంజన్ ప్రకాష్ దేశాయ్‌లు సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తులుగా పని చేశారు.

ఇద్దరు దళితులకు శిరోముండనం..

బల్లియా (యూపీ) : ఉత్తరప్రదేశ్‌లో దళితులను వేధించిన మరో ఘటన వెలుగుచూసింది. గోవులను దొంగలించారన్న నెపంతో హిందూ యువ వహినీ కార్యకర్తలు రెచ్చిపోయారు. వారిద్దరికి గుండె కొట్టించి, మెడలో 'మేము గోవుల దొంగలం' అన్న ప్లకార్డు వేసి ఊరంతా తిప్పారు. అయితే, ప్రవీణ్ శ్రీవాత్సవ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు గోవులను దొంగలించిన నేరం క్రింద వీరిద్దరిని అరెస్టు చేసి, ఐపీసీలోని 379, 411 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు రాస్రా పోలీసులు తెలిపారు. ఈ ఇద్దరిలో ఒకరైన ఉమారావమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన సోమవారం జరిగిందని, రెండు గోవులతో హిందూ యువ వాహినీ కార్యకర్తలు తమను ఉటంకించారని పేర్కొన్నారు. హిందూ వాహిని కార్యకర్తలు తనకు, సోను అనే మరొకరికి గుండు గీయించి, మెడలో 'మేము గోవుల దొంగల'మన్న పలక వేసి ఊరేగించారని రామ్ తన ఫిర్యాదులో ఆరోపించారు.

రాజకీయ గ్రహణం!

(మొదటిపేజీ తరువాయి)

'నడికుడి-శ్రీకాళహస్తి మార్గం తొలిదశలో 36 కిలోమీటర్ల మార్గం పూర్తికావచ్చింది. కొన్ని కారణాల వల్ల కుంటుతూ నడుస్తోంది. ఎందుకు కుంటుతుందో మేము చెప్పకూడదు.. మీరే తెలుసుకోవాలి.. దీనిపై ఫిర్యాదు ప్రధాని వరకూ వెళ్లింది. సీఎం దృష్టికి రెండు, మూడుసార్లు వెళ్లింది.. కాంట్రాక్టరు వచ్చాడు, మళ్లీ పనులు వేగంగా జరుగుతున్నాయి' అని ముక్కలు ముక్కలుగా సమాధానం చెప్పారు.

విజయవాడ-చెన్నై మార్గానికి ప్రత్యామ్నాయంగానే కాకుండా గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు నడికుడి-శ్రీకాళహస్తి నూతన రైలుమార్గం దోహదపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం స్పందించి 2011-12 బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టును మంజూరు చేసింది. అప్పట్లో ఈ ప్రాజెక్టుకు రూ. 1313.18 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. అయితే మారిన అంచనాల ప్రకారం రూ. 2299 కోట్ల వ్యయం కానుంది. ఈ ప్రాజెక్టు కోసం 2015-16లో రూ.110 కోట్లు, 2016-17లో రూ. 180 కోట్లు, 2017-18లో రూ. 340 కోట్లను కేటాయించింది. దీని నిర్మాణ వ్యయంలో రాష్ట్రం 50 శాతం భరించాల్సి ఉండటంతో 2016లో చంద్రబాబు ప్రభుత్వం రూ. 271.06 కోట్లు మంజూరు చేసింది. మొత్తం 309 కిలోమీటర్ల పొడవు గల ఈ ప్రాజెక్టులో తొలిదశలో 28.04 కిలోమీటర్ల మేర పిడుగురాళ్ల-రొంపిచర్ల మధ్య నూతన మార్గం పనులను 2017-18లో పూర్తి చేయాలని రైల్వే లక్ష్యంగా ఎంచుకుంది. అయితే రాజకీయనేతలు కమీషన్ల కోసం కాంట్రాక్టర్లను వేధించడం వల్ల పనుల్లో వేగం మందగిస్తోంది. లేదంటే లక్ష్యానికంటే మరింత ఎక్కువే పూర్తి చేసేందుకు వీలుంటుందని రైల్వేశాఖ ఉన్నతాధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

కమీషన్ల దందాలో రాయలసీమ నేతలు!

రాయలసీమలో కాంట్రాక్టర్లపై రాజకీయ నాయకుల దందా కొనసాగుతోంది. రైలు, రోడ్డు.. ఇలా ఏ ప్రాజెక్టయినా సరే కాంట్రాక్టును దక్కించుకున్న వ్యక్తులు ఎంతటివారైనా సరే స్థానిక ప్రజాప్రతినిధులకు కమీషన్లు చెల్లించుకోవాల్సిందే. లేదంటే వేధింపులు తప్పవు. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నేతలు కొందరు ఇదే పనిపై ఉంటారని చెబుతున్నారు. కమీషన్ల దందా ద్వారా కోట్లాది రూపాయలు దండుకున్నవారు పదుల సంఖ్యలోనే ఉన్నారని సమాచారం. సికింద్రాబాద్‌లోని జోనల్ కార్యాలయంలోనే తిష్టవేసి టెండర్ల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి పనులు పూర్తయ్యే వరకూ కమీషన్ల వేటలోనే మునిగితేలుతారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఒకవేళ కాంట్రాక్టరు కమీషన్ ఇచ్చేందుకు నిరాకరిస్తే బెదిరింపుల పర్వానికి తెరతీస్తారు.

దీంతో చాలామంది ప్రాణభయంతో వారడిగిన మొత్తాలు చెల్లించేయడం వల్లే ఆయా పనులు నాసిరకంగా ఉండడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ప్రధానంగా కల్లూరు-గుంతకల్ డబ్లింగ్ ప్రాజెక్టు, ఎర్రగుంట్ల-నంద్యాల మార్గం, గుత్తి-ధర్మవరం విద్యుదీకరణ, గుంతకల్-వాడి సెక్షన్ విద్యుదీకరణ, కడప-పెండ్లిమర్రి రైలుమార్గం.. ఇలా అనేక ప్రాజెక్టుల్లో కాంట్రాక్టర్లు పెద్దమొత్తాలను రాజకీయనేతలకు కమీషన్ల రూపంలో చెల్లించినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. సాక్షాత్తు ప్రధాని జోక్యం చేసుకునే వరకూ పరిస్థితి వచ్చిందంటే కమీషన్ల దందా ఏ మేరకు జరుగుతుందో అర్థమవుతోందని సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

నాలా బిల్లుకు గవర్నర్ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

వేసేందుకు గవర్నర్ తొలుత నిరాకరించిన విషయం తెలిసిందే. గవర్నర్‌కు, ఏపీ ప్రభుత్వానికి మధ్య కొంత సంవాదం నెలకొనడంతో ప్రభుత్వం పంపిన బిల్లుపై గవర్నర్ అభ్యంతరాలు లేవనెత్తారు. తన అభ్యంతరాలకు బదులివ్వాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. గవర్నర్ అభ్యంతరాలపై వెంటనే వివరణ ఇవ్వాలని రెవెన్యూశాఖను సీఎం ఆదేశించడంతో గవర్నర్‌కు ఆశాఖ సవివరణ ఇవ్వడంతో సంతృప్తి చెందిన ఆయన బిల్లుపై ఆమోదముద్ర వేశారు. ఆమోదముద్ర వేసేందుకు గవర్నర్‌కు మూడు మాసాల సమయం పట్టింది. బుధవారం ఢిల్లీలో కేంద్ర ప్రముఖులతో ఈ బిల్లుపై గవర్నర్ చర్చించినట్లు సమాచారం. ఢిల్లీ నుంచి రాగానే సంతకం చేశారు. గవర్నర్ తీరును గత కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు రాజకీయ పార్టీల నాయకులు తప్పుబడుతున్నారు. ప్రత్యేకించి బీజేపీ నేతలైతే ఈ గవర్నర్ తమకు అవసరం లేదంటూ కేంద్రానికి కూడా విజ్ఞాపనలు పంపారు. బహిరంగంగానే గవర్నర్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ పట్ల గవర్నర్ చిన్నచూపు చూస్తున్నారంటూ పలువురు బీజేపీ నేతలు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

నిషేధం ఉందా.. లేదా..!

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పలుకుబడి ఉన్న నేతలైతే పండుగ రోజుల్లో కొందరు సిన్సియర్ పోలీసు అధికారులతో సెలవు పెట్టించేస్తున్న ఘటనలు అనేకం. కోడి పందేలపై ఇటీవల ఉమ్మడి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో ఎక్కడైనా పందేలు జరిగితే అందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) బాధ్యత వహించాలని హెచ్చరించింది.

కత్తులు కట్టి పందేలు జరగకుండా..

కత్తులు కట్టి పందేలు జరగకుండా చూడాలని సాక్షాత్తు డీజీపీ కార్యాలయం నుంచే అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు మౌఖిక ఆదేశాలు జారీ కావటం గమనార్హం. మరోవైపు సంప్రదాయంగా వస్తున్న కోడి పందేలపై బీజేపీ నేత ఒకరు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కొన్ని రోజులుగా కోడి పందేల నిర్వహణపై రాష్ట్రంలో పెద్ద ఎత్తున చర్చలు, తర్జన భర్జనలు జరుగుతుండగా, పందేపు పుంజులు ఇప్పటికే కోడి పందేలు జరిగే ప్రాంతాలకు వెళ్లిపోయాయి. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కోడి పందేలు వేసి తీరతామని సాక్షాత్తు ప్రజాప్రతినిధులే ప్రకటనలు చేయటం, ఇందుకోసం భారీగా ఏర్పాట్లు కూడా చేసేశారు. దీంతో ఇతర జిల్లాల్లోని పందేపురాయుళ్ల దృష్టంతా ఇపుడు ఉభయ గోదావరి జిల్లాలపై పడింది. హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసు, రెవెన్యూ, పశుసంవర్థక శాఖ అధికారులతో ఉమ్మడి తనిఖీ కమిటీలు ఏర్పాటైనా, ఎక్కడా పందేల ఏర్పాట్లు ఆగకపోవటం గమనార్హం. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో కోడి పందేల నిర్వహణకు బరులు సిద్ధమవ్వగా, పందేలు జరిగే ప్రాంతాలకు పందెం పుంజులు ఇప్పటికే చేరుకున్నాయి. కోడి పందేలపై కొందరు ప్రజా ప్రతినిధులు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో ఇపుడు వైరల్ అవుతున్నాయి. 'కోళ్లు అన్నాక పోట్లాడుకోకుండా ఉంటాయా... వాటిని మనం ఆపగలమా...' అని సాక్షాత్తు ప్రభుత్వ విప్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేసిన వ్యాఖ్య ఇపుడు సోషల్ మీడియాలో పెద్ద సంచలనం కలిగిస్తోంది. దీంతో పశ్చిమ గోదావరిలో పందేలు జరగటం ఖాయమనే భావన పందెపురాయుళ్లలో బలపడింది. దీంతో ఎవరికి వారు ఆ జిల్లాలో పందేలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

పెంపకం కేంద్రాలు ఖాళీ

పందెపు పుంజుల కోసం మామిడి తోటలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పెంపక కేంద్రాలు ఇప్పటికే ఖాళీ అయ్యాయి. ఒక్క విజయవాడ పరిసర ప్రాంతాల్లో వందకుపైగా కేంద్రాలు ఉన్నాయి. పక్షం రోజుల క్రితమే ఉమ్మడి తనిఖీలు చేసి, పందేలకు పుంజులు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. మన పోలీసులు తాపీగా కమిటీలు వేసుకుని తనిఖీలకు వెళ్లేసరికి పుంజులు పెంపక కేంద్రాలను దాటి బయటకు వెళ్లిపోయాయి. విజయవాడ సమీపంలోని నున్నలోని ఒక మామిడి తోటలో ఉన్న పుంజుల పెంపక కేంద్రాన్ని విజయవాడ ఈస్ట్‌జోన్ ఏసీపీ శ్రావణి, నున్న రూరల్ సీఐ సహేరా, ఎస్సై శివ ప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. విచిత్రం ఏంటంటే అక్కడున్న పుంజులన్నీ పందేలు జరిగే చోటకు వెళ్లిపోయాయి. కోడి పుంజుల గురించి అందులో పని చేసే వర్కర్‌తో ఏసీపీ శ్రావణి మాట్లాడగా, పందేలు వేసేవారు కొనుక్కుని వెళ్లిపోయినట్లు చెప్పాడు. ఒక్క నున్నలో సుమారు 50కిపైగా పెంపకం కేంద్రాలు ఉండగా, పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, నూజివీడు, ఆగిరిపల్లి, మైలవరం, తిరువూరు, విస్సన్నపేట, చాట్రాయి ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున పెంపకం కేంద్రాలలో పుంజులు ఉన్నాయి. విజయవాడ పోలీస్ కమిషనరేట్‌లో పందేలకు అనుమతించే ప్రసక్తేలేదని పోలీస్ కమిషనర్ డి.గౌతం సవాంగ్ ఇప్పటికే స్పష్టం చేశారు. దీంతో విజయవాడ పరిసర ప్రాంతాల పందేలరాయుళ్లు కృష్ణాజిల్లాతోపాటు ఉభయ గోదావరి జిల్లాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు పెనమలూరు ప్రాంతంలో ఒక ప్రజా ప్రతినిధి పందేలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నా, పోలీసులు పట్టించుకోకపోవటం గమనార్హం.

ఈసారి రూ.600 కోట్లపైనే పందేలు

కోడి పందేలకు ఈసారి రూ.600 కోట్లపైనే చేతులు మారే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది రాష్ట్రంలో సుమారు రూ.500 కోట్లపైనే పందేలు జరిగినట్లు సమాచారం. హైకోర్టు ఆదేశాలు, పోలీసుల ఆంక్షల నేపథ్యంలో కొన్ని జిల్లాల్లోనే పందేలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో గతేడాదికంటే తక్కువగా ఏమీ పందేలు జరగవనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

సాధించేనా?

(మొదటిపేజీ తరువాయి)

ఉపరాష్ట్రపతి అయిన తర్వాత ఆ ఊసే లేకుండా పోయింది. ఏడాది కాలంగా ఏపీ సీఎంతో కలవని ప్రధానమంత్రి గతవారం ఏపీకి చెందిన టీడీపీ, బీజేపీ ఎంపీలు కలిసి రాష్ట్ర సమస్యలు పరిష్కరించాలని విన్నవించినప్పుడు త్వరలోనే తాను చంద్రబాబుతో సమావేశం కానున్నానని మోడీ వారికి సూచనప్రాయంగా తెలిపారు. మోడీ చెప్పినట్టుగానే శుక్రవారం ఉదయం 10.40కు చంద్రబాబు ఆయనను కలవనున్నారు. ప్రధానిని కలిసేందుకు బాబు గురువారం రాత్రే ఢిల్లీకి బయలుదేరారు. విభజన సమస్యలపై ముఖ్యమంత్రి, ప్రభుత్వం పలుమార్లు విన్నవించినా అటు మోడీ, కేంద్రంలోని కొందరు పెద్దలు ఇప్పటివరకు పెద్దగా స్పందించలేదు. పోలవరం ప్రాజెక్ట్‌కు నిధుల కేటాయింపు, కొత్త కాంట్రాక్టర్ల నియామకం అంశాలపై కొంత వివాదం నడిచి... సమసింది. దీనికి తోడు విదేశీ రుణసహాయానికి బదులు నాబార్డ్ నుంచి దాదాపు 16వేల కోట్లపై చిలుకు నిధులు ఇప్పించాలని ముఖ్యమంత్రి ఇప్పటికే కేంద్రానికి లేఖరాశారు. దీనికితోడు ప్రత్యేక ప్యాకేజీకి సంబంధించిన అంశాలతో పాటు విభజన బిల్లులో పేర్కొన్నట్లు 9,10,13 షెడ్యూళ్లలోని రాజ్యాంగబద్ధ సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించి ఆస్తుల విభజన అంశం ఇంకా కొలిక్కి రాలేదు. పైఅంశాలన్నీ పాలనాపరమైన, ఆర్థిక పరమైన అంశాలు అయినప్పటికీ అన్నిటికన్నా కీలకమైన అంశంగా నియోజకవర్గాల పునర్విభజన వ్యవహారాన్ని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికార పార్టీల్లోకి ప్రతిపక్షాలకు చెందిన ఎమ్మెల్యేలు భారీగా ఫిరాయించారు. ఆ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు ఇస్తామని ఫిరాయింపు సమయంలో ఆయా అధికార పార్టీల అగ్రనేతలు హామీలు ఇచ్చారు. కొత్త, పాత నేతల మధ్య సమన్వయం కుదరకపోవటంతో కొన్ని నియోజకవర్గాల్లో అధికార పార్టీలకు తలనొప్పులు ప్రారంభమయ్యాయి. దీనికి తోడు ప్రస్తుత ఎమ్మెల్యేలలో కొందరికి నియోజకవర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తిరిగి వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావాలంటే ఈ ఎమ్మెల్యేలతోనే ఎన్నికలకు వెళితే ఇబ్బందులు తప్పవని, అందుకు రాజకీయంగా ఏకైక పరిష్కారమార్గంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే రాజకీయాల్లో కొత్త వాతావరణం నెలకొల్పి సులభంగా విజయం సాధించవచ్చన్న విశ్వాసంతో తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వారు చానాళ్ళుగా నియోజకవర్గాల పునర్విభజనపై డిమాండు చేసినా కేంద్రం ఇప్పటివరకు సరిగా స్పందించలేదు. సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో పాటు ఇటీవల గుజరాత్ ఎన్నికల్లో బీజేపీ అతికష్టం మీద అధికారం నిలబెట్టుకుంది. రెండు తెలుగురాష్ట్రాల్లో సొంతంగా బలపడాలన్న బీజేపీ అధినాయకుల ఆలోచనలు ఆచరణ సాధ్యం కాదని భావించి, ఇప్పటివరకు మిత్రపక్షంగా ఉన్న చంద్రబాబుతో తిరిగి రాజకీయ ప్రయాణం కొనసాగించాలన్న ఆలోచనతోనే మోడీ చంద్రబాబుకు అపాయింట్‌మెంటు ఇచ్చారని, తెలుగురాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీల్లో చర్చసాగుతోంది. మోడీ, చంద్రబాబు భేటీలో నియోజకవర్గాల పునర్విభజన, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంపై ప్రధాన చర్చ జరగనుందని తెలుస్తోంది. నియోజకవర్గాల పెంపునకు సంబంధించిన క్యాబినెట్ నోట్ కూడా ఇప్పటికే సిద్ధమైందని చంద్రబాబుతో సమావేశమైన తర్వాత మోడీ ఈ ఫైల్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తారని ప్రచారం సాగుతోంది. చంద్రబాబు కూడా నియోజకవర్గాల పెంపు, పోలవరం ప్రాజెక్ట్ నిధుల సాధనపైనే మోడీని పట్టుబడతారని టీడీపీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఏది ఏమైనా మోడీ, చంద్రబాబుల భేటీలో తీసుకొనే నిర్ణయాలతో రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు వేడెక్కనున్నాయి.

పోలీసు ముద్రణా కేంద్రానికి రూ.9.20 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కర్నూలులో కొత్తగా పోలీసు ముద్రణా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. అక్కడి గవర్నమెంట్ ప్రెస్ ఆవరణలోనే కొత్త భవనాన్ని నిర్మించాలని హోం శాఖ నిర్ణయించింది. ఇందుకోసం రూ.9.20 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు ముద్రణా కేంద్రానికి రూ.7 కోట్లు కేటాయించాలని ప్రింటింగ్, స్టేషనరీ అండ్ స్టోర్స్ అదనపు డీజీపీ ప్రభుత్వానికి గతంలో ప్రతిపాదనలు పంపించారు. అయితే సాంకేతికంగా కొత్త భవనం నిర్మాణ అంచనా వ్యయం పెరగటంతో అదనంగా మరో రూ.2.20 కోట్లను కూడా కేటాయించాలని రెండోసారి ప్రతిపాదించారు. రెండు ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం రూ.9.20 కోట్లకు పరిపాలనాపరమైన ఆమోదాన్ని తెలియజేసింది. ఈ మొత్తాన్ని ఆర్ అండ్ బీ కర్నూలు సర్కిల్ పీఏఓ వద్ద డిపాజిట్ చేసి, నిర్మాణ పనులలో ఎక్కడా సమస్య తలెత్తకుండా చూడాలని ప్రభుత్వం సూచించింది.

ఫౌండేషన్ కోర్సు పేరుతో సంక్రాంతి సెలవులు హరించొద్దు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పురపాలక పాఠశాలల్లో ఫౌండేషన్ కోర్సు పేరుతో పదో తరగతి విద్యార్థుల సంక్రాంతి సెలవులను హరించొద్దని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇ.షణ్మూర్తి, సిహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక జీపీఏ కోసం నడుపుతున్న పదో తరగతి పాఠశాలలకు ఈ నెల 12, 17, 18, 19, 20 తేదీల్లో తరగతులు నిర్వహించాలని మున్సిపల్ అడ్మిషన్ శాఖ(ఆర్‌సి నంబరు-3292) ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. వాటిని వెంటనే విరమించుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థుల సంక్రాంతి సెలవులను హరించే ఆలోచనలను విరమించాలని సూచించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాల సమయంలోనే విద్యాబోధన చేయాలని, పాఠశాల అకడమిక్ క్యాలెండరును పాటించాలని స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నాయని వివరించారు. 10 జీపీఏ పేరుతో విద్యార్థుల హక్కులను హరించే ఉత్తర్వులను వెంటనే విరమించాలని ఎస్టీయూ నేతలు డిమాండు చేశారు.

పక్కాగా జన్మభూమి డాక్యుమెంటేషన్ : సీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని పురస్కరించుకొని గత పదిరోజుల్లో చాలా నేర్చుకున్నామని, ఇదంతా డాక్యుమెంటేషన్ పక్కాగా చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ సమాచారం భవిష్యత్‌కు మార్గదర్శకం కావాలని ఆకాంక్షించారు. ఏవిధమైన గొడవలు లేకుండా ప్రశాంతంగా 5వ విడత జన్మభూమి జరగడం అభినందనీయమన్నారు. ఈ స్ఫూర్తిని తరువాత స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదే నన్నారు."మన జన్మభూమి దేశంలోనే వినూత్న కార్యక్రమం,ఇతర రాష్ట్రాలకు గొప్ప నమూనా వంటిది. ఇంత పెద్దఎత్తున కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు అధికార యంత్రాంగం,ప్రజా ప్రతినిధులు,ప్రజల భాగస్వామ్యం గతంలో మరే రాష్ట్రంలోనూ జరగలేదు" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గురువారం తన నివాసం నుంచి 10వరోజు జన్మభూమి నిర్వహణపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో అధికారులపై,ప్రజా ప్రతినిధులపై జనంలో ప్రతికూలత ఉండేది. గ్రామసభలలో వారిని కోప్పడితే ప్రజలనుంచి చప్పట్లు మార్మోగేవి. ఇప్పుడు వారిపై సానుకూలత వచ్చింది,ఇది విప్లవాత్మక మార్పు,ఈ స్ఫూర్తిని కొనసాగించాలంటూ చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.జన్మభూమి గ్రామసభల్లో 10రోజుల్లో 60లక్షల మంది పాల్గొనడం నిజంగా ప్రజావిజయం, ప్రజాస్వామ్య స్ఫూర్తికి దర్పణమని ముఖ్యమంత్రి ఆనందం వ్యక్తం చేశారు. గత 9రోజుల్లో రేషన్ కార్డులు 1,71,447 ఇచ్చాం, పెన్షన్లు 1,00,635 మందికి కొత్తగా ఇచ్చామని గుర్తుచేశారు. 15,725 వైద్యశిబిరాలలో 12లక్షల మందికి వైద్యచికిత్సలు అందించారని తెలిపారు. 23,991 పశు వైద్యశిబిరాలలో 13,72,000 పశువులకు చికిత్స జరిపారని చెప్పారు. హెల్త్ క్యాంపులు,వెటర్నరీ క్యాంపులు విజయవంతం కావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామీణ క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలు విజయవంతం కావడంపట్ల హర్షం వెలిబుచ్చారు. 9రోజుల్లో 9,92,000 అర్జీలు వచ్చాయని, వాటిలో 8,51,000 అప్ లోడ్ చేశారంటూ,3,06,000 ఫిర్యాదుదారులను గుర్తించినట్లుగా ప్రకటించారు. హౌసింగ్ పై 2,60,000,సివిల్ సప్లైస్ పై 1,98,000,రెవిన్యూపై 1,45,000, పెన్షన్లగురించి 1,45,350 అర్జీలు వచ్చాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.అన్ని ఫిర్యాదులు వేగంగా పరిష్కరించాలని,అర్హులందరికీ న్యాయం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జన్మభూమిలో విశిష్ట సేవలు అందించివారిని గుర్తించాలి,గౌరవించాలి, శుక్రవారం వారికి అవార్డులిచ్చి సత్కరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, వివిధ జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వివేకానందుని దార్శనికతే జాతి ఐక్యతకు స్ఫూర్తి : సీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వివేకానందుడు యుగపురుషుడని, అటువంటి మహనీయులు యుగానికి, జగానికి ఒకరుగా జన్మిస్తారని సీఎం చంద్రబాబు అన్నారు. కులం, మతం, ప్రాంతం, భాషా విభేదాలతో దేశం అనేక విభజన రేఖల నడుమ సతమతమవుతున్న వేళ వివేకానందుడు జాతిలో ఐక్యత తెచ్చారన్నారు. ఆత్మ విశ్వాసం కోల్పోయి, అచేతనంగా ఉన్న జాతికి ఆత్మస్థయిర్యాన్నిచ్చి, చైతన్యం నింపారని కొనియాడారు. దేశాన్ని మార్చే శక్తి యువతకే ఉందని ఏనాడో చెప్పిన దార్శనికుడని కొనియాడారు. ఈనెల 12వ తేదీ స్వామి వివేకానందుని జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఘన నివాళులర్పించారు. ఇనుప కండరాలతో ధృఢంగా, ఉక్కు నరాలతో స్థిరంగా, వజ్రసంకల్పం కలిగిన యువకులు వందమంది ఉన్నా దేశ దశను మార్చివేసి దిశానిర్దేశం చేయగలరని వివేకానందుడు చెప్పారని గుర్తు చేశారు. వివేకానందునిగా జగమెరిగిన నరేంద్రుడు యువతకు గొప్ప స్ఫూర్తిదాత అన్నారు. షికాగో సర్వమత సమ్మేళనంలో మానవత్వమే తమ హితమన్న భారతీయ తత్వాన్ని, హైందవ ధర్మాలను ఆయన ప్రపంచానికి చాటి చెప్పారని, నాటి సమ్మేళనంలో ఆహూతులను సోదర, సోదరీమణులారా అని సంబోధిస్తూ భారతీయ కుటుంబ వ్యవస్థ ఔన్నత్యాన్ని రెండు మాటల్లో చెప్పారని గుర్తు చేశారు. పరిజ్ఞానం, నైపుణ్యాలు కలిగిన యువత మీదనే దేశభవిత ఆధారపడి ఉందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన పారిశ్రామిక సదస్సులు, విదేశీ పర్యటనలు ఫలించాయని తెలిపారు. స్థాపించిన, పునాదిరాయి వేసిన పరిశ్రమలు 927 ఉన్నాయని, వీటి ద్వారా రూ. 3,65,132 కోట్ల పెట్టుబడులు రాగా 7,72,490 మందికి ఉపాధి లభించిందని చెప్పారు. ఉద్యోగాలు పొందిన వారి పేర్లను ఆన్ లైన్ లో ప్రకటిస్తామన్నారు. ప్రపంచంలో ఎవరికీ లేని యువసంపద మనకు ఉందన్నారు. జిల్లాకొక యువ భవనాన్ని నిర్మించి యువజన విధానం తీసుకొస్తున్నామని, వివేకానందుని స్ఫూర్తితో యువతకు పట్టుదల, క్రమశిక్షణ, దేశభక్తి విలువలతో కూడిన ఆలోచనలు నేర్పించేలా యువభవనాల్లో శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామని చంద్రబాబు చెప్పారు. యువతకు సాధికారతే తమ ధ్యేయమని ముఖ్యమంత్రి తెలిపారు.

కరవు రహితమే లక్ష్యం

ముఖ్యమంత్రి చంద్రబాబు



విశాలాంధ్ర ప్రతినిధి-అనంతపురం : కరవు రహిత జిల్లాగా అనంతపురంను తీర్చిదిద్దడానికి జిల్లాలోని అన్ని చెరువులకు కృష్ణా జలాలను నింపి సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి నియోజకవర్గంలోని బుక్కపట్నం చెరువులో జలహారతిలో పాల్గొని పైలాన్ ఆవిష్కరించిన అనంతరం జరిగిన రైతు కృతజ్ఞత సభకు సీఎం హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని కరవు రహితంగా తీర్చిదిద్ది ప్రతి కుటుంబానికి నీటి భద్రతను కల్పించాలని, కృష్ణా జలాలను రాయలసీమ జిల్లాలకు మరలించి రాయలసీమ జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేసే లక్ష్యంతో ప్రత్యేక చర్యలు అమలు చేయనున్నట్లు తెలిపారు. తెలుగుగంగ, హంద్రీ- నీవా ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రారంభించడం ద్వారా నా జన్మధన్యం అవుతుందన్నారు. గత సంవత్సరం బుక్కపట్నంలో పర్యటించినప్పుడు ఈ చెరువును చూసి చలించిపోయాయని, ఏడాదిలోగా బుక్కపట్నం చెరువును నింపుతానని ఇచ్చిన హామీ మేరకు కృష్ణా జలాల ద్వారా ఈ చెరువును నింపడం జరిగిందన్నారు. 0.56 టీఎంసీలు ఈ చెరువులో నిల్వ ఉందని, 10 వేల ఎకరాలకు ప్రత్యక్షంగా ఆయకట్టు ద్వారా సాగునీరు అందచేస్తున్నామని, 250 గ్రామాలు ఈ చెరువు ద్వారా అభివృద్ధి చెందుతాయని, 12 వేల బోర్లు రీచార్జ్ అవుతాయని సీఎం పేర్కొన్నారు. 2019 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కృష్ణా నుంచి శ్రీశైలం ద్వారా రాయలసీమ జిల్లాలకు 140 టీఎంసీల నీటిని మళ్లించేందుకు పనులను వేగవంతంగా చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం నీరు- చెట్టు ప్రగతిపై సమీక్షిస్తున్నామన్నారు. దేశంలో తొలిసారిగా 1254 ఫీజో మీటర్లతో రియల్ టైమ్ గ్రౌండ్ వాటర్ మానిటరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో చేపట్టిన వివిధ జల సంరక్షణ చర్యల వల్ల 8 జిల్లాల్లో భూగర్భ జలాలు 3 నుంచి 8 మీటర్ల లోతుకు చేరాయన్నారు. 15.35 లక్షల వ్యవసాయ బావులకు జియో ట్యాగింగ్ చేయడం జరిగింద న్నారు. జిల్లాలో కియా కార్ల పరిశ్రమ ఏర్పాటు వల్ల జిల్లా రూపురేఖలు మారతాయని, యువతకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు.

ప్రభుత్వ చీఫ్ విప్ డా. పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలను మన జిల్లాకు తెచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అపర భగీరథుడిగా చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. ఎంపీ నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ కృష్ణా జలాలను మన జిల్లాలోని అన్ని చెరువులకు నింపడానికి సీఎం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ సభలో ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, రాష్ట్ర సమాచార పౌర సంబం ధాలు, గ్రామీణ గృహ నిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు, రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత, కలెక్టర్ జి.వీరపాండియన్, ఎస్పీ జి.వి.జి.అశోక్ కుమార్, జెడ్పీ చైర్మన్ పూల నాగరాజు, జేసీ టి.కె.రమామణి, ట్రయినీఈ కలెక్టర్ డా.వెంకటేష్, గ్రామ సర్పంచి యశోదరాయుడు, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

శాంతిసంఘీభావం సంఘం జాతీయ కార్యదర్శి సుధాకర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రపంచ శాంతి-పర్యావరణ పరిరక్షణకు సమైక్యంగా కృషి చేయాల్సిన అవసరముందని అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం జాతీయ కార్యదర్శి డాక్టర్ డి.సుధాకర్ పిలుపునిచ్చారు.విజయవాడ హనుమాన్‌పేట తానా భవనంలో గురువారం అభ్యుదయ ఆలోచనా వేదిక ఆధ్వర్యాన నూతన సంవత్సర క్యాలెండరును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రపంచ దేశాలు యుద్ధోన్మాదం, టెర్రరిజాలతో వణికిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.క్రైస్తవ ముస్లిముల మధ్య మతకల్లోలాలు నెలకొన్నాయని వాపోయారు.ఈ నెల 15న ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ భారతదేశ పర్యటన్ని ఖండిస్తూ దేశ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సంఘం నాయకులు మోతుకూరి అరుణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఐ.బయ్యన్న, తాటికృష్ణ, ఎన్.లెనిన్‌బాబు, చంద్రానాయక్, పరుచూరి అజయ్, సుబ్బారాయుడు, బెజవాడ రాజారావు, ఆర్.పిచ్చియ్య, చరణ్‌సాయి పాల్గొన్నారు.



రేపట్నుంచి చెన్నారెడ్డి శతజయంత్యుత్సవాలు : రోశయ్య

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ మర్రిచెన్నారెడ్డి శత జయంత్యుత్సవాలు ఈనెల 13 నుంచి ప్రారంభమవుతాయని మాజీ గవర్నర్ కొణిజెట్టి రోశయ్య తెలిపారు. శతజయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో సంవత్సరం పాటు తెలంగాణతో పాటు ఏపీలోనూ కార్యక్రమాలను నిర్వహిస్తామని కమిటీ చైర్మన్ రోశయ్య వివరించారు. ఈనెల 13న వేడుకలను హైదరాబాద్‌లో ప్రారంభించి, అనంతరం రెండు రాష్ట్రాల్లో విడతల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 13వ తేదిన నిర్వహించే కార్యక్రమానికి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, పుదుచ్చేరి సీఎం నారాయణస్వామి హాజరవుతున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఎన్నికైన చెన్నారెడ్డి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన నాయకుడని కొనియాడారు.31 ఏళ్ల వయస్సులోనే పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై చరిత్ర సృష్టించారన్నారు. 5 రాష్ట్రాలకు గవర్నర్‌గా సేవలందించి కాంగ్రెస్ పార్టీ కీలక నాయకునిగా పనిచేశారని తెలిపారు. చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి మర్రిశశిధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, టీపీసీసీ నేతలు నిరంజన్, కమలాకర్, శ్యాంలాల్ పాల్గొన్నారు.

ఆదివాసీ కోడ్ అమలుకు దేశవ్యాప్త ఉద్యమం

ఏబీఏఎం పిలుపు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆదివాసీ కోడ్‌ను అమలుచేయాలని కోరుతూ దేశవ్యాప్త ఉద్యమానికి అఖిల భారతీయ ఆదివాసీ మహాసభ (ఏబీఏఎం) పిలుపునిచ్చింది. దాసరిభవన్‌లో గురువారం గిరిజన సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశం జాతీయ ఉపాధ్యక్షుడు కెంపన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏబీఏఎం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆర్‌సీ బక్షీ మాట్లాడుతూ దళితులు, ఆదివాసీలు అనేక సంవత్సరాలపాటు ఉద్యమాలు చేసి సాధించుకున్న ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చి పేరు మార్పు చేయడం శోచనీయమన్నారు. జనన, మరణ ధృవీకరణ త్రాలలో హిందు, క్రిస్టియన్, సిక్కు, జైనులుగా ఉండే గిరిజనులందరికీ ఆయా పత్రాలలో ఆదివాసీ అని రాసే విధంగా చట్టం తేవాలన్నారు. ఈనేపధ్యంలో ఫిబ్రవరి నెలాఖరు వరకూ దేశ వ్యాప్తంగా ఆదివాసీ కోడ్ అమలు కోసం లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన వివరించారు. మైదాన, ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని బక్షీ డిమాండు చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గిరిజన సమస్యలు పరిష్కారం కోరుతూ పార్టీతోపాటు ప్రజాసంఘాలు ఉద్యమిస్తుంటే పాలకులు ఇవేమీ గుర్తించకుండా 2019 ఎన్నికల ఎత్తుగడలు వేయడం దారుణమన్నారు. ఈ సమావేశంలో గిరిజన సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు పి గోవింద్, టీఏఎస్ నేత ఆర్ అంజయ్య నాయక్, నేతలు కె భూషణరావు, ఎం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులకు 18న ఎన్నిక

- అదే రోజు కో ఆప్షన్ సభ్యులకు ఎన్నిక
- ఎన్నికల సంఘం ఆదేశాలు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ), ఉపాధ్యక్షులు (వైస్ ఎంపీపీ), కో ఆప్షన్ సభ్యుల పదవులకు ఈ నెల 18న ఎన్నిక జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి డాక్టర్ ఎన్ రమేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఆయా మండలాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల ఎన్నిక కోసం సంబంధిత జిల్లా కలెక్టర్ల ద్వారా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీఓ) నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ నెల 12వ తేదీలోగా ఎన్నిక కోసం నోటిఫికేషన్ జారీ చేయటంతోపాటు సమావేశాల నిర్వహణను పూర్తి చేయాల్సి ఉంది. రాష్ట్రంలో తొమ్మిది మండల పరిషత్ అధ్యక్ష పదవులు, ఆరు ఉపాధ్యక్ష పదవులు, రెండు కో ఆప్షన్ సభ్యుల పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటన్నింటికీ ఈ నెల 18వ తేదీన ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్తగా ఎన్నికయ్యేవారు మరో ఏడాది మాత్రమే పదవిలో కొనసాగే అవకాశం ఉంటుంది. అనంతపురం జిల్లా రామగిరి, అమరాపురం, గుంటూరు జిల్లా వినుకొండ, కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం, కర్నూలు జిల్లా కోడుమూరు, నెల్లూరు జిల్లా కొవ్వూరు, విజయనగరం జిల్లా బొబ్బిలి, సీతానగరం ఎంపీపీ పదవులకు, విశాఖ జిల్లా మునగపాక ఎంపీపీ, వైస్‌ఎంపీపీ పదవులు రెండింటికీ ఎన్నికలు జరగనున్నాయి. అలాగే గుంటూరు జిల్లా అమరావతి, దుర్గి, నెల్లూరు జిల్లా కలిగిరి, శ్రీకాకుళం జిల్లా మందస, విశాఖ జిల్లా రాంబిల్లి మండలాల వైస్ ఎంపీపీల పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. కృష్ణాజిల్లా గన్నవరం, కడప జిల్లా సీకే దిన్నె మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక కూడా అదే రోజున జరగనుంది. ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులకు 18వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఉదయం 11 గంటలకు ఎన్నిక ప్రక్రియ నిర్వహిం చాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అనివార్య కారణాల వల్ల ఎన్నిక జరగకపోతే 19న నిర్వహించాలని సూచిం చారు. కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు 18న ఉదయం పది గంటలలోపు నామినేషన్లను స్వీకరిస్తారు. మధ్యాహ్నం 12 గంటలలోగా నామినేషన్ల పరిశీలన, ఒంటిగంట లోపు ఉపసంహరణ ప్రక్రియ ఉంటుంది. సరిగ్గా ఒంటిగంటకు కో ఆప్షన్ ఎన్నిక నిర్వహించి, వెంటనే ఫలితాన్ని ప్రకటించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

పోలీసు ప్రత్యేక విభాగాల్లో మౌలిక సౌకర్యాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పోలీసు శాఖలోని ప్రత్యేక నిఘా విభాగం (ఎస్ఐబీ), గ్రేహౌండ్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా ప్రత్యేక మౌలిక సదుపాయాల పథకం(ఎస్ఐఎస్) కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ ప్రత్యేక విభాగాలలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన మార్గదర్శకాలను రూపొందించాల్సి ఉంటుంది. ప్రత్యేక నిఘా విభాగం (ఎస్ఐబీ) ఐజీ కన్వీనర్‌గా వ్యవహరించే కమిటీలో ఆర్థిక శాఖ కార్యదర్శి, గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ, ఇంటెలిజెన్స్ అదనపు డీజీపీ, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సభ్యులుగా వ్యవహరిస్తారు.

చక్కెర డైరెక్టర్, చెరకు కమిషనర్‌గా సాధు సుందర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : చక్కెర డైరెక్టర్, చెరకు కమిషనర్‌గా (డీఎస్‌సీసీ) పరిశ్రమల శాఖ డైరెక్టర్, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కమిటీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.సాధు సుందర్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగిన ప్రణాళిక శాఖ డైరెక్టర్ ఎల్.మురళీ పదవీ విరమణ చేయటంతో సుందర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎం.గిరిజా శంకర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

సాప్ టెక్నాలజీతో మెరుగైన పనితీరు

ఏపీట్యూన్స్‌ను ప్రారంభించిన ట్రాన్స్‌కో సీఎండీ విజయానంద్



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సాప్ టెక్నాలజీ వినియోగంతో ట్రాన్స్‌కో, డిస్కంల పనితీరు మరింత మెరుగైనట్లు ట్రాన్స్‌కో సీఎండీ కె విజయానంద్ తెలిపారు. సాప్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూపొందించిన 'ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ న్యూ ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్ (ఏపీట్యూన్స్)ను ఏపీ జేఎండీలు దినేష్ పరుచూరి, పి ఉమాపతి, ప్రాజెక్టు డైరెక్టర్ సుబ్రహ్మణ్యంతో కలసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. విజయవాడలో విద్యుత్‌సౌధలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ఏపీ విద్యుత్ సంస్థలు ఆధునాతన పద్ధతులను అనుసరిస్తూ దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తున్నాయనిన తెలిపారు. సాప్ రూపొందించిన టెక్నాలజీని ఏన్టీపీసీ తర్వాత ఏపీజెన్‌కోలో ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ (ఈఆర్పీ) ప్రాజెక్టు 'శక్తి' పేరిట ఉపయోగిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ సాప్‌ను వినియోగిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సాప్ ప్రతినిధి సంజయ్ ఎస్ బాసు, ఏపీ ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్లు ఆనందరావు ఆడమ్, శ్రీనివాసరావు, సుబ్బారావు, కాంచనబాబు, అధికారులు ఎస్వీ ప్రసాదరావు, బాలసుబ్రహ్మణ్యం, గుప్త, అదనపు కార్యదర్శి జీవీ సత్యవాణి పాల్గొన్నారు.

'కార్పొరేట్'లో సంక్రాంతి దూరం..?

- ఆ విద్యా సంస్థల్లో సెలవులు కుదింపునకు యత్నం..!
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు
- టెన్త్, ఇంటర్ మార్కులే లక్ష్యంగా బోధన
- విద్యార్థులు తల్లిదండ్రుల ఆందోళన
- నేటి నుంచి ప్రభుత్వ విద్యా సంస్థలకు సెలవులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రభుత్వం ప్రకటించిన సంక్రాంతి సెలవుల్ని కార్పొరేట్, ప్రైవేటు యాజమాన్యం కుదించే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. టెన్త్, ఇంటర్‌లో మార్కుల సాధనే లక్ష్యంతో విద్యార్థులను పండుగ పూట సైతం తరగతి గదుల్లో బంధించేందుకు యాజమాన్యం ప్రయత్నాలు ఆరంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్‌కు చెందిన అన్ని విద్యా సంస్థలకు ఈ నెల 12 నుంచి సెలవులను ప్రకటించారు. ఈ సెలవులను కుదించే ఆలోచనల్లో కార్పొరేట్, ప్రైవేటు యాజమాన్యం ఉండటంపై విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారు. విజయవాడ కేంద్రంగా కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇంటర్, టెన్త్ విద్యార్థులు హాస్టల్ వసతితో చదువుతున్నారు. వారంతా సంక్రాంతి సెలవులకు ఇంటికెళ్లి కుటుంబ సభ్యులతో గడపాలనే ఆలోచనలో ఉన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మూడు రోజుల వరకే విద్యార్థులకు సెలవులిచ్చే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారముంది. దీంతో దూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఈ సెలవులు రాకపోకలకే సరిపోతా యని వాపోతున్నారు. కార్పొరేట్ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంటర్ సిలబస్ పూర్తి కాలేదనే నెపంతో ఇంటర్ ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు ఇప్పటికే ప్రతి ఆదివారం ఇతర క్యాంపస్‌లలో బోధిస్తున్న విషయం విదితమే. దీంతో సంక్రాంతికి మూడు రోజులు సెలవులు ఇచ్చి ఆ తర్వాత యథాతథంగా తరగతుల్ని ప్రారంభించాలనే ఆలోచనలో కార్పొరేట్ యాజమాన్యం ఉన్నట్లు సమాచారం. అన్ని కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు ఈ నెల 12 నుంచి సంక్రాంతి సెలవులు ఇవ్వాలని ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ ఉదయలక్ష్మి ఆదేశించారు. కొన్ని విద్యా సంస్థలు సంక్రాంతి సెలవులను కుదించే ఆలోచనలపై విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ పాఠశాలల్లో 10 జీపీఏ కోసం నడుపుతున్న పదో తరగతి పాఠశాలల విద్యార్థులకూ సెలవులు కుదిస్తూ మున్సిపల్ అడ్మిషన్ శాఖ ఉత్తర్వుల్ని జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలకు ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. 21న ఆదివారం రావడంతో 22న తిరిగి విద్యా సంస్థలను ప్రారంభిస్తారు. ప్రభుత్వ రంగ, ఎయిడెడ్‌కు చెందిన ప్రాథమిక, మాధ్యమిక, ఇంటర్, ఉన్నత కళాశాలలకు ఈ సెలవులు వర్తిస్తాయి.

సిలబస్‌పై పూర్తిపై ఆందోళన

సంక్రాంతి సెలవులతో సిలబస్ పూర్తిపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. టెన్త్ ప్రీ-పబ్లిక్ ఎగ్జామ్ పరీక్షల్ని ప్రభుత్వం నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా జన్మభూమికి విద్యార్థులు, ఉపాధ్యాయుల్ని తరలించడం వల్ల సిలబస్ బోధనకు అసౌకర్యం కలిగింది. దాదాపు నెల రోజుల్లో టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సిలబస్ పూర్తికానందున విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. సంక్రాంతి సెలవులతో సిలబస్ పూర్తి చేయడం మరింత కష్టతరంగా మారిందని వారు వాపోతున్నారు. అన్ని పాఠ్యాంశాల్లోనూ ఒకటి, రెండు పాఠాలు మిగిలిపోయాయని విద్యార్థులు చెబుతున్నారు. ఉపాధ్యాయులకు అదనపు బాధ్యతల్ని అప్పగించడంపై సర్వత్రా విమర్శలు నెలకొన్నాయి.

నాలుగు పట్టణాభివృద్ధి సంస్థలకు రూ.40 కోట్లు మంజూరు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలోని నాలుగు పట్టణాభివృద్ధి సంస్థలకు ప్రభుత్వం రూ.40 కోట్లను మంజూరు చేసింది. ఒక్కో పట్టణాభివృద్ధి సంస్థకు రూ.10 కోట్ల చొప్పున మంజూరు చేసిన ప్రభుత్వం, ఆ మొత్తం నిధులతో తక్షణమే ఆయా పట్టణాలలో కార్యాలయాలను ఏర్పాటు చేసి కార్యకలాపాలు చేపట్టాలని సూచించింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్.కరికాల వలవెన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో అన్నింటికీ కలిపి రూ.10 కోట్లనే ప్రభుత్వం మంజూ రు చేయగా, ఆ ఉత్తర్వులను రద్దు చేస్తూ మరో ఉత్తర్వు కూడా జారీ అయింది. అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసిన హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ (హుడా), కర్నూలు పట్టణాభివృద్ధి సంస్థ (కుడా), నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా), కాకినాడలో గోదావరి పట్టణాభివృద్ధి సంస్థ (గుడా)కు రూ.10 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

రైల్వే ప్రాజెక్టులకు రూ. 249.82 కోట్లు విడుదల

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో మూడు రైల్వే ప్రాజెక్టులకు 2017-18 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వ వాటాలో భాగంగా రూ. 249.82 కోట్లను రవాణాశాఖ గురువారం విడుదల చేసింది. ఈమేరకు ఆశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్ చంద్ర పునేటా జీవోను జారీ చేశారు. కడప-బెంగళూరు, నడికుడి-శ్రీకాళహస్తి మధ్య నూతనంగా నిర్మించే రైలు మార్గాలకు రాష్ట్రం వాటాగా 50 శాతం, కోటిపల్లి-నరసపూర్ మార్గానికి 25 శాతం చెల్లించాల్సి ఉంది. ఈ మూడు రైలు మార్గాల పనులు వివిధ దశల్లో జరుగుతున్న నేపథ్యంలో ఈ మొత్తాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో కడప-బెంగళూరు బ్రాడ్‌గేజ్ నిర్మాణానికి రూ. 28.96 కోట్లు, నడికుడి-శ్రీకాళహస్తి మార్గానికి రూ. 97.10 కోట్లు, కోటిపల్లి-నరసపూర్ మార్గానికి అత్యధికంగా రూ. 123.76 కోట్లను మంజూరు చేసింది.

సంపాదకీయం

జాతీయ సంపదల ధారాదత్తం

జాతీయ సంపదల పరిరక్షణ దేశ సౌభాగ్యానికి చిహ్నం... అభివృద్ధికి సోపానం. కానీ, కార్పొరేట్ శక్తుల నియంత్రణలో నడుస్తున్న నరేంద్రమోడీ ప్రభుత్వం సంప్రదాయాలకు చెల్లుచీటీ యిచ్చి ఆయన చిత్తం వచ్చినట్లు వ్యవహరిస్తూ దేశానికి చేటు తెస్తున్నారు. విదేశీగడ్డపై భారత్ పరువును ఆయన దిగజార్చిన ఉదాహరణలు కూడా ఉన్నాయి. మోడీ మొత్తం బ్యాంకింగ్ పరిశ్రమను ధ్వంసం చేసి, ప్రభుత్వ రంగ బ్యాంకులను (పీఎస్‌యూ) దివాలాటంచులకు నెట్టిన తరువాత, ఇప్పుడు ఇతర అమూల్యమైన జాతీయ సంపదలను ధారాదత్తం చేయడంపై దృష్టి సారించడం అత్యంత గర్హనీయం. ప్రభుత్వ రంగంలో వున్న ఏకైక ఎయిర్‌లైన్-ఎయిర్ ఇండియాను విదేశీయులకు అప్పగించాలని ఈ వారంలో జరిగిన కేంద్రమంత్రివర్గం నిర్ణయించింది. విదేశీయులకు నిర్వహణను, యావత్ ఎయిర్ ఇండియా ఆస్తిని అప్పచెబుతానని వాగ్దానం చేసి, యాజమాన్యంలో 49 శాతం తీసుకోడానికి విదేశీ ఎయిర్‌లైన్స్‌ను మోడీ సర్కారు అనుమతిస్తున్నది. ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించడానికి కేంద్ర ప్రభుత్వం చెబుతున్న కారణం-నిరంతరాయంగా ఆ సంస్థ నష్టాల్లో నడుస్తున్నదని. నష్టాలకు సంబంధించి గణాంకాలను కొన్ని వార్తాపత్రికలు, టీవీ ఛానెళ్లలో కథనాలు వచ్చినప్పటికీ ప్రైవేటీకరణకు వాస్తవ కారణాలను చెప్పడానికి ఏ ఒక్కరూ సిద్ధంగా లేరు. ఎయిర్‌లైన్స్‌కు వచ్చిన నష్టాల గురించి ప్రజలను విశ్వాసంలోకి తీసుకోడానికి సైతం ప్రభుత్వం సిద్ధంగా లేదు. అయితే, ఎయిర్ ఇండియా పూర్తిగా ప్రైవేటీకరించబడుతుందనీ, కొత్త యజమానులు అత్యంత సానుకూల విదేశీ ఎయిర్‌లైన్స్ వారని కేంద్రం నిస్సిగ్గుగా ప్రకటించింది. సానుకూల జాబితాలో ఏ విధంగా ఈ కంపెనీలు చోటు సంపాదించాయో అందరికీ బాగా తెలుసు. ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించే నిర్ణయాన్ని ప్రకటించడానికి ముందు కార్పొరేట్ సంస్థలు ప్రత్యేకించి, అదానీ, అంబానీలకు చెందిన వాటితో మోడీ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకొంది. కాగా, లాభాలార్జించే నైకాశ్రయాలు, దానికి సంబంధించిన వ్యాపారాన్ని అదానీలు చేజిక్కించుకోబోతుండగా, ఇంధనం, పెట్రోలు, డీజిల్, గ్యాసుకు సంబంధించిన నిర్వహణలపై అంబానీల గుత్తాధిపత్యానికి మోడీ ప్రభుత్వం సానుకూలంగా వుంది. ఇప్పటికే అత్యధిక చమురు వనరులను అంబానీలు చేజిక్కించుకొన్నారు. ఇంధన సరఫరాల కొరకు అంబానీలపై ఆధారపడేటట్లు చేయడానికి రైల్వేస్ వంటి సంస్థలపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రభుత్వం వారికి లబ్ధి చేకూర్చుతోంది. ఒక్కసారి వారు గుత్తాధిపత్యం సాధించి, చమురు, ఖనిజ వాయువు సంస్థ (ఓఎన్‌జీసీ) వంటి లాభాలనార్జించే వాటిని నిర్మూలించినట్లయితే అంబానీలకు ఇక అడ్డూ ఆపు వుండదు. ఇంధన మార్కెట్‌ను నియంత్రించే సర్వస్వతంత్రులుగా మారిపోయి, వారు కోరుకున్న ధరలను వసూలు చేస్తూ వసూలురాజాలైపోతారు. మోడీ సర్కారు కార్పొరేట్లకు రాయితీలపై రాయితీలు కురిపించడానికి మాత్రమే పరిమితం కావడం లేదు. అదే సమయంలో లక్షలాది మంది పేద ప్రజలకు ఉపాధులు, భుక్తి నిరాకరించబడే విధంగా కూడా మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్ననాడే సింగిల్ బ్రాండ్ రిటెయిల్‌లో నూరుశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) అనుమతించాలని కూడా నిర్ణయించింది. వాస్తవంగా యూపీఏ-2 ప్రభుత్వ పాలనలోనే ఈ నిర్ణయం తీసుకోబడింది. అయితే, ముందుగా ప్రభుత్వం అనుమతి వంటి కొన్ని షరతులను అది విధించింది. కానీ, ఇప్పుడటువంటి షరతులన్నీ తొలగించబడ్డాయి. ఇంతకు ముందు నిర్ణయంలో విదేశీ రిటెయిలర్లు వారికి కావలసిన అవసరాలలో 30 శాతం స్థానిక మార్కెట్ల నుండి సేకరించాలన్న షరతు వుంది. ఆ షరతును కూడా ఇప్పుడు మోడీ ప్రభుత్వం తొలగించి వారికి స్వేచ్ఛను కలుగజేసింది. రిటెయిల్ వ్యాపారంలో విదేశీ పెట్టుబడిదారులు ఇప్పుడు వారు కోరుకున్నవి విక్రయించుకోవచ్చు, వారికి ఇష్టమొచ్చిన చోట నుండి వాటిని సమీకరించుకోవచ్చు. ప్రస్తుతానికి సింగిల్ ట్రేడ్ (ఏక వాణిజ్యం)కి మాత్రమే ప్రభుత్వం పరిమితమైంది. అయితే ఇవే సౌకర్యాలను మల్టీ-బ్రాండ్ విదేశీ రిటెయిలర్లకు కూడా కల్పించడానికి ప్రభుత్వం సంశయించదన్నది వాస్తవం.

మన దేశంలో రిటెయిల్ వ్యాపారం గరిష్ఠ ఉపాధిని, చిన్న వ్యాపారులకు జీవన భృతిని కల్పించే రంగం. అటువంటి రంగాన్ని, ఎఫ్‌డీఐలకు బార్లా తలుపులు తెరచి, కోట్లాది భారతీయులు వారి జీవన భృతిని కోల్పోయేటట్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అత్యంత దారుణం. ఇక్కడ ఇంకొక విషయం కూడా గుర్తుచేయాలి. యూపీఏ ప్రభుత్వం అటువంటి నిర్ణయం తీసుకున్నప్పుడు దాన్ని బీజేపీ వ్యతిరేకించింది. ఇప్పుడు అధికారంలో వుండి అత్యంత క్రూరమైన నిర్ణయం తీసుకోవడం మోడీ ప్రభుత్వ నైజాన్ని బహిర్గతం చేస్తోంది. వార్షిక దావోస్ ప్రపంచ ఆర్థిక ఫోరం (డబ్లుఇఎఫ్)లో ప్రపంచ పెట్టుబడిదారుల నుద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించడానికి కొన్ని రోజులు ముందుగా రిటెయిల్, పౌర విమానయానం, నిర్మాణం, పవర్ ఎక్చేంజెలు వంటి కీలక రంగాల్లో ఎఫ్‌డీఐ నిబంధనలను బుధవారం కేంద్రమంత్రి వర్గ సమావేశం సులభతరం చేయడం యాదృచ్ఛికం కాదు. తాము సాధించిన 'విజయాలను' దావోస్‌లో ఏకరువురు పెట్టడానికే మోడీ ఈ నిర్ణయం తీసుకొన్నట్లుగా కనిపిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం గానీ, గత ప్రభుత్వం గానీ తీసుకున్న ఆర్థిక నిర్ణయాలన్నీ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సాధానాల ఆదేశాలకు తలొగ్గి తీసుకున్నవే అనేది వాస్తవం. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) విధించిన షరతులు అమలు చేయడం వల్లనే మన రైతులు కష్టాలను ఎదుర్కొని, దుస్థితి కారణంగా బలవన్మరణాలకు పాల్పడ్డారు. భారీగా దిగుబడులు వచ్చిన రకం వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రభుత్వ నిషేధ సాధనాలు ఉపయోగించడమో లేదా అవే ఉత్పత్తులను దిగుమతి చేసుకొని, రైతులకు గిట్టుబాటు ధర లభించకుండా రైతులను మోడీ ప్రభుత్వం నానా యాతనలకు గురి చేసింది. కేంద్రం అనుసరిస్తున్న నయా-ఉదారవాదాన్ని, జాతీయ సంపదలను విదేశీ కంపెనీలకు ధారాదత్తం చేయడానికి మోడీ ప్రయత్నాన్ని భారీ జనసమీకరణతో ఐక్య ఉద్యమాలు నిర్వహించడం ద్వారా తిప్పికొట్టాలి.

చురక

వ్యాపారం మాయలేడి
వలపు వన్నె కప్పబడి
కాలుష్యం నింపబడి
కాటు వేసే వెంటబడి

ఆరోగ్యం అదుపు చేసే
ఆహారం గాలి నీరు
అన్ని మాఫియాల చేత
అనారోగ్య సృష్టివాత

- వేల్పుల నారాయణ

విశ్లేషణ

అన్నదాత ఆగ్రహానికి కళ తప్పిన మోడీ సర్కారు

విశ్వనాథ్ వై.

సంక్షుభిత వ్యవసాయ రంగాన్ని గాడిన పెట్టకుంటే రానున్న 2019 ఎన్నికల్లో అధికారాన్ని నిలబెట్టుకోలేమన్న అభిప్రాయానికి బీజేపీ ప్రభుత్వం వచ్చినట్లుంది. ఇందుకు వారి ఎదుట ఉన్న చిట్టచివరి అవకాశం ఫిబ్రవరి ఒకటిన ప్రవేశపెట్టనున్న కేంద్రబడ్జెట్. ఈ బడ్జెట్లో వ్యవసాయ రంగానికి ఇచ్చే ప్రాధాన్యత, కేటాయింపులను బట్టే దేశంలోని వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల కుటుంబాల సంక్షేమానికి బీజేపీ ఇస్తున్న ప్రాధాన్యత ఎంతనేది తేలిపోతుంది. 2022నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న ప్రధాని నరేంద్రమోడీ సర్కారు మాటలు ఆచరణ సాధ్యం కాదని తేలిపోవడంతో కొత్త చిట్కాల వేటలో బీజేపీ నిమగ్నమైంది. 2019 బడ్జెట్ ముందస్తు కసరత్తులో భాగంగా బుధవారం ఆర్థికవేత్తత లతో ప్రధాని మోడీ సమావేశమైనారు. వ్యవసాయ, తయారీ, ఉద్యోగ కల్పన, పారిశ్రామిక, మహిళ, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యతనీయాలని మోడీకి ఆర్థికవేత్తలు సూచించినట్లు తెలుస్తోంది.



అన్నదాతల వినూత్న నిరసన (ఫైల్‌ఫోటో)

ఈ నాలుగు సంవత్సరాల్లోనూ అన్నదాతల ఆవేదన ఆలకించడంలో, ఆత్మహత్యలు నివారిం చడంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఆగ్రహాన్ని చల్లార్చలేక పోయింది. శాంతియుతంగా ప్రదర్శన జరిపే రైతుల మీద తుపాకీ తూటాల వర్షం కురిపించింది ఐదుగురు రైతుల ప్రాణాలను బలిగొంది. గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాపితంగా విస్తరించిన సుమారు 180 రైతు సంఘాలు సంఘటితమై ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించడమే మోడీ సర్కారు వైఫల్యానికి నిదర్శనం. వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పనకుగాను డా.స్వామినాథన్ కమిషను సిఫారసులను అమలు చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ డిమాండ్‌ను మోడీ సర్కారు కనీసం ఆలకించిన దాఖలాలు కూడా కనిపించడం లేదు. కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌ఓ) జారీ చేసిన వివరాల ప్రకారం వ్యవసాయ, అటవీ, మత్స్య రంగాల పురోగతి సగానికి సగం పడిపోయినట్లు పేర్కొంది 2017-18ఆర్థిక సంవత్సరంలో ఈరంగాల్లో స్థూల విలువ జోడింపు(జీవీఏ) గత సంవత్సరం నమోదైన 4.9శాతం కంటే తక్కువగా 2.1శాతంగా ఉంటుందని అంచనా కట్టింది

భారతీయ జనావళి ఆహార భద్రతకు, ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయరంగం గుండెకాయలాంటిదని చెప్పాలి. రాజ్యాంగం లోని ఏడవ షెడ్యూలు ప్రకారం వ్యవసాయరంగం రాష్ట్ర పరిధిలో ఉంది. ఉపాధి కల్పనలో మొత్తం దేశీయ శ్రామిక శక్తిలో వ్యవసాయ రంగం 48.9శాతం వాటాను ఆక్రమించింది. దేశ జనాభాలో 58శాతానికిపైగా జనాభాకు ప్రధాన జీవన వనరు. 2015-'16 సంవత్సర ఆర్థిక అధ్యయనం ప్రకారం స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో వ్యవసాయరంగం వాటా 17.4శాతంగా ఉంది. గ్రామీణ యువతకు తయారీ రంగంతో పోటీపడి పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తున్న రంగం ఏదన్నా ఉందంటే అది వ్యవసాయ రంగమే. లక్షలాది మందికి స్వయం ఉపాధి వనరుగానూ నిలుస్తోంది. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలు పశుసంపద, అడవులు, మత్స్య పరిశ్రమలన్నీ కలుపుకుంటే 2011-12ధరల ప్రకారం 2016-17 స్థూల విలువ జోడింపు (జీవీఏ)లో 17.3శాతం వాటాను కలిగి ఉన్నాయి. మొత్తం ఆహార మార్కెట్లో ఆహార శుద్ధి ప్రాసెసింగ్ వాటా 32శాతం ఆక్రమించింది. 2016-17 లో ఆహారధాన్యాల ఉత్పత్తి 271.98 మిలియను టన్నులుగా ఉంటుందని అంచనా. గోధుమలు 96.6 మిలియను టన్నులు, తృణధాన్యాల ఉత్పత్తి 22.14 మిలియను టన్నులుగా ఉంటుందనేది అంచనా. కాగా, 2017లో వరి ఉత్పత్తి వ్యయం టన్నుకు సుమారు రూ.11 వేలు ఉండగా ఆదాయం సుమారు రూ.10 వేలకు పరిమితమవుతోందని సమాచారం.

2013-14లో జీడీపీలో 18శాతంగా ఉన్న వ్యవసాయ రంగం వాటా 2016-17లో 14శాతానికి దారుణంగా పతనమైంది. భవిష్యత్తులోనూ ఈపతనం కొనసాగుతుందని నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్ ఫార్మింగ్ ఇండియా (నీతి) అయోగ్ ముందస్తు అంచనాగా ఉంది. మొత్తం ఉత్పత్తిలో 35శాతం, వ్యవసాయోత్పత్తిలో 40శాతం మాత్రమే నిల్వచేయగల అరకొర వ్యవస్థ దేశంలో ఉంది. ఫలితంగా గిట్టుబాటు ధర వచ్చే వరకు వివిధ వ్యవసాయోత్పత్తులను నిల్వ చేయడం సాధ్యంకాక ఏటా సుమారు రూ.96,000కోట్ల మేర వృథా అవుతోంది. ఎరువుల,పంటల రాయితీల్లో హేతుబద్ధీకరణ సాధించాల్సిన అవసరాన్ని బీజేపీ సర్కారు గుర్తించినట్లుగా లేదు.

జాతీయ నమూనా అధ్యయన కార్యాలయం సేకరించిన గణాంకాల ప్రకారం దేశంలోని 52శాతం వ్యవసాయ కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. దేశంలోని మొత్తం సాగు భూమిలో 52శాతం వ్యవసాయ క్షేత్రాలు సాగులో లేవు. సంప్రదాయ సాగు విధానాలకు బదులుగా సంప్రదాయేతర సాగు విధానాలు-బిందు సేద్యం, స్ప్రింక్లర్, మైక్రో స్ప్రింక్లర్ సాగుకు రైతులు మొగ్గు చూపలేక పోతున్నారు. ఈ విధానాల అమలుకు కాగల అధిక వ్యయ భారాన్ని మోయలేని స్థితిలో రైతులు ఉండటమే ఇందుకు కారణమని నిపుణులు తేల్చారు. అలానే చొచ్చుకు వచ్చే యంత్రీకరణ వ్యయ్ప ప్రయాసలనూ తట్టుకోజాలకున్నారు.

దేశీయ ప్రధాన 51వ్యవసాయోత్పత్తుల్లో కేంద్ర ధర నిర్ణాయక యంత్రాంగం కేవలం 14వ్యవసాయోత్పత్తులకు మాత్రమే వర్తించేదిగా ఉండటం విషాద కరం. వరి, గోధుమ, పప్పుధాన్యాలకు వర్తింపజేసిన ధర నిర్ణాయక నిబంధనలను కూరగాయలకు వర్తింపజేయక పోవడంతో ఆయా వ్యవసాయోత్పత్తుల మీద ఆధార పడిన లక్షలాది మంది రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా కూరగాయల సాగు మీద ఆధారపడిన రైతులు ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో ఎక్కువగా ఉన్నారు గత సంవత్సరం గిట్టుబాటు ధర కాదు కదా కూలి కష్టం కూడా దక్కని మార్కెట్ పరిస్థితికి నిరసిస్తూ బంగాళాదుంపలు, టమాటో, ఉల్లి, నిమ్మకాయలు వంటి పంటలను బజారున పోసేశారు. రాజస్థాన్, మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్, గుజరాత్ రైతులు అన్ని విధాలుగా నష్టపోయారని చెప్పాలి. రైతుల రుణభారమనేది ఒక్కో రాష్ట్రానికి ఒక్కో విధంగా ఉంటోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఈరుణ భారం 93 శాతంగా ఉండగా మేఘాలయలో 2.4శాతంగానే నమో దు కావడం గమనార్హం. దేశంలోని మొత్తం 90మిలియన్ల వ్యవసాయ కుటుంబాల్లో 70శాతం కుటుంబాలు ఒక నెలకు సగటు ఆదాయానికి మించి వ్యయం చేయాల్సి వస్తోంది. దీనికై చేసిన అప్పుల భారంతో 2017లో 8,007 మంది రైతులు, 4,595మంది వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. గతేడాది సుమారు రూ.10వేల కోట్లను ప్రీమియం రూపంలో రైతుల కష్టార్జితాన్ని బీమా కంపెనీలు దోచుకున్నాయని సీఎస్ఈ తన నివేదికలో తెలిపింది.

వ్యవసాయ, సహకార విభాగం సమకూర్చిన సమాచారం ఆధారంగా కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్ఓ), గణాం కాలు, పథకం అమలు మంత్రిత్వశాఖ రూపొందించిన నివేదిక ప్రకారం ప్రస్తుత ఖరీఫ్‌లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 134.67మిలియను టన్నులుగా ఉంటుందని అంచనా. కాగా, గత సంవత్సర దిగుబడులు 138.52మిలియను టన్నులతో పోల్చితే ఇది తక్కువ. ప్రభుత్వం, వ్యవసాయశాఖ సహా ఇతర శాఖలు, విభాగాలు వివిధ సందర్భాల్లో జారీ చేసిన పత్రాలు, ప్రదర్శించిన స్లైడ్‌షోలు, ప్రజంటేషన్లు, పలు కమిటీల నియామకాలు, బుర్రతిరిగే సమావేశాలకే మోడీ సర్కారు చర్యలు పరిమితమైనాయి. క్షేత్ర స్థాయిలో ఫలితాలు నిరాశా జనకంగా కానవస్తున్నాయి. ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వివిధ రకాల పథకాలను సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందంటూ వ్యవసాయ, కార్పొరేషన్, రైతుల సంక్షేమ విభాగం సూచననూ ప్రభుత్వం ఆలకించిన దాఖలాల్లేవు. ఇక ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై), ప్రధాన మంత్రి కుషి సంచాయి యోజన (పీఎంకేఎస్‌వై)లు ప్రచార ఆర్భాటం మినహా ఆచరణలో నామమాత్రంగానే మిగిలిపోయాయి.

అధిక జనాభా, స్వల్ప ఆదాయాలు, విలువ జోడింపులో తక్కువ వాటా, జీవీఏలో పడి లేచే వృద్ధిరేటు తదితరాలు దేశీయ వ్యవసాయరంగ ముఖచిత్రాన్ని నీరసింపజేశాయి. ఇవన్నీ పుంజుకోవాలంటే జాతీయ స్థాయిలోనే తగిన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని పార్లమెంటరీ కమిటీ అభిప్రాయపడింది. అయితే ఈఅభిప్రాయాన్ని ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాల్లేవు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన విభిన్న వ్యూహాలు పరస్పర ప్రయోజనాలకు విఘాతం కలిగించ కుండా చూడాలన్న సూచననూ మోడీ సర్కారు పట్టించుకోలేదనే విమర్శలు వినవస్తున్నాయి.

వాస్తవానికి, వ్యవసాయ రంగానికి ఎదురవుతున్న ప్రధాన సమస్య పెట్టుబడులు. రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు, సహకార రంగాల నుంచి పెట్టు బడులు సమకూరడం లేదు. 12వ పంచవర్ష ప్రణాళిక (2012-17)లో రూ.3,23,024కోట్లు అవసరమని వ్యవసా యశాఖ ప్రతిపాదించింది. అయితే ఇందులో కేవలం 41.80 శాతాన్ని మాత్రమే ప్రభుత్వం కేటాయించింది. ఆమోదించిన రూ.1,34,746కోట్లలోనూ కేవలం రూ.88,322కోట్లను మాత్రమే ప్రభుత్వం వ్యయం చేయగలిగింది. ప్రైవేటు పెట్టు బడుల మీద రైతులు ఆధారపడకుండా చేయడంలోనూ ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.

చిట్టచివరగా చెప్పుకుంటున్నప్పటికీ అత్యంత ముఖ్యమైనవి బీజేపీ సర్కారు ఏకపక్షంగా అమలు జరిపిన పెద్ద నోట్ల రద్దు, అస్తవ్యస్థంగా రూపొందించిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ), ఈరెండు సంస్కరణలు దెబ్బ తీయని రంగం లేదంటే అతిశయోక్తి కాదు. బ్యాంకుల్లో పారుబకాయిలు పేరుకు పోవడానికి కారణమైన యం త్రాంగం మీద కాక బ్యాంకుల సుస్థిరతకు కారకులైన కోట్లాది మంది పొదుపరుల ఆర్థిక భద్రతను సందేహం లోకి నెట్టేందుకు వెనుకాడటం లేదు. ఇందుకుగాను రూపొందించిన ఫైనాన్షియల్ రిజల్యూషన్, డిపాజిట్ ఇన్సూరెన్స్ (ఎఫ్ఆర్‌డీఐ) బిల్లు రూపంలో మొత్తం బ్యాంకింగు రంగాన్ని తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను చిదిమేసేందుకు బీజేపీ సర్కారు అప్రకటిత ప్రయోజన లబ్ధికి తొందరపడుతోంది. ఆర్థికరంగ విచ్ఛిత్తికి అనుసరించే ఆర్థిక విధానాల తరహాలోనే కుల, మత, ప్రాంతీయ, జాతీయోన్మాద విద్వేషాలు రెచ్చగొట్టి సామాజిక విచ్ఛిత్తికి పాల్పడుతోంది. 10శాతంగా ఉన్న కార్పొరేట్ల లబ్ధి కోసం 90శాతం సామాన్యుల ప్రయోజనాలు, హక్కులను కాలరాస్తోంది. హక్కులను నిలబెట్టుకోవాలన్నా, ప్రజాస్వామ్య, రాజ్యాంగ మౌలిక విలువలను పరిరక్షించుకోవాలన్నా 2019 ఎన్నికల్లో మోడీ సర్కారును గద్దె దింపాల్సిన అవసరం ఉంది. ఏరాష్ట్రానికి ఆరాష్ట్రంలో అన్నట్లుగా చీలిన ప్రతిపక్ష రాజకీయ శక్తులు సంఘటితమై 'మహా సంఘటన' గా ఆవిర్భవించాలి. రానున్న ఎన్నికల్లో బీజేపీ కూటమిని అధికారానికి దూరం చేయాలి.

కిరాతక కల్తీ మాఫియా వెన్ను విరిచేలా ఆహార తనిఖీ విభాగాల్ని ప్రక్షాళించాలి. చట్టాల్లో గరిష్ఠ దండనకు వీలు కల్పించడం, అత్యాధునిక కల్తీ నిర్ధారణ ప్రయోగశాలల్ని ఏర్పరచడం, ఉప్పందగానే దాడి చేసి దారులన్నీ మూసెయ్యడం ద్వారా- కల్తీ చేద్దామంటేనే హడలెత్తిపోయే వాతావరణం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కల్తీపై కఠిన చర్యలేవీ!?

చూస్తూ ఊరుకుంటే మేస్తూ పోయిన చందంగా తయారైంది.. ఆహార కల్తీ అక్రమాల తీవ్రత. ఒక పక్క ఆహారోత్పత్తుల ధరలు ఆకాశానికి ఎగబాకుతుంటే ఎలా కొనేది అని దిక్కులు చూసే పరిస్థితి నెలకొంది. అప్పోసప్పో చేసి కొనుగోలు చేస్తే.. తినగలమా అనే ప్రశ్న తలెత్తుతోంది. జనారోగ్యాన్ని కసిగా చిదిమేస్తున్న కల్తీ ఉరవడి తారెత్తిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో విశృంఖలంగా సాగుతున్న కల్తీ మాయాజాలాన్ని గమనించిన హైకోర్టు 'కల్తీ నివారణకు అధికారుల్లో చిత్తశుద్ధి లేదు... వ్యాపారులకు లాభాపేక్ష తప్ప ప్రజారోగ్యం పట్టదు... చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రభుత్వాలు సరిపెడితే చాలదు. ఇంకా ఏదో చెయ్యాలి' అంటూ తీవ్రస్థాయిలో మందలించింది. 'ఏడాదికోసారి తనిఖీలు చేస్తే ఫలితం ఎలా వస్తుంది?' అని కూడా ప్రశ్నించింది. కొద్ది నెలల కిందట కేంద్ర లా కమిషన్ కూడా చాలా కఠినమైన సిఫార్సు చేసింది. కల్తీల వల్ల మరణాలు సంభవిస్తే అందుకు బాధ్యులైనవారికి యావజ్జీవ శిక్ష విధింపును పరిగణించాలని సూచించింది. ఆహార పదార్థాలు, పానీయాల కల్తీకి పాల్పడినా విక్రయించినా ప్రస్తుతం భారత శిక్షాస్మృతిలోని 272, 273 సెక్షన్ల ప్రకారం- ఆరు నెలల కారాగారం లేదా వెయ్యి రూపాయల జరిమానా లేదా రెండూ విధించే వీలుంది. లా కమిషన్- కల్తీ వల్ల ఎటువంటి హానీ లేకున్నా, హాని తీవ్రత తక్కువగా ఉన్నా వాటిని బెయిలు పొందగల నేరాలుగా పరిగణించా లంటోంది. నేరాన్ని బట్టి ఆరు నెలలనుంచి ఏడాది వరకు జైలు, గరిష్ఠంగా మూడు లక్షల రూపాయల జరిమానాల్ని ప్రతిపాదిస్తోంది. హాని తీవ్రత అధికంగా ఉన్నట్లయితే బెయిలు దక్కనివ్వకుండా అయిదు లక్షల రూపాయల జరిమానాతో పాటు ఆరేళ్లవరకు చెరసాలలో మగ్గబెట్టాలనే ప్రతిపాదన చేసింది. కల్తీ మూలాన మరణం సంభవించిన పక్షంలో అంతకు రెండింతల జరిమానా, అధమ పక్షం ఏడేళ్ల జైలునుంచి యావజ్జీవిత శిక్ష విధించాలని జస్టిస్ బీఎస్ చౌహాన్ సారథ్యంలోని కమిషన్ సిఫార్సు చేసింది. 2006 నాటి ఆహార భద్రత, ప్రమాణాల చట్టం(ఇది 2010నుంచి అమల్లోకి వచ్చింది)- రాష్ట్రాలు తగినన్ని ప్రయోగశాలలతో పాటు తగిన సంఖ్యలో ఆహార పర్యవేక్షకులు, ఇతర సిబ్బందితో యంత్రాంగాన్ని సిద్ధం చేసుకోవాలని పేర్కొంది. చిన్న రాష్ట్రమైన గోవాలో 24మంది, అండమాన్ నికోబార్ దీవుల్లో 22మంది ఆహార కల్తీ గుర్తించే అధికారులు ఉండగా, తమిళనాట 521మంది కొలువుతీరారు. పరిస్థితి తీవ్రత దృష్ట్యా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చెరో ఆరొందల మంది ఇన్‌స్పెక్టర్లు అవసరమైనా ఆంధ్రప్రదేశ్‌లో 14మంది, తెలంగాణలో 24మంది మాత్రమే ఉన్నారు. దేశవ్యాప్తంగా 72 ఆహార నాణ్యత పరీక్షాలయాలుంటే, వాటిలో 65 సంబంధిత జాతీయ ధ్రువీకరణ సంస్థ ద్వారా గుర్తింపునకు నోచుకోనివేనని కాగ్ తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో మనిషికి ప్రాణాధారమైన ఆహార పదార్థాల పరీక్షల నాణ్యతకు భరోసా ఏముంటుంది. ఆహారోత్పత్తుల తయారీదారులు ఇచ్చే అసమగ్ర సమాచారం ఆధారంగానే 50 శాతం అనుమతులు దక్కుతున్నాయని 'కాగ్' పేర్కొంది. కిలో పంచదార, కిలో యూరియాలో ఒక నూనె ప్యాకెట్. అయిదు లీటర్ల పాలలో మరో 15 లీటర్ల నీళ్లు కలిపి 20 లీటర్ల పాలు అమ్మకానికి సిద్ధం చేస్తున్న ప్రబుద్ధులున్నారు. ప్రమాదకర రంగులు, వ్యర్థాల వినియోగంతో కల్తీ 'టీ' పొడి తయారీ ముఠాల వ్యాపార పరిమాణం వందలకోట్ల రూపాయలకు చేరిందన్న వాస్తవం ఇటీవల బయటపడింది. కూరగాయల్లో ప్రమాదకర కీటక నాశనుల అవశేషాలు ప్రజా రోగ్యాన్ని కబళిస్తుంటే, వంటలకు వినియోగించే పసుపు, కారం, మసాలా దినుసులు, నూనెలు, పోపు గింజలు... ఇలా అన్నీ కల్తీలతో పుచ్చి బెంబేలెత్తిస్తు న్నాయి. మలేసియా నుంచి దిగుమతి చేసుకొన్న పామాయిల్‌కు 20 శాతం వేరుశెనగ నూనె కలిపి 17 ఏళ్లుగా ఏటా వందలకోట్ల రూపాయల వ్యాపారం సాగించిన ఓ ప్రబుద్ధుణ్ని గత ఏడాది అక్టోబరులో పట్టుకున్నారు. పశువుల కొవ్వుతో కృత్రిమ వంటనూనెల తయారీ తెలుగు రాష్ట్రాల్లో కుటీర పరిశ్రమగా ఎదిగినా పట్టించుకొంటున్న నాథుడు లేడు! అప్పడాలు, పచ్చళ్లు, సున్నుండలు, చివరకు పిల్లలు తినే చాక్లెట్లూ కల్తీల పాలబడి జీర్ణకోశ వ్యాధులు, మూత్రపిండాలు, కాలేయం దెబ్బతిని పోవడం వంటి జబ్బులు వెంటాడుతున్నాయి. ఇటీవల కృష్ణాజిల్లాలో ఏకంగా కుక్క మాంసాన్ని అడవి జంతువుల మాంసంగా విక్రయిస్తున్న ఘాతుకం వెలుగులోకి వచ్చింది.

లోచనం

ఆహార కల్తీని నివారించడానికి 1954లో కేంద్రప్రభుత్వం అప్పటిదాకా ఉన్న వివిధ చట్టాలను పక్కనబెట్టి ఆహార కల్తీ నిరోధక చట్టాన్ని తెచ్చింది. తిరిగి 2006లో ఆహార భద్రత, ప్రమాణాల చట్టం తెచ్చింది. వ్యాపార వర్గాల లాబీ ఒత్తిళ్లకు తలొగ్గి శిక్షల కరకుదనాన్ని తగ్గించడంతో దేశవ్యాప్తంగా కల్తీల విశ్వరూపానికి పాలకులు కారణమయ్యారు. పిల్లలు తాగే పాలు, తినే బిస్కెట్లూ కల్తీల పాలబడి దేశ భవిష్యత్తుపైనే భయసందేహాలు ముప్పిరిగొంటున్నవేళ- ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో అమలులో ఉన్న కఠిన శిక్షల్ని కేంద్రచట్టంలోకి తెస్తూ సవరణలు చెయ్యాలని సర్వోన్నత న్యాయస్థానం ఇప్పటికే సూచించింది. ఆహార భద్రతా చట్టాన్ని అన్ని విధాలుగా పరిపుష్టీకరిస్తామన్న హామీలు ఏళ్ల తరబడి వినిపిస్తున్నా, అందుకు తగిన కార్యాచరణ మాత్రం కొరవడుతోంది. గాలి, నీరు, తిండి- అన్నింటా కాలుష్యం, కల్తీల ఉరవడి 'ఆరోగ్యానికి దేశీయ చట్టబద్ధ రక్షణ'ను క్రూరంగా అపహసిస్తోంది. కఠినమైన చట్టాలు లేక, ఉన్నవీ సరిగ్గా అమలుకు నోచక, నిస్తేజమైన నిఘా పర్యవేక్షణ యంత్రాంగం కారణంగా దేశం నలుమూలలా కల్తీ ముష్కరులు రెచ్చిపోతున్నారు. వాళ్లను వలవేసి పట్టుకుని నేరతీవ్రతకు తగ్గట్లు కఠినంగా దండించడమొక్కటే సరిపోదు. ఆహార పదార్థాలు, పానీయాల కల్తీ ఎక్కడా జరగకుండా నివారించే పటిష్ఠ ఏర్పాట్లు నెలకొల్పాలి. రసాయనాలు కలగలసిన కల్తీ రకాలతో జనం కళ్లలో కారం కొడుతున్న బాగోతాలు మొన్నీమధ్య ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గగ్గోలు పుట్టించాయి. అయిదు రకాల శీతల పానీయాల్లో హానికారక సీసం, కాడ్మియం, క్రోమియం వంటి భార లోహాలున్నట్లు వెల్లడైందని రాజ్యసభకు కేంద్రసర్కారు గత ఏడాది అక్టోబరులో లిఖిత పూర్వకంగా వెల్లడించింది. కాబట్టి కల్తీమూకల భరతం పట్టడంలో చొరవ చూపాలంటూ సర్వోన్నత న్యాయస్థానం చేసిన ఉద్బోధ పాలకులు పట్టించుకోకపోతే కల్తీ మాఫియా మరింతగా విజృంభించే ప్రమాదం, తద్వారా జనారోగ్యం రోగాలు పాలయ్యే ముప్పు పొంచి ఉంది.

- జ్యోతి

ఐ-మెయిల్

సంక్రాంతి తేదీల వివాదంపై ... మన పంచాంగాలను మార్చుకోవాలి !

సంక్రాంతి పండుగ తేదీలు గురించి పంచాంగ కర్తలలో భిన్నాభిప్రాయాలున్నట్లు ఇటీవల పత్రికలలో వచ్చింది. కొందరు జనవరి 14 కాదు 15 అంటూండగా, కీ.శే. మథుర కృష్ణమూర్తి శాస్త్రిగారి కుమారుడు జనవరి 11నే సంక్రాంతి అని ప్రకటించటమే కాక పై వారిని ఖగోళ శాస్త్ర రీత్యా రుజువు పరచమని కూడా సవాలు విసిరినట్లు పత్రికలు రాశాయి. ఈ సందర్భంగా మన పంచాంగాలకు వున్న పరిమితులు , అశాస్త్రీయతలలో కొన్నింటిని విజ్ఞుల దృష్టికి తీసుకు రావటం అవసరమని భావించి ఈ లేఖ రాస్తున్నాను.

1 . మన సౌర కుటుంబానికి సూర్యుడు కేంద్రం కాగా పంచాంగాలు భూమిని కేంద్రంగా ఇప్పటికీ భావిస్తున్నాయి . గెలీలియో, కోపర్నికస్‌లు 500 సంవత్సరాలకు పూర్వమే భూ కేంద్ర సిద్ధాంతం తప్పని రుజువు పరిచారు. ఈ తలక్రిందులు అవగాహనను నిటారుగా నిలుపుకోవాలి.

2. మన గుడులూ, గోపురాలలో వుండే నవ గ్రహాలలో భూమి ఉండదు. గ్రహం కాని సూర్యుడు (నక్షత్రం) ఉంటాడు. భూమికి ఉప గ్రహమైన చంద్రుడు ఉంటాడు. కేవలం గ్రహణ సమయాలలో ఏర్పడే నీడలను రాహు, కేతు గ్రహాలుగా దుష్టతత్వాన్ని ఆపాదించి ప్రజలను భయ పెట్టటాన్ని ఆపు చేయించాలి. భూమిని సూర్యుని చుట్టూ చలిస్తున్న గ్రహంగా మార్పు చేసుకోవాలి.

3. సంక్రాంతి పండుగకు ప్రాతిపదిక దక్షిణాయనం పోయి ఉత్తరాయణానికి భూచలనంలో మార్పు సంభవించటంగా మన సంస్కృతిలో ఇమిడి వుంది. అది డిసెంబర్ 22న జరుగుతూ ఉందని ఆధునిక విజ్ఞాన శాస్త్రాలు చెపుతున్నాయి. ఉత్తరాయణం జనవరి 14న కాదు. సూర్యుడు మకర రాసిలోకి ప్రవేశించేనాటికి 23రోజుల ముందుగా ఉత్తరాయణం ప్రారంభమవుతుంది. అంటే జనవరి14 నాటికి 'పుణ్యకాలం' 23 రోజులకు ముందే గడిచి పోయిందన్నమాట!.

5. క్రీ.శ. నూరవ సంవత్సరం నుండి 2250వ సంవత్సరం దాకా ఉత్తరాయణం ధనుస్సు రాశిలో సంభవిస్తూ వుంది. ఇంకా 233సంవత్సరాలు అలాగే ఉంటుంది. అదే మకర రాశిలో గతంలో సంభవించిన మాట నిజమే. (క్రీ.పూ.2050 నుండి క్రీ.శ.100 దాకా) అందుకు కారణం ప్రతి 25,800 సంవత్సరాల కొకసారి భూమి తన మూడవ అక్షం (యాక్సిస్) మీద 360డిగ్రీలు అంటే ఒక పూర్తి ఆత్మ ప్రదక్షణం చేస్తూ ఉండటం. కనుక ప్రస్తుత సంక్రాంతిని ధనుస్సం క్రమణంగా పరిగణించాలన్న మాట. మకర సంక్రమణంగా కాదు.

6. ప్రభుత్వాలు భూ కేంద్రం మీద ఆధార పడిన పంచాగకర్తలపైనకాక ఆధునిక ఖగోళ శాస్త్ర విజ్ఞానాలపై ఆధారపడాలి. పిల్లలకు పాఠాలుగా చెప్పే సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని తానూ నమ్మక పోతుంటే బహిరంగంగా ప్రకటించాలి. అలా చేయకుంటే సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని ప్రచారం చేయటానికి ప్రాణాలనే బలి ఇచ్చిన లియార్డినో బ్రూనే లాంటి వారి త్యాగాలను అపహాస్యం చేసినట్లవుతుంది.

మన పూర్వీకుల నాటి ఖగోళ శాస్త్రజ్ఞులయిన ఆర్యభట్టు , వరాహమిహిరుడు, బ్రహ్మగుప్తుడు, భాస్కరాచార్యుడు లాంటివారు పరిమిత పరికరాలతో, భూ కేంద్రంగానే అయినా గ్రహచలనాలను సాపేక్షంగా నిర్ధారించి స్థూల కాల గణనను చేయగలిగారు . అవి తదనంతర కాలపు శాస్త్రజ్ఞులకు ఆలంబనగా తోడ్పడ్డాయి. అభివృద్ధి చెందుతున్న విజ్ఞాన శాస్త్రాలపై ఆధారపడిన కాలగణన మాత్రమే మరిన్ని నూతన ఆవిష్కరణలతో తన గత కాలపు కొరతలు సవరించుకుంటూ ముందుకు సాగుతుంది. మార్పును నిరాకరించేవి, కొరతలు పూరించుకోలేనివి శాస్త్రాలుగా కాక మూఢ విశ్వాసాలుగా మిగిలిపోతాయి. అందుకే పంచాంగాలను నేటి ఖగోళ శాస్త్ర ఆవిష్కరణల ప్రాతిపదికగా సరిదిద్దుకునేందుకు సిద్ధం కావాలి.

- దివికుమార్, జనసాహితి, 9440167891

Dwaraka

విశాలాంధ్ర

బతుకు
The Life

శుక్రవారం
12 జనవరి 2018

హైలెస్సో... హైలెస్సో..!

రేపటి నుంచే నాగాయలంకలో పడవ పందాలు!!



సంక్రాంతి పండగ అంటే....పిండివంటలు, రంగవల్లికలు, భోగిపళ్ళు, బొమ్మలకొలువులు, గాలిపటాలే కాదు పందాల పండగ కూడా. పందాలు అనగానే ముందుగా గుర్తుకొచ్చేది కోడి పందాలే. ఈ సీజన్‌లో జరిగే పందాలు ఇదొక్కటే కాదు ఎడ్ల పందాలు, గొర్రెలు, పొట్టేళ్ళ పందాలు కూడా జరుగుతాయి. వీటన్నింటితో పాటు ఆనవాయితీగా జరుగుతున్న పందెం మరొకటి ఉంది. అవే పడవ పందాలు. ఇది మిగిలిన పందాలన్నింటికంటే విశిష్టమైనది. కారణం ఇది శ్రమజీవుల సంబరం కావడమే. మిగిలిన రాష్ట్రాల్లో సంగతేమో గానీ మన రాష్ట్రంలో మాత్రం ఇది కష్టజీవుల వేడుకే. పల్లెకారులు, మత్స్యకారులు జరుపుకునే పండగ ఇది. ఏడాది పొడవునా పడవ మీద పనిచేసే జాలర్లు పాల్గొనే పోటీ ఇది. మరి ఈ పడవ పందాలు ఎక్కడ జరుగుతాయో తెలుసా! మన కృష్ణాజిల్లాలోని నాగాయలంకలో! ఈ ఏడాది ఇక్కడ రాష్ట్రస్థాయిలో ఈ పడవల పోటీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పడవ పందాలు ఎలా మొదలయ్యాయి? ఎవరు నిర్వహించేవారు? ఇప్పుడు ఎవరు నిర్వహిస్తున్నారు....ఈ విశేషాలు....వివరంగా....!

ఎప్పుడూ పడవ మీద ఉండే బెస్తవాళ్ళ జీవితాలకు కొంచెం ఊరటనిచ్చేవి, ఉత్సాహాన్ని ఇచ్చేవి ఈ పడవ పందాలే. ఇప్పుడే కాదు ఆది నుంచి ఈ పడవ పోటీలు నాగాయలంకలోనే జరుగుతున్నాయి.. ఇక్కడ పెద్ద సంబరంలా జరిగే ఈ పడవల పోటీల విషయం వెలుగులోకి వచ్చింది మాత్రం ఇటీవలకాలంలోనే. దివ్య సీమగా పేరొందిన దివిసీమలో సముద్రం ఒడ్డున ఈ నాగాయలంక గ్రామం ఉంది. ఇది మండల కేంద్రం కూడా. మంచి వ్యాపార కూడలి. ఈ అంశాలే ఇక్కడ పడవ పందాల పోటీల నిర్వహణకు కారణమయ్యాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలంతా అక్కడికి తరచుగా వస్తుంటారు. అలా వచ్చినవాళ్ళల్లో ఒకరికి వచ్చిన ఆలోచన ఫలితమే ఈ పడవ పందాల వేడుక. ఈ పోటీలు ప్రారంభమైనప్పుడు దీని వెనక బడా వ్యక్తులు లేరు. బడా సంస్థలు అంతకన్నా లేవు. యువతరం వారంతట వారు మొదలుపెట్టిన పోటీలు ఇవి. చాలాకాలంగా ఏటా సంప్రదాయంగా ఈ పోటీలు జరుగుతున్నాయి. తొలి రోజుల్లో ఈ పోటీలు నిర్వహించాలనుకున్నవాళ్ళు వారికి అందుబాటులో ఉన్నవారికి కబురు పంపేవారు. ఆ వచ్చినవాళ్ళతోనే పోటీలు నిర్వహిస్తుండేవాళ్ళు. దాతలు అందించిన సొమ్ముతో విజేతలకు చిరు కానుకలు అందించేవారు.

ఈ క్రమంలో ఈ పడవ పందాల విషయం గత ఏడాది పర్యాటక శాఖ దృష్టికి వెళ్ళింది. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలనే తలంపుతో అనేక కార్యక్రమాలు చేపడుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమూ దీనిపై శ్రద్ధ పెట్టింది. నాగాయలంకలో సంక్రాంతి సంబరాలు పెద్ద ఎత్తున నిర్వహించే కార్యక్రమంలో భాగంగా పడవ పోటీలనూ అందులో చేర్చింది. తొలిసారిగా గత ఏడాదే అధికారికంగా పర్యాటక శాఖ ఇక్కడ పడవ పోటీలు నిర్వహించింది. శాసనసభా ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ 2017, జనవరి 13వ తేదీన ఈ పోటీలను అధికారికంగా ప్రారంభించి నాగాయలంకను మరోసారి చరిత్ర పుటలకెక్కించారు.

గత ఏడాది జరిగిన పడవ పందాలకు ప్రజానీకం నుంచి మంచి అదరాభిమానాలు రావడంతో ఈ ఏడాది ఈ పోటీలను నిర్వహించడానికి పర్యాటకశాఖ సమాయత్తమైంది. ఇందుకోసం పటిష్ఠమైన ప్రణాళికనూ రూపొందించింది. తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలను చాటే విధంగా దివిసీమలో ఈ ఏడాది రాష్ట్రస్థాయి పడవ పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బి. లక్ష్మీకాంతం ఒక బ్రోచర్‌నూ విడుదల చేశారు. అయితే ఎప్పటిలా కాకుండా ఈ ఏడాది ఈ పోటీలను మూడుగా విభజించారు.

మెద్దుడు పోటీలు

ఈ పోటీకి భార్యాభర్తలే అర్హులు. ఆ ఇద్దరే పడవను తెడ్లతో నెట్టాలి. ప్రథమ స్థానంలో నిలిచిన దంపతులకు పదివేల రూపాయలు, ద్వితీయ స్థానంలో నిలిచిన దంపతులకు ఆరువేల రూపాయలు, తృతీయ స్థానంలో నిలిచిన దంపతులకు మూడు వేల రూపాయల నగదు పారితోషికం అందిస్తారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు ఒక పట్టుచీర, మగవాళ్ళకు వెయ్యి రూపాయల పారితోషికం అందజేయనున్నారు.



కోల పోటీలు

ఈ పోటీలకు ఒక్కో జట్టుకు 9 మందిని అనుమతిస్తారు. పడవలో ఒక వైపు నలుగురు, మరోవైపు నలుగురు కూర్చుని పడవను నీళ్ళల్లో నెట్టే పోటీ ఇది. ఒకరు చుక్కాని వద్ద కూర్చుని, పడవ గమనాన్ని సరిజేస్తుంటారు. ఈ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 25 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 15 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 10 వేలు బహుమతిగా అందిస్తారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి వ్యక్తికి రూ. 4 వేలు ఇవ్వనున్నారు.

డ్రాగన్ పోటీలు

ఇంజను అమర్చిన పడవలను ఈ పోటీకి ఏర్పాటు చేస్తారు. ఇందులో ఏడుగురు పాల్గొంటారు. పడవలో ఒకవైపు ముగ్గురు, మరోవైపు ముగ్గురు ఉంటారు. ఒకరు వెనక చుక్కాని వద్ద ఉంటారు. ఈ పోటీల్లో విజేతలకు కూడా 'కోల' పోటీల విజేతల మాదిరే నగదు బహుమతులుంటాయి. దీనిలో పాల్గొన్నవారికి మూడు వేల రూపాయల పారితోషికం ఉంటుంది.

ఈ పోటీల్లో ఎక్కువమంది పాల్గొనేందుకు అనువుగా పర్యాటకశాఖ కొన్ని వెసులుబాట్లు కల్పించింది. 'కోల' పోటీకి అవసరమైన ఆరు పడవలు, డ్రాగన్ పోటీలకు అవసరమైన పడవలు ఆరింటినీ నిర్వాహకులే సమకూర్చనున్నారు. మెద్దుడు పోటీకి అవసరమైన పడవలను మాత్రం పోటీదారులే సమకూర్చుకోవలసి ఉంటుంది.

గత ఏడాది ఈ పందాల కోసం పడవలను పోటీదారులే స్వయంగా సమకూర్చుకున్నారు. ఈ విషయంలో ఇబ్బందులు ఎదురైన నేపథ్యంలో ఈ ఏడాది నిర్వాహకులే పడవలను సమకూరుస్తున్నారు. దీంతో ఈ ఏడాది పోటీలో పాల్గొనేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని అంతా భావిస్తున్నారు. ఈ ఏడాదీ అధికారికంగా పర్యాటక శాఖ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా పాల్గొనున్నారు. రేపటి (జనవరి 13 - శనివారం) నుంచి రెండు రోజులపాటు జరిగే ఈ వేడుకలను పోటీ దారులతో పాటు మీరు కూడా హైలెస్సో, హైలెస్సా అంటూ ఎంజాయ్ చేయండే!



గత ఏడాది మండలి బుద్ధప్రసాద్ పుష్పాంజలితో పడవ పోటీలు ప్రారంభించిన దృశ్యం



మనిషి జీవించటానికి ఏదో ఒక పని చేయాలి. అది శారీరక శ్రమ కావచ్చు, ఉద్యోగం కావచ్చు, వ్యాపారం కావచ్చు. మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటినా ఎక్కువమందికి శారీరక శ్రమే జీవన మార్గంగా ఉంది.

శ్రమలోనూ అనేక రకాలున్నాయి. కాయకష్టం శ్రమే! ఉద్యోగమూ శ్రమే! వ్యాపారమూ శ్రమే! శారీరక శ్రమలో ప్రాణాపాయ సందర్భాలూ ఉంటాయి. అలాంటి వాటిలో ఒకటి చేపల వేట. మనిషి బతుకు బాటకు ఆసరాగా నిలిచే వాటిలో 'జాలరి వృత్తి ఒకటి. వలవేసి చేపలు పట్టడం వీరి నిత్యకృత్యం. వీరి భార్యాపిల్లలు కూడా అదే బాటలో సాగుతున్నారు. కాలువల్లోనూ, చెరువుల్లోనూ మాత్రమే కాదు, సముద్రాల్లో సైతం చేపలు పట్టి బతుకు బండిని లాగించటం వీరికి అనాదిగా అలవడిన విద్య. సముద్ర వేటపై ఆధారపడి జీవించేవారికి రేయింబవళ్ళు అనే వ్యత్యాసం కూడా తెలియదు. సముద్రంలో, వేటలో ఉన్న సమయంలోనే పొద్దు పొడుస్తుంది. అలాగే పొద్దుకుంకుతుంది. వలలో చేపలు పడే వరకూ చేపల కోసం వారి అన్వేషణ కొనసాగాల్సిందే. అలా ఎన్నో రోజులు గడిచిపోతాయి. సముద్రమే వారికి సర్వస్వం.

ఈ జాలర వృత్తిలోనూ అనేక కులాలు ఉన్నాయి. పల్లి, పల్లికాపు, పల్లిరెడ్డి, గంగవారు, గంగపుత్రులు, గుండ్ల, వన్య కుల క్షత్రియ, వన్నె కాపు, వన్నె రెడ్డి, బెస్త, బలిజ లాంటి ఎన్నో పేర్లతో ఈ జాలర్లను పిలుస్తున్నారు. ఈ రోజుల్లో పూట గడవక మత్స్యకార వృత్తిని చేపడుతున్నవారూ ఉన్నారు.

మన రాష్ట్రంలో 450కి పైగా మత్స్యకారుల గ్రామాలున్నాయి. చేపల వేటకు అనువైన కేంద్రాలు 280 ఉన్నాయి. ఏటా 1,21,000 టన్నుల చేపలు సముద్రాల ద్వారా మనకు లభిస్తున్నాయని ఒకప్పటి అంచనా. అది ఇప్పుడు మరింత పెరిగి ఉండవచ్చు. సముద్ర చేపల ద్వారా సమకూరే ఆదాయం వందల కోట్లు. అంతటి ఆదాయం అందించే జాలరి బతుకు మాత్రం దుర్భరం. చేపలు పట్టడం, అమ్మడం ద్వారా వారికి వచ్చే డబ్బులు అంతంత మాత్రమే. ఏళ్ళకుఏళ్ళుగా వాళ్ళంతా చాలీచాలని రూకలతోనే జీవితాలను నెట్టుకొస్తున్నారు. పిల్లల్ని పెద్ద చదువులు చదివించుకోలేని అసహాయత, ఇంటి ఖర్చులు సమకూర్చలేని నిస్సహాయత, వీటన్నింటికీ మించి క్షణక్షణం కలవరం, వాతావరణ కల్లోలాల వల్ల జీవితాలు క్షణభంగురం.....అయినా వల పట్టకుండా ఉండరు, వేటకు వెళ్ళకుండా ఉండరు. ఇవే మా జీవితాలు అంటారు ఈ బెస్తలంతా. "వల పట్టడం ఒక సాహసం. సముద్రంలో చేపల వేటకు వెళ్ళటం ప్రమాదాలను కొనితెచ్చుకోవటంలాంటిదే! అయినా, వల విసరక తప్పదు, ప్రాణాలను పణంగా పెట్టకా తప్పదు" అని చెబుతారు వాళ్ళు. మనిషి ఎంత శ్రమించినా, ఎంత సంపాదించినా సరదాలూ, సంబరాలు కూడా ఉండాలి వారి జీవితాల్లో. ఇలాంటివి సముద్రంపై ఆధారపడేవారి జీవితాల్లో దాదాపు మృగ్యమే. ఇలాంటివాళ్ళకి ఆనందాన్ని, ఉత్తేజాన్ని, వినోదాన్ని అందిస్తున్న సంబరం పడవ పందాలు. ప్రత్యేకించి ఈ సంక్రాంతి సీజన్‌లో వారికంటూ ప్రత్యేకంగా చెప్పుకోవడానికి ఉన్నది ఈ పడవల పోటీలే. నవ్యాంధ్రలోని 9 కోస్తా జిల్లాలో 980 కిలోమీటర్ల మేర సముద్రతీరం విస్తరించి ఉంది. ఈ తీరం లక్షలాదిమందికి జీవనోపాధి అందిస్తోంది. అయినా ఈ తీరం వెంబడి ఉన్న నాగాయలంకలో జరిగే పడవ పందాల గురించి బయట ప్రపంచానికి, రాష్ట్రానికంతటికీ తెలిసింది మాత్రం గత ఏడాదే.

- దాసరి ఆళ్వారుస్వామి, కుందేరు



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు



జరిగిన కథ

ఇప్పుడావిడకి ఏభై రెండు, మా క్లైయింటు నలభై ఏడు వేలిచ్చుకోవాలన్న మాట - రాజీ చేసుకున్నా! నయం, మా ప్రొప్రయిటరుగారు ఆమాట వింటే గుండె పేలి చస్తాడు" అన్నాడు. "పీడాపోయె" అన్నా కోపం వచ్చి. "నయం యింకా! అతడు చస్తే మా ఫీడర్ల మాటేమిటి? ఈ కేసుకి నాకు పదివేలు ఫీజున్నూ ఐదువేలు బహుమతీన్నీ, వార్షికం వెయ్యిచ్చాడు. చూసుకోమరి శాస్త్రి మజా!" "ఒక స్త్రీ మనోవృత్తిలేక చస్తూంటే, మరో స్త్రీ మోటారు కారుతో అన్ని సౌఖ్యాలూ అనుభవిస్తూండడమా? ఆ కారు ఎక్కడం అంటే నాకు ఒక అఘాయిత్యం లాగుందోయి!" అన్నా "మొన్న సోమవారం అంతటికంటే గొప్ప విశేషం జరిగింది. ఆ వేళ నీ పుట్టినరోజు కాదూ? నువ్వు మర్చిపోయినా నేను మాత్రం మర్చిపోగలనా? ఆరోజు కీకానుక!" అన్నాడు శాస్త్రి నాచెయ్యి నిమురుతూను.

(నిన్నటి సంచిక తరువాయి)

"మనకిదివరకే వున్నాయిగా ఫోర్డు, షెవ్రలేట్టున్నూ? మళ్ళీ యెందుకోయి మూడో కారు? ఇంతకీ యీ మూడు కార్లకి అయే పెట్రోలు, టైర్లు, సామానులూ యీ డబ్బంతా ఏ అమెరికాకో, ఇంగ్లండుకో కార్ల అసలు ఖరీదుతో సహా ఈ వడ్డీ కప్పం కట్టించుకోవలసిందేగా? యెందుకొచ్చిన భోగమోయి ఇది?" అన్నా. "నీకు ఈ ఎకనామిక్సు పిచ్చి ఇంకా వదల్లేదు. శాంతం! నేనూ అర్ధశాస్త్రం చదువుకున్నాను. నీకంటే పెద్దవాణ్ణి. మొగాణ్ణి, నేచెప్పేది విను. మనకి మూడు కార్లుండటం దేశానికి మంచికాని చెడ్డకాదు. ఇదంతా దేశంయొక్క మూలధనం అనుకో!" అన్నాడు. సరే పుణ్యానికిస్తూంటే, పిచ్చకుంచం అని దెబ్బలాడినట్టు అతడు నా మీద ప్రేమకొద్దీ కారు బహుమతి చేస్తూంటే, ఈ అభ్యంతరాలు చెబితే చిన్నబోతాడని: "శాస్త్రీ! నీ కానుకకి, ఈ కానుక బదులు!" అంటూ తేలిగ్గా ముద్దుపెట్టుకున్నా. శాస్త్రీ మహా ఆనందపరవశుడైపోయాడు.

"ఒక చిన్న గమ్మత్తు చేశాను, శాంతం!" అన్నాడు నవ్వుతూను శాస్త్రి. "తీర్పు చెప్పాక, నేను వెంటనే పత్రికా ప్రతినిధిని వెంట పెట్టుకుని హిందూలా రిఫారమ్ ఎసోసియేషనుకి వెళ్ళి వెయ్యి రూపాయలు విరాళం యిచ్చి యావజ్జీవ పోషకుడుగా చేరేను. వాళ్ళు కూడా మరునాడు సభలో నన్ను వైస్ ప్రెసిడెంటుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏం! తెలివైన పనం టావా, కాదా?"

ఫక్కుని నవ్వేను. "భలే శాస్త్రీ!" అన్నా. మనసులో మాత్రం ఒక నిట్టూర్పు విడిచాను.

54 అతడు

ఈ వేళ పన్నెండు గంటలతోనే నాకు కోర్టులో పని అయిపోయింది. మధ్యాహ్నం స్మాల్ ఇంట్లో "లంచి" కొత్తకారుమీద సరాసరి హైకోర్టు నుంచి అడయార్ వెళ్ళేను. మెక్‌రే వెళ్ళిపోతున్నాడని అతనికి అతని భార్యకిన్నీ వీడుకోలు విందు. స్మాల్ దంపతులు నన్ను కొంతమంది ముఖ్య స్నేహితులని మాత్రమే పిలిచారు. బ్రాటెనుబరీ, అతని పెళ్ళాం, అతని జూనియర్ పర్సెల్ అతని భార్య, పాండురంగ, జయరాజు, మదరాసు కలెక్టరు పిట్టు విలియం, అతని పెళ్ళాం, చెల్లెలు ఆనరిబిల్ సింతియా టెంపిల్ వుద్దు. లంచి చాలా బాగుంది. ఎనిమిది రకాల "కోర్సులు" 1898 బ్రియాండును, వీడ్కోలు విందు కదూ - ఉపన్యాసాలు, టోస్టులు, హాస్యాలు - ఓ - బలేగా వుండెను.

అన్నిటికంటే అద్భుతంగా వుండెను - మిస్ టెంపిల్ వుద్దు. ఇరవై రెండేళ్ళు పడుచు, ఇంగ్లీషు ఎమెచ్యూర్ టెన్నిస్ ఛాంపియన్, నాలుగు రోజుల క్రిందే వచ్చింది ఇండియాకి. నా అదృష్టం వల్ల ఆవిడపక్కనే వేశారు నాకు కుర్చీ. ఏమి చమత్కారంగా మాట్లాడింది! ఏమి ఆ మాటతీరు! ఆ సమయస్ఫూర్తి! ఆ రూపురేఖలు! ఆపిల్ పువ్వు ఛాయ - ఇంగ్లీషు పడుచుల అందం అంతా ఆవిడలో ఉట్టిపడుతూండెను. లంచి అంతసేపు, తరువాత కూడా నేనావిడతోటే సంభాషణ. ఎంత సేపు మాట్లాడినా తృప్తికాలేదు. నాకు. ఏదో నచ్చివుండాలి ఆ అమ్మాయికి! లంచి పూర్తి అయ్యేటప్పటికి నాలుగు నలభై అయింది. అప్పుడు జ్ఞాపకం వొచ్చింది. - శుక్రవారం



సాయంత్రం తలంటూ అన్ని అనా - పాపం - శాంతం ఏం కనిపెట్టుకుంటూందో, ఇంకా రాలేదని ఏం బెంగపెట్టుకుంటుందో ఏమిటో, నేను గంటకింద ఇంట్లో వుండవలసి వుండెనే-అనుకుంటూ గాభరాపడుతూ, ఏమి క్షమాపణ చెప్పడమా అని ఆలోచించుకుంటూ, కారేసుకుని యింటి కొచ్చాను.

శాంతం కోపంతో ఎక్కడ ఎదురుపడుతుందో అనుకుంటూ చడీచప్పుడులేకుండా ఇంట్లోకెళ్ళాను. తాయారు సావిట్లో ఎదురుపడింది. "అమ్మగారేం చేస్తున్నారు?" అని అడిగే. "అమ్మగారు భోంచెయ్యగానే పెరియమెట్టు వెళ్తానని వెళ్ళేరు. నాలుగంటలకే వచ్చేస్తానన్నారు" అంది. ప్రాణం కుదుటబడింది. బతికేం భగవంతుడా! నావల్ల తప్పేలేదను కున్నాను. సరే, మరో ఘడియకల్లా వచ్చే స్తుందికదా అనుకుంటూ, హిందూ పత్రిక చదువుతూ ముందువసారాలో కూచున్నా. కాసేపటికల్లా టాక్సీలో శాంతం వచ్చింది. "నేనూ ఇప్పుడే వచ్చాను శాంతం" అనబోతున్నాను - ఇంతట్లోకి ఆ డ్రైవరు పటం వకటి వసారాలో పెట్టాడు. దాంతో పెరియమెట్టు అంటే బోధపడింది. - రామారావుగారి చిత్రాల ప్రదర్శనాల కెళ్ళి ఏయేడెనిమిది వందలో తగలేసి ఏదో బొమ్మ ఒకటి కొనుక్కొచ్చిందని. దాంతో నా కెక్కడలేని కోపం వచ్చేసి, ఆలస్యంగా వచ్చిందన్న మిషతో నాలుగు దులుపులు దులిపేశా - అకారణంగానే తెలిసివుండే.

ఓఢ్ర "భౌండారీ" మర్దన చేస్తూన్నంతసేపూ లెక్కలు వేస్తూనే వున్నా. అట్టతోసహా రెండుమూర్ల జానెడు పొడుగు. మూరెడు బెత్తెడు వెడల్పు ఉంటుందో వుండదో - ఏ ఏడు వందలో ఎనిమిది వందలో పారేసిందే - ఆ లెక్కని చూస్తే - చదరపుగజం రమారమి పద కొండువందల ఏభై రూపాయలు పడిందే-ఆ ధరని మౌంటురోడ్డులోనే స్థలం కొనిపారెయ్యొచ్చునే - అని ప్రాణం మహా నొచ్చుకుంది. ఇంతకీ ఈ స్వదేశీ సాంప్రదాయం బొమ్మల్లో అందమా చందమా? నెల్లాళ్ళు లంకణాలు చేసినట్టు - ఏమిటా ముఖాలు, ఆ వాలుకళ్ళు, ఆ కందిరీగ నడుములు, ఏనుగుతొండల్లాగా చేతులు, అరటి బోదెల్లాగా కాళ్ళు - భోగం వాళ్ళ అభినయంలాగు చేష్టలు - నాకు బోధ పడదు. సహం డబ్బు పెడితే రవివర్మ బొమ్మలు పటాలు కట్టినవి ఎక్కితొక్కివస్తాయి - రెండు వరసలు పెట్టుకోవచ్చు. డ్రాయింగు రూములోనూ, పడకగదిలోనూ, వసారాల్లోనూ, నట్టింటిలోనూ. కావలిస్తే మిగిలినవి కొట్టు గదిలో కూడాను. ఆ రవివర్మ బొమ్మలు చూస్తే ఏపుగాను, దబ్బ పండులా వొళ్ళు, బూరెబుగ్గలు, బొద్దుగా నడుం, రూపు, రేఖ, అందం, చందం తీర్చిదిద్దినట్లు ముద్దొస్తూవుంటాయి. అతని "తిలోత్తమ బంతి ఆడుతూ" వున్న బొమ్మ చూసి నా భార్య ఇలాంటి రూపసి అయితే బాగుండును అనుకునేవాడిని. చిన్నప్పుడు అలాంటివి కొనక ఏ ఎనిమిది వందలో తొమ్మిది వందలో యీ బొమ్మకా!

తలంటంతా అయింది - శాంతం "శ్రీ రామరక్ష వెయ్యేళ్ళాయుష్షు" పెడుతూంది - అప్పుడు జ్ఞాపకం వొచ్చింది, చెక్కుబుక్కు నా జేబులోనే వుందికదా - తన స్వంతడబ్బు పెట్టే కొనుక్కుందని. సరే, ఫరవాలేదనుకున్నాను. మరొక మాటకూడా తోచింది. రేపు ఉదయం పత్రికల్లో ఎలాగా పడుతుంది, ఫలానా మిసెస్ శాస్త్రిగారు కొన్నారూ అని. పొరపాటుమీద అచ్చువాడు "మిస్టరు శాస్త్రి" అని వేస్తే మరీ మంచిది. ఎలాగేనా మన పేరు నలుగురికీ తెలుస్తుంది. మనకు కావలసిందే అది - అనుకునే టప్పటికి కోపం పూర్తిగా పోయి సంతోషం కూడా వొచ్చింది. సరే పెళ్ళాంతో తగువు తెచ్చుకొన్న తరవాత ఒకసారిగానే శాంతించి, రాజీపడడం బుద్ధిమంతుల లక్షణం కాదనుకొని కాఫీ తాగి, తాంబూలం వేసుకుని, ఏదో అప్రయత్నంగా కనబడేలాగు, ఫోటో అల్బమ్ తీసి బొమ్మలు తిరగేస్తున్నా - శాంతమే సంభాషణ మొదలెడుతుందని, "శాస్త్రీ! నీ ఇంగ్లండు అనుభవాలు, అక్కడ నీ స్నేహితుల గురించి, నాకు వినాలనే వుంటుందోయి. ఈ ఆల్బములో ఇంకా ఎన్ని ఫోటోలో మిగిలిపోయాయి - నువ్వు చెప్పనివి. హాయిగా కూచున్నాం, ఫోటోలు చూపించవు?" అంది.

"అంతకంటేనా!" నువ్వు లేనిపోని అనుమానాలు పడతావేమోనని మాత్రం నాకు భయం" అన్నా.

"నే నెప్పుడూ అలా అనుకోను. ఆవేళ యింతవరకూ చూపించావు - తరువాత ఫోటో తిరగవెయ్యమన్నావా?" అంది.

ఆల్బం పుచ్చుకుని, బొమ్మ చూశాను. రెండు నిమిషాలు కళ్ళుమూసుకున్నాను. నాకే నవ్వొచ్చింది. "చెప్పమంటావా ఏమిటి? అయితే విను" అన్నా. "ఈ అమ్మాయి నీకు నచ్చినదా? అని అడిగే.

"ముఖం బాగుంది - వయస్సు చెప్పలేం - పాతిక వుండొచ్చు - నలభై వుండొచ్చు. అందంగానే వుంది. మంచి పొడగరి. చేతులు, వ్రేళ్ళు పొడుగ్గా, సన్నంగా నాజూగ్గా వున్నాయి. కళ్ళలో దయ, సానుభూతి ప్రతిబింబిస్తూన్నాయి. నర్సు దుస్తుల్లో వుంది. చేతిమీద రెడ్‌క్రాసు చిహ్నం వుంది. నిండు పెదిమెలు. అది తప్పితే. మడోన్నా చిత్రంలాగుంది" అంది శాంతం.

"హెన్సీ సల్లివన్‌తో నాకు అకస్మాత్తుగా పరిచయం కలిగింది. ఇంగ్లండులో నాకప్పుడు మొదటి సంవత్సరం ఎండాకాలం సెలవలు. కారన్వాలులో గడుపుదాం అనుకున్నాను. రివెయిరా ఎక్స్‌ప్రెసులో లండనునుంచి బయలుదేరేను. పెంజాన్సులో దిగడం ఎందుకు అని చెప్పి అంతకుముందు చిన్నస్టేషను హెయిలు అన్న వూరుంటే అక్కడ. దిగేను. ఉత్త కుగ్రామం. రైలుపెట్టె దిగి, మూట భుజాన్నేసుకుని స్టేషను నుంచి బయలుదేరేను. ఈ చిన్న స్టేషనులో నేనొక్కడినే దిగేను అనుకున్నాను. కాని నా వెనుకాలే ఒకమ్మాయి భుజాన్ని మిలిటరీ సంచీ, నీళ్ళ సీసా, చేతికర్ర, దిట్టమైన జోళ్ళు - ఆ రోడ్డమ్మటే వస్తూంది. నావరకూ రానిచ్చి పలకరించేను. ఒకరినొకరం పరిచయం చేసుకున్నాం. నా సంగతి చెప్పేను. తన సంగతి చెప్పింది-ఆ నిమిషంలో కాదనుకో - రాసురాను."

"అయితే మీ స్నేహం శుక్లపక్ష చంద్రుడిలాగు ప్రవర్థమానం అయిందందూ?" అన్నది శాంతం.

- ఇంకా వుంది.

ప్రాచీన భారతదేశంలో

విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం

విశాలాంధ్ర ప్రజ్ఞ

ప్రాచీన భారత సమాజంలో అనేక చేతివృత్తులు వృద్ధిచెందాయి. అందులో చెప్పుకోదగినది నేత పరిశ్రమ. "శిల్పరత్న" గ్రంథంలో వివిధ రంగులను తయారుచేసే పద్ధతులను వివరించారు. 'మానసోల్లాస' గ్రంథాన్ని బట్టి పూర్వీకులు రంగుల అద్దకం కళ గురించి కూడా తెలుసునని చెప్పాలి.

మౌర్యుల కాలంలో వస్త్రాలపై రంగుల బొమ్మలు ముద్రించడం ప్రారంభమైంది. బహుశా మహాభారత యుగంలోనే ఈ శాస్త్రం గురించి వీరికి తెలుసు. వీరికి లోహకార శాస్త్రం తెలుసు. కంచుతో, రాగితో వివిధ రకాల విగ్రహాలు, ప్రతిమలు తయారుచేసేవారు. గుప్తుల కాలంలో ఢిల్లీవద్ద నాటిన ఇనుపస్తంభం ఎన్ని శతాబ్దాలు దాటినా తుప్పు పట్టలేదు. ఉక్కును మొదట బహుశా భారతీయులే తయారుచేశారు. చెక్కతో పనిచేసేవారిని 'సూత్రధారులు' అనేవారు. సూత్రం అంటే దారం. చేతితో ఉన్న దారంలో చెక్కను కొలతలు కొలిచేవారు. 'బృహత్ సంహిత'లోనూ 'శిల్పశాస్త్ర' గ్రంథంలోనూ ఈ విషయం ఉంది. ఏనుగు దంతాలతో బొమ్మలు తయారుచేయడం తెలుసు. కుండలు, కడవలు చాలా అందంగా తయారుచేసేవారు.

▸ క్రీ.పూ. నాలుగో శతాబ్దిలోనే పాణిని సంస్కృత భాషకు సంబంధించి వ్యాకరణం రాశారు. ఈ పుస్తకం పేరు అష్టాధ్యాయి. ఇందులో వ్యాకరణాన్ని భాషా శాస్త్రంగా పరిగణించారు. తర్వాత పతంజలి తన 'మహాభాష్య'లో సంస్కృత వ్యాకరణాన్ని పరిపుష్టం చేశారు.



▸ అమరసింహుడు 'అమరకోశ' రాశారు. ఇది భారతదేశంలోని మొదటి నిఘంటువు. సుప్రసిద్ధ మార్క్సిస్టు విమర్శకుడు డి.డి.కోశాంబి ఈ అమరకోశం ఆధారంగా ప్రాచీన భారత సమాజంలో ఉండే వర్గాలను వివరించారు.

జనరల్ నాలెడ్జ్

▸ ఆర్యభట్ట- (క్రీ.శ. 5వ శతాబ్దం) ఈయన ఖగోళశాస్త్రం, గణితశాస్త్రంలోనూ ప్రవీణుడు. ఈయన త్రికోణమితి రూపొందించారు. సూర్య, చంద్ర గ్రహణాలను వివరించారు. సౌర సంవత్సరాన్ని కచ్చితంగా లెక్కగట్టారు.

▸ భారతీయులు క్రీ.పూ రెండో శతాబ్దంలోనే సున్నాను (జీరో) ఆవిష్కరించారు. అరబ్బులు క్రీ.శ. 9వ శతాబ్దంలో మాత్రమే సున్నాను ఉపయోగించడం తెలుసుకున్నారు.

▸ గణితాన్ని 1. అంకగణితం, 2. బీజగణితం (ఆల్జీబ్రా)గా విభజించి అభివృద్ధిపరిచారు.

▸ 'సుల్వసూత్ర' గ్రంథంలో రేఖాగణితానికి సంబంధించి సూత్రాలు ఉన్నాయి.

▸ ఆపస్తంభ అనే మేధావి క్రీ.పూ. రెండో శతాబ్దంలోనే రేఖాగణితం సూత్రాలను పొందుపరిచారు.

▸ వరాహమిహిర రాసిన ప్రధాన గ్రంథం 'బృహత్ సంహిత'. ఈయన సూర్యుడు చుట్టూ భూమి తిరుగుతున్నదనీ, భూమి చుట్టూ చంద్రుడు పరిభ్రమిస్తున్నాడని నిర్ధారించారు. చాంద్రమాసాన్ని శుక్లపక్షంగా, కృష్ణపక్షంగా విభజించారు.

▸ బ్రహ్మ గుప్త (క్రీ.శ. 7వ శతాబ్దం) గొప్ప ఖగోళ శాస్త్రవేత్త. గణితశాస్త్ర ప్రవీణుడు. ఈయన గ్రంథాన్ని అరబ్బులు అనువదించుకున్నారు. ఈయనకు 'గణక చక్రచూడామణి' అనే బిరుదు ఉండేది. విక్రమాదిత్యుని ఆస్థానంలో ఖగోళ శాస్త్రవేత్త. ఈయన భూమికి గురుత్వాకర్షణ శక్తి ఉందని కూడా గ్రహించారు.

▸ శుశృతుడు గొప్ప శస్త్రచికిత్సా నిపుణులు. ఈయనకు 'ప్లాస్టిక్ సర్జరీ' గురించి తెలుసు. ఛత్వార రోగులకు ఆపరేషన్ చేసేవారు.

▸ 'చరక' అనే వైద్యశాస్త్రవేత్త 'చరకసంహిత' గ్రంథం రాశారు. ఇందులో కుష్ఠు, క్షయ, ఉన్మాదం తదితర జబ్బుల గురించి వివరించారు. ఏ మందుల తయారీకి ఏ మొక్కలు ఉపయోగపడతాయో తెలిపారు.

▸ గుప్తుల కాలంలో పశువైద్యశాస్త్రం బాగా అభివృద్ధి చెందింది.

ప్రాచీన కాలంలో శాస్త్రవేత్తలు

ఆర్యభట్టు : సూర్య సిద్ధాంతమనే గ్రంథంలో సూర్యచంద్ర గ్రహణాలను శాస్త్రీయ విజ్ఞానంతో వివరించారు. భూమి తనచుట్టూ తాను తిరుగుతున్నదని మొట్టమొదట చెప్పిన శాస్త్రజ్ఞుడు ఆర్యభట్టు. ఇతని 'ఆర్యభట్టీయం' అనే మరో గ్రంథంలో సామాన్య గణితం, బీజగణితం, క్షేత్రగణితం, త్రికోణమితి సిద్ధాంతాల వివరణ ఉంది.

బ్రహ్మగుప్తుడు : న్యూటన్ సిద్ధాంతాన్ని ఆనాడే చెప్పారు. వస్తువులను ఆకర్షించే లక్షణం భూమికి ఉండటం వన ప్రకృతి సహజ సిద్ధాంతం వలన ఎగరేసిన వస్తువులు భూమిపై పడుతున్నాయని చెప్పారు. 'బ్రహ్మస్ఫుత సిద్ధాంతం' మరియు ఖండకాండ్యక అనే గ్రంథాలు రచించారు.

వరాహమిహిరుడు : తన 'బృహత్ సంహిత'లో చంద్రుడు భూమిచుట్టూ తిరుగుతున్నాడని, భూమి సూర్యుని చుట్టూ తిరుగుతున్నదని చెప్పారు. 'పంచ సిద్ధాంతిక', 'బృహత్ జాతక' అనే గ్రంథాలను కూడా రచించారు. ఇవి ఖగోళ, భౌతిక, వృక్ష, ప్రకృతి శాస్త్రాల విజ్ఞాన సర్వస్వమని చెప్పవచ్చు.

పాలకావ్యుడు: పశువైద్య గ్రంథమైన 'హస్తాయుర్వేద'ను రచించారు.

నవనీతకం: ఇది వైద్యగ్రంథం. ఇందులో మందుల తయారీ పద్ధతులు, మోతాదు మొదలైన అంశాలను చర్చించారు.

వాగ్భటుడు: వైద్యశాస్త్ర గ్రంథం అయిన 'అష్టాంగ సంగ్రహం'ను రచించారు.

శుశృతుడు : శాస్త్ర చికిత్సలో పేరుగడించారు.

దశాంశ, సున్నా విలువలను ప్రపంచానికి ఇచ్చింది గుప్తుల కాలంలోని గణిత, ఖగోళ శాస్త్రజ్ఞులే.

'నీట్'లో బయాలజీ మార్కులు కీలకం

వైద్యవిద్య చదవాలనుకునే విద్యార్థులు జాతీయ స్థాయిలో రాసే పరీక్ష... 'నీట్'. సరైన ప్రణాళిక రూపొందించుకుని ఆ ప్రకారం తయారవ్వడానికి అనువైన సమయమిదే. ఈ పరీక్ష స్కోరులో, మొత్తం ర్యాంకులో కీలకపాత్ర వహించేవి జీవశాస్త్రం (బయాలజీ) మార్కులు. నీట్ పూర్వ ప్రశ్నపత్రాల తీరు ద్వారా ఈ సబ్జెక్టును ఎలా సాధన చేయాలో గ్రహించవచ్చు. అందుకు ఉపకరించే విశ్లేషణ..! నీట్‌లో మంచి ర్యాంకుతోపాటు ప్రభుత్వ/ప్రైవేటు 'ఎ' కేటగిరీలో సీటు సాధించాలంటే 720 మార్కులకు 510కుపైగా, ప్రైవేటు 'బి' కేటగిరీలో సీటు సాధించాలంటే 330కి పైగా మార్కులు సాధించాలి. కేవలం క్వాలిఫై అవ్వాలన్నా, ఇతర కేటగిరీల్లోనైనా స్కోరు ఆశించిన స్థాయిలో ఉండాలన్నా బయాలజీదే సింహభాగం అవుతుంది. అంటే.. ఈ సబ్జెక్టులో పట్టు లేకపోతే 'నీట్'లో ఏ స్థాయిలో రాణించాలన్నా కష్టమే. అందుకే బయాలజీపై ఎక్కువ శ్రద్ధపెట్టాల్సిన అవసరముంది. ఇదివరకు సరిగా చదవకపోయినా, చదివినవి మర్చిపోయినా ఇప్పుడు దాన్ని సరిచేసుకునే అవకాశం ఉంది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో వైద్య కళాశాలల్లో ప్రవేశానికి ఇంటర్ మార్కులతో సంబంధం లేదు. అందువల్ల జనవరి, ఫిబ్రవరిల్లో కొంత సమయం దాకా కూడా నీట్ ప్రవేశానికి అధ్యయనం చేసుకోవచ్చు. ఇంటర్‌లో రెండో సంవత్సరంలో ఉండే అంశాలపై ఫిబ్రవరిలో ఎక్కువ శ్రద్ధపెడితే రెండింటికీ ఉపయోగం. 720 మార్కుల్లో బయాలజీకి 360 ఉన్నాయి కాబట్టి ప్రత్యేక శ్రద్ధ, ప్రణాళిక అవసరం.

మెరుగైన మార్కులకు...

➜ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో అంశాలు క్షుణ్ణంగా, సూక్ష్మంగా చదవాలి. కొన్ని ప్రశ్నల్లో ప్రత్యేకించి పుస్తకాల్లో ఇచ్చిన పదాల, అంశాల ఆధారంగా మాత్రమే చేయగలిగినవి ఉంటాయి.

➜పుస్తకాల్లో ఇచ్చిన పటాలను జాగ్రత్తగా గమనించాలి. పాఠ్యాంశాల్లో లేకపోయినా పటంలో ఉంటే వాటి గురించి తెలుసుకోవాలి. 2017 పరీక్షలో పటం ఆధారంగా ఎక్కువ ప్రశ్నలు లేవు. అలాగని అశ్రద్ధ చేయడం తగదు.

➜నీట్ ప్రణాళికలో లేకపోయినా ఎన్‌సీఈఆర్‌టీ పుస్తక అంశాలను తప్పకుండా అధ్యయనం చేయాలి. ముఖ్యంగా కప్ప, వానపాము అంశాలకు సంబంధించినవి గుర్తుంచుకోవాలి. 2017లో కప్ప నుంచి 2 ప్రశ్నలు వచ్చాయి.

➜పాఠ్యపుస్తకం వెనుక ఇచ్చిన అంశాలను (సప్లిమెంట్) మర్చిపోకుండా అధ్యయనం చేయాలి. చాలా అంశాలు ముందు ఇవ్వనివి కూడా ఇక్కడ ఇచ్చారు.

➜ఏఐపీఎంటీ, నీట్ 2008-17 వరకు జరిగిన పరీక్షల ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. దీనివల్ల ఏ స్థాయిలో ప్రశ్నలు ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా పర్యావరణశాస్త్రం యూనిట్‌కు సంబంధించి కొంత పరిమితి దాటి వచ్చిన ప్రశ్నలు ఏయే అంశాలపై దృష్టిపెట్టాలనే విషయంపై అవగాహన కలిగిస్తాయి.

➜ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకం ప్రతి అధ్యాయం చివర ప్రశ్నలుంటాయి. అలాంటివాటికి సమాధానాలను సిద్ధం చేసుకోవాలి.

➜11, 12 తరగతుల పుస్తకాల స్థాయికి మించిన ప్రశ్నలకు సిద్ధం కావాలంటే ముందుగా అందులోని అంశాలను క్షుణ్ణంగా చదవాలి. ఆ తర్వాత మాత్రమే అదనపువాటిని ప్రయత్నించాలి. పుస్తకంలోని అంశాల ఆధారంగా దానికి అనుసంధాన అంశాలను చూసుకోవాలి.

➜ఎన్‌సీఈఆర్‌టీ వారి ఎక్సెంప్లర్ బయాలజీ అనే ప్రశ్నల పుస్తకం ఉంది. ఆ ప్రశ్నలూ వాటికి సమాధానాలూ చూసుకోవడం అవసరం. అక్కడక్కడ తప్పులు ఉంటే సరిచేసుకుని చదువుకోవాలి.

➜పాత పుస్తకాల్లోని అంశాలకు 2015 తరువాత అంటే 2016/ 2017 ముద్రణలో వచ్చిన పుస్తకాలను చూసుకోవాలి. అందులో చిన్నచిన్న మార్పులున్నాయి. వాటికి అనుగుణంగా చదువుకోవాలి.

➜జంతుశాస్త్రంలోని కీళ్ల (జాయింట్స్)కు సంబంధించి అలాగే వృక్షశాస్త్రానికి సంబంధించి ప్రయోగాలు కొన్ని ప్రాక్టికల్ మాన్యువల్‌లో ఉన్నాయి. వాటిని కూడా తెలుసుకుంటే మంచి స్కోరును ఆశించవచ్చు.

➜ప్లాంట్ కింగ్‌డమ్, అనిమల్ కింగ్‌డమ్‌లకు సంబంధించి, పుస్తకంలో ఇచ్చిన వాటితోపాటు కొన్ని ముఖ్యమైన అదనపు ఉదాహరణలను కూడా చూసుకోవడం మంచిది.

➜ప్రతి అంశాన్నీ చదివాక దానికి సంబంధించిన ప్రశ్నలను చేయాలి. దానివల్ల చదివిన అంశానికి భిన్నంగా కూడా ఆలోచించడం అలవాటు అవుతుంది. నమూనా పరీక్షలు రాయడం వల్ల సమయపాలనను పాటించవచ్చు.

తేలికేనని చిన్న తప్పులు

బయాలజీ అంటే తేలిక అని కొంతమంది అశ్రద్ధ వహిస్తారు. దీంతో చిన్న చిన్న తప్పులు చేస్తారు. 2015, 2016, 2017 ప్రశ్నపత్రాలను గమనిస్తే ఎక్కువ శాతం ప్రశ్నలు ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల అంశాల ఆధారంగానే ఉన్నాయి. అయితే 2017 ప్రశ్నపత్రం కొంతవరకు విశ్లేషణాత్మకంగా ఉందని విద్యార్థులు భావించారు. తెలిసినట్లే ఉండి, తొందరలో తప్పులు చేయించేవిగా కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. 90 ప్రశ్నల్లో కనీసం 84-85 ప్రశ్నలవరకు కష్టపడి జాగ్రత్తగా చదువుతూ వెళితే చేయవచ్చు. కొద్దిగా అదనంగా అవగాహన, అధ్యయనం చేస్తే మిగిలిన ప్రశ్నలు చేయవచ్చు. అంటే.. కనీసం 330-340 వరకు మార్కులు సాధించడం అంత కష్టం కాదు.

గత పరీక్షల్లో 5-7 ప్రశ్నలు కొంత పరిధి దాటి ఉంటున్నాయి. 2017 ప్రశ్నపత్రంలోనూ కొద్దిగా ఆలోచింపజేసేవిగా లేదా రెండు సమాధానాల మధ్య తేల్చుకోలేనివిగా కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. అయితే రెండు సంవత్సరాల సిలబస్‌లో..11వ తరగతి నుంచి 44 , 12వ తరగతి నుంచి 46 ప్రశ్నలు వచ్చాయి. ప్రశ్నల్లో క్లిష్టతనుబట్టి చూస్తే... సాధారణ ప్రశ్నలు- 60, మధ్యరకం- 16, విశ్లేషణాత్మకమైనవి- 14 ఉన్నాయి. కొన్ని అంశాల్లో ఎక్కువ ప్రశ్నలు ఇస్తున్నారు. జంతుశాస్త్రంలో మానవ శరీరధర్మ శాస్త్రం, వ ృక్షశాస్త్రంలో వైవిధ్యం (ప్లాంట్ డైవర్సిటీ)లో ఎక్కువ ప్రశ్నలు వచ్చాయి. అలాగే పర్యావరణ శాస్త్రం (ఎకాలజీ), జన్యుశాస్త్రం (జెనెటిక్స్ అండ్ మాలిక్యులార్ బేసిస్ ఆఫ్ ఇన్‌హెరిటెన్స్) వంటి పాఠ్యాంశాల్లో ఎక్కువగా ప్రశ్నలు వస్తున్నాయి.

ప్రపంచీకరణ (GLOBALIZATION)

◆భారతదేశం 1991 నూతన ఆర్థిక విధానం ద్వారా ప్రపంచీకరణ నినాదాన్ని ప్రోత్సహించింది.

◆ఒక దేశ ఆర్థిక వ్యవస్థను ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానం చేయడాన్ని 'ప్రపంచీకరణ' అంటారు.

◆1991 విధానంలో భాగంగానే భారతీయ కంపెనీలు వేరే దేశంలో పెట్టుబడులు పెట్టడం, వేరే దేశ పెట్టుబడులు మనదేశంలోకి రావడం మొదలైంది.

◆ఇది క్రమంగా భారతదేశ స్థితిగతులనే మార్చేసింది. ఎఫ్‌డీఐల రూపంలో పెట్టు బడులను ఆకర్షించడంలో 2015లో మన దేశం ప్రపంచంలో పదవ స్థానంలో ఉంది.

◆ప్రపంచీకరణ వివిధ అంశాల పరిధిలో జరుగుతుంది.

◆వాణిజ్య అవరోధాలు తొలగించి, వివిధ దేశాల మధ్య వస్తుసేవల ప్రవాణానికి ఇబ్బందులు తొలగించడం.

◆సాంకేతిక విజ్ఞాన ప్రవాహానికి అనుకూల వాతావరణం కల్పించడం, మూలధన ప్రవాహానికి అనుకూల వాతావరణం కల్పించడం.

◆శ్రామిక గమనశీలతను పెంచడానికి అనుకూలంగా ప్రోత్సహించడం ద్వారా ప్రపంచీకరణ జరుగుతుంది.

◆సూక్ష్మంగా చెప్పాలంటే ప్రపంచీకరణ వెనుకబడిన దేశాల అభివృద్ధికి అవసర మయ్యే సాంకేతిక విజ్ఞానం. మూలధన ప్రవాహాన్ని సుగమం చేసి, ఆధునీకరణ, ఉత్పాద కత పెంపుదల, ఉద్యోగిత విస్తరణ ద్వారా పేదరికాన్ని తగ్గించే సాధనంగా చెప్పవచ్చు.

ప్రపంచీకరణ లక్ష్యాలు

◆అంతర్జాతీయ ద్రవ్య వ్యవహారాల్లో వేగవంతమైన వృద్ధి

◆వ్యాపార రంగంలో వృద్ధివేగం, ప్రత్యేకించి బహుళజాతి సంస్థల వ్యాపార వృద్ధి.

◆బహుళజాతి సంస్థల ద్వారా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో పెరుగుదల.

◆గ్లోబల్ మార్కెట్ ఆవిర్భావం.

◆ప్రపంచీకరణ వల్ల దేశాల మధ్య కింది అంశాల విషయంలో అడ్డంకులు తొలగిపోతాయి.

◆ వస్తుసేవలు.

◆మూలధన(దేశంలోని,ఇతరదేశాలకు) ప్రవాహాలు.

◆శాస్త్ర సాంకేతికత, సాంకేతిక నిపుణుల స్వేచ్ఛా ప్రవాహం

◆వివిధ దేశాలమధ్య బంగారు స్వేచ్ఛా ప్రవాహం

◆వివిధ దేశాల మధ్య నిర్బంధం లేని మూలధన వస్తువుల ప్రవాహం, (యంత్రాలు, వస్తువులు) మొదలగునవి.



ప్రపంచీకరణకు అత్యవసర నిబంధనలు

ప్రపంచీకరణ విజయవంతం కావాలంటే ముందుగా స్వదేశం తరఫున కొన్ని అత్యవసర నిబంధనలు సంతృప్తి చేయబడాలి. అవి.

ఎ. వ్యాపార స్వేచ్ఛ
బి. అవస్థాపన సదుపాయాలు
సి. ప్రభుత్వ ప్రోత్సాహం డి. వనరులు
ఇ. పోటీతత్వం
ఎఫ్. అనుసరణీయ వ్యూహాలు

ప్రపంచీకరణకు అనుకూలాంశాలు

◆తక్కువ అభివృద్ధి చెందిన దేశాలు వనరుల కేటాయింపు సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, మూలధన ఉత్పత్తి నిష్పత్తిని తగ్గించడానికి, శ్రామికుల ఉత్పాదకతను దాని ద్వారా చివరకు ఆర్థికాభివృద్ధిని సాధించడానికి ప్రపంచీకరణ తోడ్పడుతుంది.

◆విదేశీ మూలధనాన్ని రాబట్టడంతోపాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కూడా దేశంలోకి ప్రవేశిస్తుంది.

◆ప్రపంచ పోటీతత్వం పెరిగి సంస్థలు నాణ్యమైన వస్తువులను తక్కువ ధరలకే అందించే పరిస్థితి ఏర్పడుతుంది.

◆దేశీయంగా ఉత్పత్తి అవకాశాలు విపరీతంగా పెరగడంతో, ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయి.

◆వినియోగదారులకు వివిధ రకాల వస్తువులు అందుబాటులోకి వచ్చి వినియోదారుని అభిమతం అత్యంత ప్రాధాన్యతాంశంగా మారుతుంది.

◆విదేశీ మూలధనం, విదేశీ బ్యాంకుల వల్ల పోటీ నెలకొని స్వదేశీ బ్యాంకింగ్ సామర్థ్యం, విత్తరంగ పనితీరు మెరుగుపడుతుంది. రుణావకాశాలు పెరుగుతాయి.

ప్రపంచీకరణకు ప్రతికూలాంశాలు

◆ప్రపంచీకరణ వల్ల ప్రపంచస్థాయిలో ఆర్థికశక్తి పునర్విభజన జరిగి, అది రాజకీయ శక్తి పునర్విభజనకు కూడా దారితీయవచ్చు.

◆ప్రపంచీకరణ అభివృద్ధి చెందుతున్న మనలాంటి దేశాలకు ఎక్కువ ఉపయోగపడకుండా అభివృద్ధి చెందిన దేశాలకే ప్రయోజనం చేకూర్చుతున్నది.

◆భారతదేశంలో ప్రపంచీకరణకు నాసిరకం అవస్థాపనా సౌకర్యాలు, అధిక వ్యయం, మార్పులకు అనుకూలం లేకపోవడం, చిన్న పరిమాణం మొదలగునవి ఆటంకాలుగా చెప్పవచ్చు.

ప్రపంచీకరణకు తీసుకున్న చర్యలు

◆ప్రపంచీకరణ అనే లక్ష్యాన్ని చేరుకోవడానికి, ప్రభుత్వం ఈ క్రింది చర్యలను తీసుకుంది.

◆కరెంటు అకౌంటులో రూపాయి పూర్తి కన్వర్టబిలిటీకి చర్యలు చేపట్టారు. అలాగే మూలధన అకౌంటులో కూడా పాక్షిక కన్వర్టబిలిటీకి చర్యలు మొదలయ్యాయి.

◆2007లో దిగుమతుల సుంకాన్ని 90% నుండి 10%కు తగ్గించి, తద్వారా దిగుమతుల్లో సరళీకరణను ప్రవేశపెట్టారు.

◆విదేశీ మారక ద్రవ్యపురేట్లు నిర్వహణ సంస్కరణల్లో భాగంగా 1992-93 బడ్జెట్‌లో సరళమారకపు రేటు నిర్వహణ పద్ధతిని (ఎల్‌ఈఆర్‌ఎంఎస్) ప్రవేశపెట్టారు.

◆రూపాయికి పాక్షిక మార్పిడి కల్పించారు.

◆ఈ పద్ధతిని ద్వంద్వ వినిమయ రేటు అంటారు.

◆1994 ఆగస్టులో ప్రస్తుత అకౌంట్‌లో రూపాయికి పూర్తి మార్పిడి కల్పించారు.

విశాలాంధ్ర బిజినెస్

70.42 ▲ సెన్సెక్స్ 34,503.49	19.00 ▲ నిఫ్టీ 10,651.20	-300 ▼ బంగారం (విజయవాడ) 28,250 22 క్యారెట్లు, 10 గ్రాములు	100 ▲ వెండి 40,100 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 63.66	ముడి చమురు ▲ 69.20 బ్రెంట్ ధర (డాలర్లలో..)

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఇన్ఫోసిస్	1,075.60	2.28
భారతీ ఎయిర్‌టెల్	514.75	1.66
కోటక్ మహీంద్ర	1,017.85	1.61
ఏషియన్ పెయింట్స్	1,190.00	0.97
హెచ్‌యూఎల్	1,384.75	0.91

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,698.60	-2.08
విప్రో	321.05	-1.53
ఐసీఐసీఐ బ్యాంక్	312.00	-0.82
యాక్సిస్ బ్యాంక్	563.05	-0.76
హీరో మోటార్‌కార్ప్	3,775.00	-0.70

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.59	63.66
యూరో	76.24	76.41
పౌండ్	85.99	85.87
ఆస్ట్రేలియా డాలర్	49.88	50.07
సింగపూర్ డాలర్	47.72	47.77

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,330	30,299
చెన్నై	28,330	30,299
బెంగళూరు	27,800	29,732
ముంబై	29,130	30,299
విజయవాడ	28,250	30,065



లాభాల్లో రియాల్టీ, ఐటీ రంగాలు

న్యూఢిల్లీ: దేశీయ సూచీలు గురువారం ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకులోనై చివరకు లాభాల్లో ముగిశాయి. కార్పొ రేట్ సంస్థల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో మదు పరులు ఊగిసలాటల మధ్య పెట్టుబడులు పెట్టేందుకు ఆచి తూచి వ్యవహరించారు. ప్రారంభంలో లాభాల్లో ప్రారంభమైన మార్కెట్లు కాసేపటికే నష్టాల్లో జారుకుని వెంటనే కోలుకుని లాభాల్లో ముగిశాయి. డిసెంబరులో దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 17నెలల గరిష్టానికి చేరనుండటంతో ద్రవ్యవిధానం పటిష్టత కసం సెంట్రల్ బ్యాంకుపై మరింత వత్తిడి పెరగాలసు రాయ్ టర్స్ సూచించింది. 30షేర్ల బిఎస్ఇ ఇండెక్స్ సూచీ 70.42 పాయింట్లతో 0.2శాతం పెరిగి 34,503.49 పాయింట్లు నమోదు చేసింది. 50షేర్ల నిఫ్టీ 10,651.20 పాయింట్లతో 0.18 శాతంతో 19పెయింట్లు పెరిగింది. నిఫ్టీ 10,664. 60 పాయింట్లతో అత్యంత గరిష్టాన్ని నమోదుచేసింది. తుదకు 10పాయింట్ల లాభాన్ని నమోదుచేసింది. బిఎస్ఇ సెక్టరల్ సూచీల్లో రియాల్టీ 2శాతం,ఐటి 0.84శాతం, టెక్ 0.73శాతం ఎఫ్ఎమ్ సిజి0.39 శాతం లాభాన్ని నమోదు చేసింది. ఆయిల్ అండ్ గ్యాస్ 0.29శాతం, కన్సూమర్ డ్యూరబుల్స్ 0.26 శాతం, మౌలికసదుపాయాలు 0.19 శాతం, క్యాపిటల్ గూడ్స 0.16శాతం నష్టాల్లో ముగి శాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.2శాతం, భరత్ పెట్రోలియం కార్ప్ 0.8శాతం నష్టాల్లో ముగిశాయి. ఐసిఐసిఐ బ్యాంకు 1 శాతానికి దిగజారింది. యాక్సిస్ బ్యాంకు 1.2శాతం నష్టాల్లో ముగిశాయి. ఇన్ఫోసిస్ షేర్ విలువ 1శాతం పెరిగింది. జపాన్ నిక్కీ 0.6శాతం నష్టపోయింది. డౌజోన్స్ ఇండస్ట్రి యల్ యావరేజ్ 16.67 పాయింట్లు, ఎస్ అండ్ పి 500 3.06పాయింట్లు, నాస్డాక్ కాంపోజిట్ 10.01పాయింట్లు నష్టాల్లో ముగిశాయి.



తగ్గిన టీసీఎస్ నికర లాభాలు

న్యూఢిల్లీ: 2017 డిసెంబరు త్రైమాసికానికి సంబంధించి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసిఎస్) నికరలాభాలు 3.6శాతం తగ్గి రూ.6,531 కోట్లుకుపరిమితమైనట్లు తాజా ఫలితాలు వెల్లడించాయి. ముంబై ప్రధాన కార్యాలయంగా కల టిసిఎస్ గత ఆర్థికసంవత్సరం అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో నికరలాభాలు రూ.6,778 కోట్లుగా నమోదైంది. ఆపరేషన్స్ ద్వారా ఆదాయం రూ.30,904 కోట్లు కాగా గత ఏడాది రూ.29,735 కోట్లుగా నమోదైంది. కంపెనీ డివిడెండ్‌ను షేర్‌కు రూ.7లుగా ప్రకటించింది. టిసిఎస్‌డిజిటల్ రెవెన్యూ 40 శాతం పెరిగికంపెనీ ఆదాయంలో 22.1శాతంగా ఉంది.

పన్ను మినహాయింపు పెంపు..?

- ప్రస్తుతం రూ.2.5 లక్షలు
- రూ.3 లక్షల నుంచి 5 లక్షలకు పెంచే యోచన?
- రాబోయే బడ్జెట్‌పై మధ్యతరగతి ఆశలు



న్యూఢిల్లీ : మధ్య తరగతికి ఈ బడ్జెట్లో గొప్ప ఊరట లభించే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఇది చివరి సాధారణ బడ్జెట్ కానుండడం ఇందుకు నేపథ్యం. వ్యక్తిగత ఆదాయ పన్ను మినహాయింపునుబీ పన్ను శ్లాబులను పెంచే దిశగా ఆర్థిక శాఖ యోచిస్తోందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. 2018-19 బడ్జెట్‌లో ప్రస్తుత రూ.2.5 లక్షల వార్షిక పన్ను మినహాయింపును రూ.5 లక్షలకు కాకపోయినా.. కనీసం రూ.3 లక్షలకు పెంచాలన్న ప్రతిపాదనలు ఉన్నాయని తెలుస్తోంది. మధ్యాదాయ వర్గాలకు ఊరటనివ్వడం కోసం పన్ను శ్లాబులను సైతం మెరుగుపరచే దిశగా ఆ శాఖ పనిచేస్తోందని ఆ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా రిటైల్ ద్రవ్యోల్బణం ప్రభావం పడుతున్న వేతన జీవుల కోసం ఆ చర్యలు చేపట్టే అవకాశం కనిపిస్తోంది. గత బడ్జెట్లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పన్ను శ్లాబులలో మార్పులు చేయనప్పటికీ.. తక్కువ పన్ను చెల్లింపుదార్లకు ఊరటనిచ్చారు. రూ.2.5-5 లక్షల మధ్య వార్షికాదాయం ఉన్న వారికి పన్ను రేటును 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు.

రూ.10-20 లక్షల ఆదాయ వర్గాల కోసం

వచ్చే నెల 1న ప్రకటించే తదుపరి బడ్జెట్లో రూ.5-10 లక్షల ఆదాయ వర్గాలకు 10శాతం, రూ.10-20 లక్షల ఆదాయ వర్గాలకు 20%, రూ.20 లక్షల పైబడిన వారికి 80 శాతంగా పన్ను రేట్లను విధించొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం రూ.10-20 లక్షల ఆదాయ వర్గాలకు ఎటు వంటి శ్లాబు లేదు. ద్రవ్యోల్బణం కారణంగా జీవన వ్యయాలు పెరిగిన నేపథ్యంలో ప్రాథమిక పన్ను మినహాయింపు పరిమితిని, ఇతర ఆదాయ శ్లాబులను పెంచాల్సిన అవసరం ఉంది. ఇతర దేశాల్లో గరిష్ట పన్ను రేటుకు సంబంధించిన ఆదాయం చాలా ఎక్కువగా ఉందన్న విషయాన్ని గమనించాలని పరిశ్రమ సంఘం సీఐఐ తన ముందస్తు బడ్జెట్ మెమొరాండంలో పేర్కొంది.

25 శాతానికి ఒప్పుకోకపోవచ్చు

పరిశ్రమ సంఘాలు గరిష్ట పన్ను రేటును 25 శాతానికి తగ్గించాలని కోరుతున్నప్పటికీ అలా జరగకపో వచ్చని విశ్లేషకులు అంటున్నారు. ద్రవ్యలోటుపై ఉన్న విపరీతమైన ఒత్తిడి ఇందుకు కారణం. జూలై 1న జీఎస్టీ అమలు తర్వాత పరోక్ష పన్ను వసూళ్లు స్తబ్దుగా మారాయి. దీంతో 2011-18లో ద్రవ్యలోటును జీడీపీలో 8.2 శాతానికి పరిమితం చేయడం కష్టతరమవుతోంది లోటును పూడ్చడం కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రుణ లక్ష్యాన్ని ప్రభుత్వం అదనంగా రూ.50000 కోట్లకు పెంచింది

స్టాండర్డ్ డిడక్షన్ ప్రవేశపెట్టాలి

పెద్ద నోట్ల రద్దు ప్రభావం మరికొద్ది నెలల పాటు కొనసాగవచ్చని కాబట్టి గిరాకీని మరింత పెంచాల్సిన అవసరం ఉందని ఫిక్కీ అంటోంది. ఈ నేపథ్యంలో ఆదాయ పన్ను శ్లాబుల సవరణను ప్రభుత్వం పరిశీలించాలని గరిష్ట పన్ను-ఆదాయ స్థాయిని మరింత పెంచాలని అంటోంది. దీనివల్ల కొనుగోలు శక్తి మెరుగవుతుంది. అదనపు గిరాకీ వస్తుంది రూ.20 లక్షలు పైబడితేనే 80 శాతం పన్ను రేటును వర్తింపజేయాలి. అదనంగా వ్యాపార కార్యకలాపాలు, విస్తరణకు అందుబాటు ధరలో రుణాలు లభ్యం కావాలంటే వడ్డీ రేట్లను తగ్గించాలని కోరింది. 'వేతన ఉద్యోగులకు స్టాండర్డ్ డిడక్షన్ను తిరిగి ప్రవేశపెట్టాలి. రూ.లక్ష వరకు అవకాశం ఇవ్వాలి. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుందని అభిప్రాయపడింది. పన్ను వర్తించే ఆదాయంపై చేసే ప్రామాణిక మినహాయింపు (స్టాండర్డ్ డిడక్షన్)ను 2006-07 మదింపు సంవత్సరం నుంచి రద్దు చేసిన సంగతి తెలిసిందే.

తక్కువ జీడీపీతో. ద్రవ్యలోటు లక్ష్యం క్లిష్టం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు తగ్గుతుందన్న అంచనాలను చూస్తే ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరడం క్లిష్టతరం కావొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2017-18 బడ్జెట్లో జీడీపీలో ద్రవ్యలోటును 3.2 శాతానికి లేదా రూ.5,435 లక్షల కోట్లకు పరిమితం చేయాలని నిర్దేశించుకున్నారు.

సాధారణ జీడీపీ వృద్ధి 18 శాతంగా ఉంటుందన్న అంచనాలను ఇందుకు ఆధారంగా చేసుకున్నారు. అయతే సాధారణ జీడీపీ 0.5 శాతానికే పరిమితం కానుందని ఇటీవల కేంద్ర గణాంక కార్యాలయం విడుదల చేసిన తొలి ముందస్తు అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఓ వైపు పన్ను వసూళ్లు తగ్గడం, మరో వైపు తక్కువ జీడీపీ అంచనాలతో ద్రవ్యలోటు శాతం వారీగా పెరుగుతోంది.

17నెలల గరిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: డిసెంబర్‌లో భారతీయ రిటైల్ ద్రవ్యోల్బణం 17నెలల గరిష్టానికి చేరు కుంటుందని రాయ్‌టర్స్ పోల్ అంచనా వేసింది. నవంబరులో 15 నెలల గరిష్టానికి చేరి 4.88 శాతం నమోదుచేసిన రిటైల్ ద్రవ్యోల్బణం 2016 జులై అనంతరం 5.10 శాతంతో వినియోగదారు ధరల ద్రవ్యోల్బణం అత్యధికంగా నమోదైంది. డిసెంబర్ ద్రవ్యోల్బణ గణాంకాలు శుక్రవారం విడుదల చేయనున్నారు. డిసెంబరులో ఆహారపదార్థాల ధరలు మరింత పెరగడంతో ద్రవ్యోల్బణ శాతం ఎక్కువగా ఉంటుందని తెలుస్తోంది. డిసెంబరులో రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా పాలసీ రేట్లలో తటస్థ వైఖరిని అవలంబించిన విషయం విదితమే... దీనికి సంబంధంచిన ధరలు వత్తిళ్లు, వృద్ధి అవకాశ పట్టికలో ఉన్నట్లు పేర్కొంది. ఈ మధ్యకాలంలో ఆహార ద్రవ్యోల్బణ శాతం పెరుగుతున్నప్పటికీ డిసెంబర్‌లో కొంత నిలకడగా ఉన్నట్లు ఆర్థికవేత్త అభిషేక్ ఉపాధ్యాయ వెల్లడించారు. గత నెలలో కూరగాయల ధరలు కొంత తగ్గినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు గత సంవత్సరం జులైలో పెరగవలసిన పే రివిజన్ చెల్లించవలసిరావడంతో దీని ప్రబావం డిసెంబర్‌నెలపై ప్రభావం చూపనుంది. నవంబరులో టోకు ధరల సూచీ 3.93శాతం కాగా డిసెంబరులో 4శాతానికి పెరగనుందని తాజా పోల్ వెల్లడించింది. అక్టోబరులో 2.2శాతం ఉన్న పారిశ్రామికోత్పత్తి నవంబరులో మరింత పెరిగి 4.4శాతం నమోదైంది. నవంబరులో ఎగుమతుల శాతం పెరగడంతో ఈ ప్రభావం పారిశ్రామికోత్పత్తి పెరుగుదలకు సహకరిస్తుందని ప్రముఖ ఆర్థికవేత్త ప్రకాశ్ సక్పాల్ వెల్లడించారు.

2022 నాటికి రూ.500 కోట్లకు ఐవీఎఫ్ మార్కెట్

న్యూఢిల్లీ: 2022 నాటికి దేశం 75వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోనుంది. దేశంలో ఆన్-విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) ప్రక్రియతో పిల్లలు లేని జంటలు అత్యాధునిక ఆర్టిఫిషియల్ మెడికల్ చికిత్సావిధానంతో తల్లిదండ్రులుగా మారేందుకు అవకాశం ఉంది. యునైటెడ్ నేషన్స్ అంచనాల మేరకు ఇప్పటినుండి ఆరేళ్లకు అంటే 2024 నాటికి భారత్ 150 కోట్ల జనాభాతో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కల దేశంగా నమోదు కానుందని తెలిపింది. కానీ ఉన్నత స్థాయి వర్గంలో ఇన్‌ఫెర్టిలిటీ(సంతానం లేకపోవడం) పెరుగుతుండటం, కింది స్థాయి వర్గాలుజనాభా పెరుగుదలకు కారణమవుతోంది. ఉన్నతస్థాయిలో సంతానం లేకపోవడంతోఎక్కువమంది సరోగసి, విధానానికి మొగ్గు చూపుతున్నారు. తక్కువ ఆదాయవర్గాలనుండి సరోగసి మదర్స్‌కు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఆర్థికంగా వెసులుబాటుకు గాను వీరు దీనికి ఆమోదయోగ్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. సరాసరిన ప్రతిదినం ప్రతి స్త్రీకి 10 సరోగసి ప్రపోజల్స్ వస్తుండగా సంవత్సరానికి ఈ సంఖ్య 4,000కి చేరుకుంటోంది. సరొగేట్ మదర్‌గా అంగీకరించేముందు కావలసిన పరీక్షలన్నీ చేయబడతాయి. తమ గర్భాన్ని అద్దెకిచ్చినందుకు గాను రూ.5లక్షలు పలుకుతున్నారని న్యూఢిల్లీలోని ఇంటర్నేషనల్ ఫెర్టిలిటీ సెంటర్ సీఈఓ సర్థాక్ బక్షీ వెల్లడించారు. ఈ డబ్బును నేరుగా ఆయా స్త్రీల ఎకౌంట్లలో వేయబడతాయి. సరోగసి విధానం ఒక్కటే పిల్లలు లేని వాళ్లకు పరిష్కారం కాదు. మన దేశంలో ఐవిఎఫ్ మార్కెట్28శాతం పెరిగి 2022 నాటికి రూ.495 కోట్లుకు చేరుకోవచ్చునని తెలుస్తోంది.

ఉక్కు ఉత్పత్తి రికార్డు



న్యూఢిల్లీ: 2017లో ముడి ఉక్కు ఉత్పత్తి రికార్డుస్థాయిలో 100 మిలియన్ టన్నులకు చేరుకోంది. దేశీయ ముడిఉక్కు 6 శాతం పెరిగి అత్యధిక స్థాయిలో 101. 28 మిలియన్ టన్నులకు చేరుకున్నట్లు అధికార గణాంకాలు వెల్లడించాయి. 2017-18 సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్-డిసెంబరులో ఉక్కు ఉత్పత్తి 4.6 శాతం పెరిగి 75.50 మిలియన్ టన్నులు కాగా ఏడాదిక్రితం 72.20 మిలియన్ టన్నులు నమోదైనట్లు ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ ఇండస్ట్రీ తాజా నివేదికలో వెల్లడించింది. మొదటిసారి భారత్ క్రూడ్ స్టీల్ ఉత్పత్తిని 100 మిలియన్ టన్నుల మార్క్‌ను దాటి 5.87 శాతం వృద్ధితో 101.227 మిలియన్ టన్నులు నమోదు చేసింది. కేవలం డిసెంబర్‌లోనే 8.65 మిలియన్ టన్నులుకాగా అంతకుముందు సంవత్సరం 8.38 టన్నులుగా నమోదైంది. సెయిల్, ఇర్ఐఎన్ఎల్, టిఎస్ఎల్, ఎస్సార్, జెఎస్‌డబ్ల్యు, జెఎస్‌పిఎస్ మొత్తం కలిపి 2017 ఏప్రిల్-డిసెంబర్ కాలానికి 43.39 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయగా అంతకు ముందు సంవత్సరంతో పోల్చుకుంటే 6.5శాతం అధికం. మిగిలిన 32.10 మిలియన్ టన్నుల ఉక్కు ఇతర ఉత్పత్తుల నుండి 2.1శాతం వృద్ధితో లభ్యమైందని ఉక్కు శాఖమంత్రి చౌదరి బీరేంద్ర సింగ్ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ వృద్ధితో భారతీయ ఉక్కు రంగం మరింత బలోపేతమవుతుందని ట్వీట్ చేశారు. అంతర్జాతీయంగా చైనా, జపాన్ తరువాత క్రూడ్ స్టీల్ ఉత్పత్తిలో భారత్ మూడవస్థానంలో ఉంది. దీనితో భారత్ రెండవస్థానాన్ని కైవశం చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. దేశీయ ఉక్కు రంగాన్ని ప్రోత్సహించేందుకు, ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం కూడా పలు చర్యలు తీసుకుంటోంది. 2030 నాటికి దేశీయ ఉక్కుఉత్పత్తిని 300 మిలియన్ టన్నులకు చేర్చేందుకు మే3 న క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. దీనికోసం 10లక్షల కోట్లను పెట్టుబడిగా పెట్టేందుకు రంగం సిద్ధం చేసింది.

పెట్టుబడుల ఉపసంహరణకు కసరత్తు!

- 2018-19కు ప్రణాళికలు..
- ఇప్పటికే పలు పీఎస్‌యూల వాటాలు విక్రయం
- ఎయిరిండియాలో ఎఫ్‌డీఐలకు ఇదే కారణం



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముఖగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు శక్తులకు కట్టబెట్టడానికి మోడీ ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తుంది. సంస్కరణల్లో భాగంగా ఇప్పటికే చాలా పీఎస్‌యూల వాటాలను మార్కెట్ శక్తులకు విక్రయించింది. దీన్ని కొనసాగించడానికి ఏకంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన డిజిన్వెస్ట్‌మెంట్‌పై ఇప్పటి నుంచే కేంద్రం ప్రణాళికలు రూపొందిస్తోందని తెలుస్తోంది. 2018-19లో రెండు డజన్ల పైగా కంపెనీల్లోని వాటాలను ఉపసంహ రించుకోవడానికి ఎత్తుగడలు వేస్తోంది. ముఖ్యమైన ఎయిర్ ఇండియా, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ మెడిసిన్ ఫార్మాస్యూటికల్ కార్పొరేషన్ లిమిటెడ్‌లతో పాటు మరో రెండు డజన్ల కంపెనీలు ఈ జాబితాలో ఉండనున్నాయని సమాచారం. ఎయిర్ ఇండి యాలో 49 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతిస్తూ బుధవారం నిర్ణయం తీసుకున్నది. రైల్వే పీఎస్‌యూలు అయినటువంటి ఐఆర్‌సీటీసీ, ఇర్‌కాన్ లిమిటెడ్ రక్షణ రంగానికి చెందిన మిశ్రదాతు నిగమ్, మజెగావ్ డాక్ లిమిటెడ్ తదితర పీఎస్‌యూలు ఉన్నాయి. ఇవన్నీ పీఎస్‌యూల్లోనూ డిజిన్వెస్ట్‌మెంట్ చేపట్టడానికి సిద్దంగా ఉన్నారని సమాచారం. ఇప్పటికే ఆయా కంపెనీల న్యాయ సలహాదారులు, లావాదేవీల కోసం కావాల్సిన అనుమతులకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

ఎన్నికల భయం..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మోడీ ప్రభుత్వం పెట్టుకున్న డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం రూ.72,500 కోట్లతో పోల్చితే 2018-19లో తక్కువగా ఉండొచ్చు. ఈ దఫా లక్ష్యం రూ.50,000-రూ.55,000 కోట్ల మధ్య ఉంటుందని అంచనా. తక్కువ టార్గెట్ పెట్టుకుని ఎక్కువ ఫలితాలను సాధించాలని ప్రభుత్వం భావిస్తోందని తెలుస్తోంది. 2018లో పలు రాష్ట్రాల ఎన్నికలు రానున్న నేపథ్యంలో డిజిన్వెస్ట్‌మెంట్ వేగం తగ్గొచ్చని భావిస్తున్నారు. ఎన్నికల వేళ పీఎస్‌యూల్లో పెట్టుబడుల ఉపసంహరణ చేపడితే ప్రజలు, ఆ సంస్థల ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావొచ్చని ప్రభుత్వం భయపడొచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు. డీజిన్వెస్ట్‌మెంట్‌పై కేంద్రం ఈ నెల చివరలో తుది నిర్ణయానికి రానుంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ రాబడి, వ్యయాల అంచనాలను బట్టి డిజిన్వెస్ట్‌మెంట్‌పై నిర్ణయం తీసుకోనున్నారు. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ డిజిన్వెస్ట్‌మెంట్‌పై ప్రకటన చేయనున్నారు.

ఇప్పటికే రూ.53వేల కోట్లు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు వివిధ పీఎస్‌యూల్లో వాటాల విక్రయం ద్వారా రూ.53,833.05 కోట్లు సమీకరించింది. ఈ మొత్తం విలువ చేసే పీఎస్‌యూల వాటాలను మార్కెట్ శక్తులకు కట్టబెట్టారు. వచ్చే రెండు నెలల్లో మరిన్ని పీఎస్‌యూల్లో వాటాలను విక్రయించడం ద్వారా లక్ష్యాన్ని చేరాలని నిర్దేశించుకుంది. అదే విధంగా ఓఎన్‌జీసీ, హెచ్‌పీసీఎల్‌ల విలీనం జరుగనుంది. కాగా 2018-19లో రూ.47,000 కోట్లు, 2019-20లో రూ.40,000 కోట్ల విలువ చేసే పీఎస్‌యూల వాటాలను కేంద్రం ఉపసంహరించుకునే అవకాశం ఉందని సమాచారం.

విజ్ఞానం

ఇకపై హెచ్‌ఐవిలకు

వారానికే ఒక్క గుళికే..



హెచ్‌ఐవీ రోగులకు ప్రతిరోజూ ఔషధాలు మింగకుండా తప్పేలా సరికొత్త గుళికలను శాస్త్రజ్ఞులు రూపొందించారు. వారం రోజులపాటు హెచ్‌ఐవీ చికిత్సకు అవసరమైన మూడు రకాల ఔషధాలు ఈ గుళికలో ఉంటాయి. దీన్ని ఒక్కసారి తీసుకుంటే... వారం రోజులు ఇతర మాత్రలను వేసుకోవాలసిన అవసరం ఉండదు. నక్షత్ర ఆకృతి లోని ఈ ఔషధాన్ని అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ పరిశో ధకులు అభివృద్ధి చేశారు. హెచ్‌ఐవి చికిత్సలో క్రమం తప్పకుండా మందులను వాడటం తప్పనిసరి. కాబట్టి వారానికోసారి తీసుకోవలసిన ఈ ఔషధంతో హెచ్‌ఐవీ బాధితులకు వరంగా మారనుంది. హెచ్‌ఐవీ సోకే ముప్పు ఎక్కువగా ఉన్న వ్యక్తుల్లో నివారణకు కూడా ఇది దోహదపడుతుందని తెలుస్తోంది.

నక్షత్ర వ్యవస్థలో

గ్రహాలన్నీ ఒకే విధంగా...



సౌరకుటుంబానికి ఆవల దూరంలో ఉన్న సుదూర గ్రహాలకు సంబంధించి...ఒకే నక్షత్రం చుట్టూ తిరుగుతున్న గ్రహాల పరిమాణం, పరిభ్రమణ వేగం దాదాపు సమానంగా ఉన్నట్లు శాస్త్రజ్ఞులు వెల్లడించారు. 1305 నక్షత్రాల చుట్టూపరిభ్రమిస్తున్న 2,025 గ్రహాలను పరిశీలించిన శాస్త్రజ్ఞులు వారి వర్ణపటాలను తిలకించి విశ్లేషించారు. నక్షత్రాలతోపాటు వాటి చుట్టూ తిరుగుతున్న గ్రహాల పరిమాణాలను లెక్కించి పరిశోధించగా, అత్యధిక నక్షత్ర వ్యవస్థలో పక్కపక్కనున్న గ్రహాల పరిమాణం, పరిభ్రమణ వేగం దాదాపు సమానంగా ఉన్నట్లు తేల్చారు. సౌర వ్యవస్థలో గ్రహాల మధ్య పరిమానం, పరిభ్రమణ వేగాల్లో భారీ వ్యత్యాసాలున్న సంగతి అటుంచితే అన్ని నక్షత్ర వ్యవస్థలు ఒకే తరహాలో ఆవిర్భవించలేదనే సంగతిని ఈ అధ్యయన ఫలితాల్లో గ్రహించవచ్చు.

ఆధార్ గోప్యతకు వర్చువల్ ఐడీ

ప్రకటించిన యూఐడీఏఐ

న్యూఢిల్లీ: ఆధార్ సమాచార గోప్యతపై వెల్లువెత్తే వినియోగదారుల ఆందోళనలకు యూఐడీఏఐ ఒక పరిష్కారాన్ని ప్రతిపాదిస్తోంది. అవసర ప్రాధాన్యత ప్రాతిపదికన ఆధార్ కార్డున్న వారి అభ్యర్థన మేరకు ఒక వర్చువల్ ఐడీని జారీ చేయాలని నిర్ణయించింది. బుధవారం నుంచి ఈ కొత్త విధానం అమల్లోకి తెచ్చింది. 16అంకెలుండే ఈవర్చువల్ ఐడీని తమ అధికార వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని యూఐడీఏఐ తెలిపింది. ఆధార్ కార్డు హెూల్డరుకు మినహా మరే ఇతర వ్యక్తికి సంస్థకూ వర్చువల్ ఐడీని కేటాయించరని తెలిపింది. దీని సాయంతో సిమ్ యాక్టివేషన్ సహా పలు సేవలను నిరంతరాయంగా పొందవచ్చని తెలిపింది. దీని ప్రవేశంతో మునుపటిలా ఆధార్ సంఖ్యలోని 12 అంకెలను ఇతర సేవా అవసరాలకు పంచుకునే అవసరం ఉండదని తెలిపింది. ఒక సారి జారీ చేసిన వర్చువల్ ఐడీ వినియోగం అయిన వెంటనే రద్దు అవుతుందని మరలా మరో సేవా అవసరం ఏర్పడినపుడు కొత్త వర్చువల్ ఐడీని పొందవచ్చని ఇలా ఎన్నిసార్లు కావాలన్నా కొత్త వర్చువల్ ఐడీలు పొందేందుకు వెసులు బాటు కల్పిస్తున్నట్లు తెలిపింది ఈ వర్చువల్ ఐడీ ద్వారా పేరు, చిరునామా వంటి సాధారణ గుర్తింపుకు అవసరమైన సమాచారం మాత్రమే వెల్లడవుతుందని తెలిపింది. దీంతో పాటుగా మీ ఖాతాదారుని తెలుసుకోండి (కేవైసీ)లను పరిమితంగా జారీ చేయాలని యూఐడీఏఐ నిర్ణయించింది దీని ద్వారా సేవలందించే అధీకృత సేవా సంస్థకు అవసరమైన మేరకే అభ్యర్థి తాలూక సమాచారం పరిమితంగానే లభిస్తుందని హామీ ఇస్తోంది. ఈచర్యల ద్వారా పౌరులు వ్యక్తం చేసే భద్రతపరమైన ఆందోళనలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమని యూఐడీఏఐ తెలిపింది. యూఐడీఏఐ ఇప్పటి వరకు సుమారు 119కోట్ల ఆధార్ కార్డులు జారీ చేసింది. ప్రభుత్వప్రభుత్వేతర సంస్థల సేవలు పొందేందుకు ఆధార్ అనివార్యమవుతున్న పరిస్థితిలో వెల్లువెత్తిన భద్రత సమస్యలకు తాజా ప్రతిపాదనలు పరిష్కారం చూపుతాయని యూఐడీఏఐ పేర్కొంది.

ఫేస్‌బుక్ బానిసలు మాకొద్దు

మాట్రీమోనీల వినూత్న ప్రకటనలు



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో మాట్రిమోనియల్ ప్రకటనల్లో వినూత్న మార్పులు చోటు చేసు కుంటున్నాయి. సామాజిక మాధ్య మాలు ఫేస్‌బుక్, వాట్సాప్ లాంటి వాటికి బానిసలుగా మారిన అమ్మాయిలను పెళ్లి చేసుకునేందుకు అబ్బాయిలు ఇష్టపడడం లేదనేది ఈ ప్రకటనల సారాంశం. ' మా అబ్బాయి ప్రభుత్వ ఉద్యోగి. తను పెళ్లి చేసుకునే అమ్మాయి వయసు 18 నుంచి 22 ఏళ్లుండాలి. కనీసం ఇంటర్మీడియట్ పాసైతే సరిపోతుంది. వీటన్నిటికన్నా ముఖ్య మైనది ఆ అమ్మాయి సామాజిక మాధ్యమాలు ఫేస్‌బుక్, వాట్సాప్‌కు బానిస కాకుండా ఉండాలి' అని ఒక మాట్రిమోని ప్రకటన వెలువడింది. ఇలాంటి ప్రకటనలు ఇవ్వడం వెనక ఏదో కారణం ఉంటుందని, సామాజిక మాధ్య మాలకు బానిస అవడం వల్ల వైవాహిక జీవితంలో ఇబ్బందులు ఎదురవు తాయని వారు భావిస్తున్నట్లు సామాజికవేత్త ప్రశాంత్ రే అభిప్రాయపడ్డారు. ఈ మధ్యకాలంలో వచ్చిన నివేదికల ఆధారంగా భారత్‌లో దాదాపు 24.1 కోట్ల మంది ఫేస్‌బుక్, 20 కోట్ల మంది వాట్సాప్ ఉపయోగిస్తున్నారని అంచనా. యువతలో ఆందోళన, డిప్రెషన్, నిద్రలేమి తదితర సమస్యలకు ప్రధాన కారణం సామాజిక మాధ్యమాలేనని ఓ సర్వేలో వెల్లడైంది. ఈ రోజుల్లో యువత వారి వ్యక్తిగత విషయాలను బాహ్య ప్రపంచానికి చెప్పేందుకు ఇష్టపడడం లేదని, అందువల్లనే ఇలాంటి ప్రకటనలు ఇస్తున్నారని సామాజికవేత్త స్వాతి ఘోష్ అన్నారు. సామాజిక మాధ్యమాలు సమాజంలో ఎంతో అలజడి సృష్టిస్తున్నాయి. లైక్స్, షేర్స్ రావాలనే ఆతృతతో ఇతరులను అనేక రకాలుగా మోసం చేస్తున్నారు. అందుకే అబ్బాయిల కుటుంబాలు ఇలాంటి ప్రకటనలు ఇస్తున్నారని మాజీ పోలీసు అధికారి పల్లభకాంత్ ఘోష్ పేర్కొన్నారు.

కష్టే ఫలి!

ఆనందపురంలో రాఘవయ్య, రాజమ్మ దంపతులకు రత్నయ్య అనే కొడుకున్నాడు. ఒక్కడే కొడుకు కావడంతో ఎంతో గారాబంగా పెంచారు. తల్లిదండ్రుల్లా పదిమందికి సాయం చేయడం వంటి మంచిలక్షణాలున్నా సోమరితనం అతనికున్న ఏకైక శత్రువని చెప్పాలి. కష్టపడి పనిచేయడం అతనికి తెలియదు. తల్లిదండ్రులంటే ఎంతో ప్రేమ. గతంలో రాఘవయ్య తమ వ్యవసాయభూమిలో పంటలు పండించినా ఓపిక లేకపోవడంతో సాగుచేయడం మానేశాడు. కొడుకులో ఉన్న సోమరితనాన్ని పోగొట్టి కష్టపడేలా చేయాలని ఎంతో ఆశపడేవాడు. కాని ఏం చేయాలో తెలియక మిన్నకుండిపోయాడు. ఒకసారి రాఘవయ్య బావమరిది రాజారాం చెల్లెలును చూడటానికి వస్తాడు. రాఘవయ్య కొడుక్కి ఉన్న సోమరితనం గురించి, పొలం గురించి బాధపడతాడు రాజారాం దగ్గర. అందుకు రాజారాం రాఘవయ్యతో 'బావా! నేను ఏదో ఒకటి ఆలోచించి రత్నయ్యలో మార్పువచ్చేలా చేస్తాను. అందుకు మీరు నేను చెప్పినట్లు చేయండి..' అని తాను చెప్పాలనుకున్నది చెప్పి రెండురోజుల తర్వాత వస్తాను' అని తన ఊరు వెళ్ళిపోతాడు.

నాలుగురోజుల తర్వాత ఊరు నుండి కూతురు స్వప్నతో పాటు మళ్ళీ వస్తాడు రాజారాం. 'ఏం బావా! మీ ఒంట్లో ఎలా ఉంది. మీ ఇద్దరికి ఆరోగ్యం బాగుండటం లేదని చెప్పావు. అదే విషయం మా ఊర్లో నాకు వ్యాపారం కలిసొస్తుందని గతంలో నాకు చెప్పిన మా గురువుగారిని కలిసి మీ విషయం చెప్పా. ఆయన మీ ఇంటి నుంచి చూస్తే కనిపించేలా మీ పొలంలో బావిని తవ్వమని చెప్పాడు. దానివల్ల మీకు ఆరోగ్యం కుదుటపడుతుంది, అందరు క్షేమంగా ఉంటారని చెప్పాడు. కాకుంటే మీకు సంబంధించిన వారే ఆ పనిచేయాలి. అప్పుడే ఫలితముంటుందన్నారు. అలా చేసేటట్లయితే రేపు మంచిరోజని చెప్పారు. అందుకే వెంటనే వచ్చా' అన్నాడు. దానికి రాఘవయ్య 'ఇప్పుడు నాకు ఓపిక లేదులే బావా! రత్నయ్య చేయలేడు. మా అదృష్టం ఇంతే అనుకుంటాం. ఉన్నన్ని రోజులు ఇలాగే అనారోగ్యంతో బాధపడతాం' అన్నాడు.

తర్వాత ఆ రోజు రాత్రి రాజారాం రత్నయ్య వినేట్లు కూతురితో 'స్వప్న! అత్తమ్మకు తగ్గేవరకు ఇక్కడే ఉండు. ఎట్లాగో బావను చేసుకుని ఇక్కడికే కదా రావల్సింది. కాకుంటే కొంచెం ముందుగా వచ్చావు అంతే' అంటాడు. దానికి స్వప్న 'నాన్న! మామయ్య, అత్తయ్య అంటే నాకూ ఇష్టమే. నువ్వు ఉండమంటే ఎన్నిరోజులైనా ఉంటాను. బావని పెండ్లిచేసుకోమని మాత్రం అనకు. బావంటే నాకు ఇష్టమే. కాని ఏపనిచేయలేడు. పొద్దున్న మీరు చెప్పింది తెలిసిన తర్వాతైనా తను ఏదైనా చేయాలి కదా! ఈ వయసులో కష్టపడకపోతే ఎట్లా! కనీసం అమ్మనాన్నలకోసమైనా' అంది రత్నయ్య వినేట్లు చూడకుండా. ఆ మరుసటిరోజు పొద్దున్నే రత్నయ్య కనిపించకపోయేసరికి కంగారుపడ్డారు. తర్వాత పొలంలో తవ్వుతుండటం చూసి రాజారాం అక్కడకు వెళ్ళి 'రత్నయ్య! ఏమిట్రా! నువ్వు తవ్వుతున్నావు. చాలా కష్టపడాలిరా! వచ్చేయ్! వెళ్ళిపోదాం' అన్నాడు.

'లేదు మావా! నేను బావి తవ్వి తీరతాను. నేను సోమరినే కాని అమ్మనాన్నంటే ప్రేమలేనివాడ్ని కాను. వాళ్ళ తర్వాతే నాకు ఎవరైనా. వాళ్ళకోసం ఏమైనా చేస్తాను' నువ్వెళ్ళు నేను తర్వాత వస్తాలే' అన్నాడు.

రెండురోజుల వరకు కొంచెం కష్టంగా అనిపించినా క్రమంగా దానికి అలవాటుపడటంతో రత్నయ్యలో సోమరితనం పోయింది. తవ్వడంలో వేగం పెంచాడు. వారంరోజుల్లో చాలా తక్కువలోతులోనే నీళ్ళుపడ్డాయి. ఆ చుట్టుపక్కల అంత తక్కువ లోతులోనే నీళ్ళు పడటం అరుదని రత్నయ్య అదృష్టవంతుడని అన్నారు. తన శ్రమను గుర్తించడంతో ఆనందపడ్డాడు. కష్టపడటంలో ఎంత ఆనందముంటుందో తెలుసుకున్నాడు. పొలంలో పంట వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు తండ్రి సాయంతో. ఇంతకాలం తన వల్ల ఇబ్బందిపడ్డ తల్లిదండ్రులను క్షమించమని, తనలో మార్పుకు కారణమైన మేనమామకు, స్వప్నకు కృతజ్ఞతలు చెప్పాడు రత్నయ్య.

– పి.వి.కె.





ప్ర ప్ర థ మం



సినిమాలకు అవార్డులు ఇవ్వడం 1912లో మొదలైంది. 'ఆఫ్టర్ ఫిఫ్టీ ఇయర్స్' అనే ఇటాలియన్ కళాఖండం ఈ తొలి అవార్డును 25వేల ఫ్రాంకుల నగదు రూపంలో గెలుచుకుంది.

సంభాషణ ఒక నాగరికత. మౌనం మనిషిని ప్రపంచం నుంచి వేరు చేస్తుంది.

- థామస్‌మన్



తండ్రి : ఈనెల లెక్కల్లో ఎన్ని మార్కులు వచ్చాయిరా..

కొడుకు : ఏడుపు ముఖం పెట్టి 'అరసున్నా'

తండ్రి : అరసున్న ఏమిటిరా.. నీ ముఖం

కొడుకు : ఆ సంగతే మాస్టారినడిగితే నీ ముఖానికి సున్నా కూడానా అని తిట్టారు నాన్నా.



చిన్నారులూ తెలుసుకోండి!

భారత్‌లో నోబెల్ బహుమతి గెలుచుకున్న మొదటి వ్యక్తి ఎవరు?
– రవీంద్రనాథ్ ఠాగూర్

మన దేశంలో మొట్టమొదటి మహిళా ఐపీఎస్ ఎవరు?
– కిరణ్‌బేడీ

మన జాతీయ క్రీడ ఏది?
– హాకీ

'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అని ఎవరికి పేరు?
– ఏపీజే అబ్దుల్‌కలాం

ఎలక్ట్రిక్ బల్బ్‌ను కనిపెట్టింది ఎవరు?
–థామస్ ఆల్వా ఎడిసన్


'నైటింగేల్ ఆఫ్ ఇండియా' అని ఎవరిని అంటారు?
– సరోజినీ నాయుడు.

ప్రపంచంలో అతి పెద్ద పువ్వు ఏది? – రఫ్లీషియా

మానవ శరీరంలో అతి పెద్ద అవయవం ఏది?
– కాలేయం



చుక్కలు కలపండి





దీపికకి రణ్‌వీర్ పేరెంట్స్ గిఫ్ట్


బాలీవుడ్‌లో సీక్రెట్ పెళ్లిళ్ళ సంఖ్య క్రమ క్రమంగా పెరుగుతూ పోతున్న సంగతి తెలిసిందే. మొన్న విరుష్క దంపతులు ఇటలీలో రహస్య వివాహం చేసుకోగా, రీసెంట్‌గా టైగర్ ష్రాఫ్, దిశా పఠానీలు శ్రీలంకలో పెళ్లి చేసుకున్నట్టు పలు వార్తలు వచ్చాయి. ఇక ఇప్పుడు దీపికా పదుకొణే, రణ్ వీర్ సింగ్‌ల వివాహం కూడా త్వరలోనే సీక్రెట్‌గా జరగనుందని కొన్ని బాలీవుడ్ మీడియా సంస్థలు చెబుతున్నాయి. దీపికా, రణ్‌వీర్‌లు ఎప్పటి నుండో ఎఫైర్లో ఉన్నారని అభిమానులు భావిస్తుండగా, శ్రీలంకలో వీరిద్దరి నిశ్చితార్థం జరిగిందనే టాక్ వినిపిస్తుంది. జనవరి 5న 32 వసంతంలోకి అడుగు పెట్టిన దీపిక పుట్టినరోజు వేడుకను తన ప్రియుడు రణవీర్ సింగ్, అతడి ఫ్యామిలీతో కలిసి శ్రీలకంలో జరుపుకుందట. పుట్టినరోజు సందర్భంగా రణవీర్ సింగ్ తల్లిదండ్రులు అంజు భవాని, జగ్జీత్ సింగ్ దీపికకు ఖరీదైన వజ్రాలహారం, సబ్యాసాచి సారీ గిఫ్టుగా ఇచ్చారట. దీంతో బాలీవుడ్ మీడియాలో ఆసక్తికర చర్చ సాగుతోంది. సాధారణంగా పట్టుచీరలు, హారాలు వంటి గిఫ్ట్ తమ ఇంటికి కోడలుగా వచ్చే అమ్మాయికి ఇస్తుంటారు. బయటి వ్యక్తులకు ఎవరూ ఇలాంటి గిఫ్టులు ఇవ్వరు కాబట్టి రణ్ వీర్, దీపిక పదుకునేలు త్వరలో ఒకటి కాబోతున్నారనే వార్త ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అంతేకాదు గతంలో దీపిక తన హజ్బెండ్ గురించి చెబుతూ.. ఆర్ అనే అక్షరంతో తన భర్త పేరు ఉంటుందని చెప్పింది. దీంతో అందరు దీపిక భర్త రణ్ వీర్ అని ఫిక్స్ అయిపోయారు. మరి ఇన్ని గాసిప్స్ మధ్య అసలు నిజమేంటో తెలియాలంటే కొద్ది రోజులు ఆగాల్సిందే.



త్రివిక్రమ్ పాత్రలు నచ్చలేదు : ఖుష్బూ



దాదాపు పదేళ్ల తర్వాత 'అజ్ఞాతవాసి' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చారు ప్రముఖ నటి ఖుష్బూ. త్రివిక్రమ్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైన బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. చాలా రోజుల తర్వాత ఖుష్బూ ఇదే సినిమాలో నటించడానికి కారణం ఏంటి? అన్న ప్రశ్నకు ఆమె చెప్పిన సమాధానం ఇది. 'చాలా కాలం సినిమాలకు దూరంగా ఉన్నా. తెలుగే కాదు తమిళ సినిమాలకు కూడా. ఇది నాకు సెకండ్ ఇన్నింగ్స్ లాంటిది. కాబట్టి ప్రేక్షకులను ఆకట్టుకునేలా నా పాత్ర ఉండాలి. 'అజ్ఞాతవాసి'లో నా పాత్ర అలాంటిదే. త్రివిక్రమ్ ఈ పాత్ర గురించి నాకు వివరించినప్పుడు చాలా నచ్చింది. చెప్పాలంటే.. త్రివిక్రమ్ గతంలోనూ నాకు చాలా స్క్రిప్టులు వినిపించారు. కానీ, నాకు అవేవీ నచ్చలేదు. 'అజ్ఞాతవాసి'లో నా పాత్ర గురించి వివరించే ముందు 'మేడం.. ఈ పాత్రకు మాత్రం నో చెప్పకండి' అన్నారు. అంత మంచి పాత్ర నాకు ఇచ్చినందుకు నేను నో ఎందుకు చెప్తాను?' అన్నారు. అనంతరం పవన్ కల్యాణ్‌తో తెర వంచుకోవడం గురించి వివరిస్తూ..'పవన్ చాలా కూల్. తక్కువగా మాట్లాడతారు. ఆయనతో నటించడం సౌకర్యంగా ఉంటుంది. చిత్రబృందం నన్ను కుటుంబంలో ఒకరిగా చూసుకున్నారు. ఇక డబ్బింగ్ గురించి చెప్పాలంటే.. నాకు తెలుగు బాగా వచ్చు. కానీ, ఇందులో నా పాత్రకు సరిత అనే అమ్మాయి డబ్బింగ్ చెప్పారు. నేను డబ్బింగ్ చెప్పకపోతే సినిమాలో నా ప్రదర్శనకు పడిన మార్కులు పోతాయా? లేదు కదా..! నా పాత్రకు సరిత లాంటి అమ్మాయి వాయిస్ అయితే సరిపోతుంది' అని చెప్పుకొచ్చారు ఖుష్బూ.



కడుపుబ్బా నవ్వుకున్నా

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'కాలాకాండి'. అక్షత్ వర్మ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. బుధవారం ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. ముఖానికి మసి పూసుకుని పిలకలతో సైఫ్ గెటప్ చాలా ఫన్నీగా ఉంది. కాగా..ఈ ట్రైలర్ బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్‌కు కూడా తెగ నచ్చేసిందట. ఈ ట్రైలర్‌ను ఆమిర్ తన ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తూ..'చాలా కాలం తరువాత ఇలాంటి ఓ కామెడీ సినిమాను చూస్తున్నాను. 2011లో వచ్చిన 'ఢిల్లీ బెల్లీ' సినిమా స్క్రిప్ట్ విని చాలా నవ్వుకున్నా. ఆ తరువాత అంతగా నవ్వు తెప్పించిన సినిమా 'కాలాకాండి'. సైఫ్ నటన అదుర్తంగా ఉంది. ఈ ట్రైలర్‌ను ఎవరూ మిస్ అవ్వద్దు' అని ఆమిర్ ట్వీట్‌లో పేర్కొన్నారు. 'కాలాకాండి' అన్న పదాన్ని ఎక్కువగా మరాఠీ భాషలో వాడుతుంటారు. జీవితంలో గజిబిజి సంఘటనలు జరుగుతుంటే దాన్ని కాలాకాండి



అంటారు. బ్లాక్ కామెడీ థ్రిల్లర్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇందులో సైఫ్‌కి జోడీగా 'గుండెజారి గల్లంతయ్యిందే' ఫేం ఇషా తల్వార్, అమైరా దస్తూర్ నటిస్తున్నారు. సెప్టెంబర్ 8న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.


ఫ్యాన్స్ కాళ్లకు నమస్కరించిన సూర్య



అభిమాన నటుడు కన్పించగానే ఫ్యాన్స్ వారి కాళ్లకు నమస్కరిస్తుంటారు. ప్రముఖ నటుడు సూర్యకు కూడా ఇలాంటి సంఘటనే ఎదురైంది. సూర్య కథానాయకుడిగా నటించిన చిత్రం 'గ్యాంగ్'. కీర్తి సురేశ్ కథానాయిక. విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా చెన్నైలో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు. సూర్య స్టేజ్‌పైకి రాగానే అభిమానులు ఒక్కసారిగా స్టేజ్‌పైకి వెళ్లి సూర్య కాళ్లకు నమస్కరించారు. దాంతో కాస్త ఇబ్బంది పడిన సూర్య వెంటనే వారి కాళ్లకు నమస్కరించారు. ఈ దృశ్యాన్ని కొందరు అభిమానులు వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. సూర్య తన అభిమానుల కాళ్లకు నమస్కరించడం చూసి అక్కడి వారు షాకయ్యారు. గతంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులతో సమావేశమైనప్పుడు ఆయన స్టేజ్ మీదకు రాగానే అభిమానులు ఆయన కాళ్ల నమస్కరించేందుకు స్టేజ్‌పైకి దూసుకెళ్లారు. అప్పుడు రజనీ.. ఇలా పరాయి వ్యక్తి కాళ్లకు నమస్కరించకూడదని కేవలం దేవుడికి, తల్లిదండ్రులకు, పెద్దలకు మాత్రమే నమస్కరించాలని తెలిపారు.

'జై సింహా'కు ప్రత్యేక షోలు..

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన చిత్రం 'జై సింహా'. కె.ఎస్ రవికుమార్ దర్శకత్వం వహించారు. నయనతార, హరిప్రియ, నటాషా దోషి కథానాయికలు. సంక్రాంతి సందరర్భేగా శుక్రవారం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కాగా..ఈ సినిమాకు ప్రత్యేక ప్రదర్శనలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతినిచ్చింది. 'సంక్రాంతి సందర్భంగా విడుదల కాబోతున్న 'జై సింహా' సినిమాను జనవరి 12 నుంచి 16వ తేదీ వరకు 24×7 ప్రతేక ప్రదర్శనలకు అనుమతిస్తున్నాం. రేపటి నుంచి 16వ తేదీ వరకూ తెల్లవారుజామున 1 గంట నుంచి ఉదయం 10 గంటల వరకు ప్రత్యేక ప్రదర్శనలకు ఉత్తర్వులు జారీ చేశాం. జనాల రద్దీ, బ్లాక్ టికెట్ల అమ్మకాలు ఎక్కువవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నాం.' అని ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటించిన 'అజ్ఞాతవాసి' సినిమాకు కూడా ప్రత్యేక ప్రదర్శనలకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు అనుమతినిచ్చాయి. ఆ



తరువాత కొన్ని కారణాల వల్ల ఈ నిర్ణయాన్ని రద్దు చేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఏపీలో యథావిధిగా ప్రత్యేక ప్రదర్శనలు కొనసాగాయి.

23 ఏళ్ల తర్వాత రూపాయి నోటు



చెన్నై: ఇరవైమూడేళ్ల తర్వాత తమిళనాడులో కొత్తగా ఒక రూపాయి కరెన్సీ నోటు చలామణిలోకి వచ్చింది. గత ఏడాది నవంబరులో చేపట్టిన కరెన్సీ నోట్ల రద్దు తరువాత కొత్తగా రూ. 2 వేలు, రూ. 500, రూ. 200, రూ.50, రూ.10 కొత్త కరెన్సీనోట్లు చలామణిలోకి వచ్చాయి. ఈ నోట్లు అన్నీ కొత్త రూపాల్లో పలు రంగుల్లో ముద్రితమయ్యాయి. రూ.10 నోటు, దీనిపైబడి విలువ కలిగిన నోట్లను రిజర్వు బ్యాంకు అచ్చు వేస్తుంది. ఈ కరెన్సీపై రిజర్వుబ్యాంకు గవర్నర్ సంతకం ఉంటుంది. కానీ రూపాయి నోటును మాత్రం భారత ప్రభుత్వమే స్వయంగా విడుదల చేస్తుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వ ఆర్థికశాఖ కార్యదర్శి సంతకం ఉంటుంది. ఈ క్రమంలో కొత్తగా విడుదల చేసిన రూపాయి నోటుపై కేంద్ర ప్రభుత్వ ఆర్థికశాఖ కార్యదర్శి సంతకం ముద్రితమై ఉంటుంది. ఈ నోటు వెనుక భాగంలో కరెన్సీ ముద్రించిన సంవత్సరం ఉంటుంది. ఈ రూపాయి నోటు అచ్చు వేయడం 1994 లో నిలిపి వేశారు. తిరిగి 23 ఏళ్ల తరువాత మళ్లీ రూపాయి నోట్లు చలామణిలోకి వచ్చాయి.

ఓట్ల కోసం టీఎంసీ సాధు హిందుత్వ జపం

కొల్‌కత: అధికార యావలో పడిన తృణమూల్ కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందని కాంగ్రెస్, వామపక్షాలు ధ్వజమెత్తాయి. సాధు హిందుత్వ జపాన్ని ఆచరిస్తోంది అందుకేనని విమర్శించాయి. బిర్భూం జిల్లాలో బ్రాహ్మణ సమ్మేళనం పేరిట టీఎంసీ ఇటీవల ఒక కార్యక్రమం నిర్వహించడం వివాదాస్పదమైంది. రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో బీజేపీకి పెరిగిన ఓట్ల శాతం చూసి అధికార టీఎంసీలో అలజడి రేగినట్లుగా ఉందని అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు అబ్దుల్ మన్నన్ విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలనూ, మతాలనూ కలుపుకుపోతామంటూ సీనియరు టీఎంసీ నాయకుడు సౌగత్ రాయ్ చెప్పిన మాటలను ఈ సందర్భంగా మన్నన్ ఉదహరించారు. మత ప్రాతిపదికన రాజకీయాలు నడపాలన్న టీఎంసీ ధోరణి ప్రమాదకరమన్నారు. మత రాజకీయాలకు పాల్పడుతున్నందునే బీజేపీని తాము వ్యతిరేకిస్తున్న సంగతిని గుర్తు చేశారు.

లాల్ బహదూర్ శాస్త్రికి మోడీ, రాహుల్ నివాళి



న్యూఢిల్లీ : భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా గురువారం ఆయనకు ప్రధాని నరేంద్రమోడీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నివాళులర్పించారు. ఈ విషయాన్ని మోడీ ట్విటర్ ద్వారా తెలిపారు. భారతావని గర్వించదగ్గ గొప్ప నాయకుడు లాల్ బహదూర్ శాస్త్రి అనీ, ప్రధానిగా ఆయన సేవలు మరువలేనివన్నారు. తరతరాలు గుర్తుండిపోయే వ్యక్తి, ఆదర్శప్రాయుడని కొనియాడారు. ప్రజలను ఏకం చేసి పాలించిన గొప్ప నాయకుడు లాల్ బహదూర్ శాస్త్రి. ఆయన బాటలోనే తాము కూడా ప్రజల్లో ఐకమత్యాన్ని ఏర్పరచడమే మా ముందున్న కర్తవ్యం. జోహార్ శాస్త్రి' అని రాహుల్ గాంధీ ట్విటర్ వేదికగా తెలిపారు. లాల్ బహదూర్ శాస్త్రి 1904లో జన్మించారు. 1964 జూన్ నుంచి 1966 జనవరి వరకు భారత రెండో ప్రధానమంత్రిగా పని చేశారు. భారత్-పాకిస్థాన్ యుద్ధం (1965) సమయంలో ఆయన ప్రధానిగా ఉన్న సమయంలోనే జరిగింది. జై జవాన్- జై కిసాన్ నినాదం శాస్త్రిదే.

మరాఠాలపై మహాసర్కార్ సర్వే

ముంబై : రాష్ట్రంలోని 700 గ్రామాల్లో మరాఠాలపై నమూనా సర్వేను మహారాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. కోటా డిమాండు తీవ్రంగా ఉండడం, మరాఠా క్రాంతీ మోర్చా డెడ్‌లైన్ నేపథ్యంలో సర్వే నిర్వహిస్తోంది. మరాఠా వర్గీయుల్లో ఎంతమంది ఆర్థికంగా వెనుకబడినవారు ఉన్నారన్నది తెలుసుకునేందుకే ఈ నమూనా సర్వేను చేపట్టినట్టు మహారాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ (రిటైర్డ్) ఎంజీ గైక్వాడ్ తెలిపారు. మరాఠాలు ప్రభుత్వ రంగాలతో పాటు అన్ని విద్యాసంస్థల్లో రిజర్వేషన్ కోసం డిమాండు చేస్తుండడం తెలిసిందే. కాగా, మహారాష్ట్రలోని మరాఠా సంస్థలు గతనెలలో రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీచేశాయి.

ఫిబ్రవరి 10లోగా తమ డిమాండ్లను ముఖ్యంగా కోటా డిమాండును మంజూరు చేయకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించాయి. ఫిబ్రవరి 19న ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి అనంతరం ఆందోళనలు చేపట్టే యోచనలో ఉన్నాయి. కాగా, మహారాష్ట్ర సర్కార్ చేపట్టిన ఈ నమూనా సర్వే ప్రధానంగా ఆర్థిక, విద్య, ఉద్యోగ హోదా అను మూడు అంశాలపై దృష్టి సారిస్తుందని గైక్వాడ్ తెలిపారు. సర్వే పూర్తి అయిన తర్వాత దాని ఫలితాలను కమిషన్ అంచనా వేస్తుం దని అన్నారు. ఏయే గ్రామాల్లో సర్వే జరగాలన్నది కమిషన్‌కు చెందిన ప్రాదేశిక సభ్యులు నిర్ణయించి నట్టు వెల్లడించారు. రాష్ట్ర జనాభాలో 30శాతం ఉన్న మరాఠాల కోటాపోరు గతేడాది హింసాత్మకమవడం తెలిసిందే.

జ్వరం చికిత్సకు రూ.18లక్షలు..!

ఓ కార్పొరేటు ఆసుపత్రి నిర్వాకం

ఫరీదాబాద్: కార్పొరేట్ ఆసుపత్రుల అడ్డగోలు దోపిడీ మరోసారి బట్టబయలైంది. జ్వరంతో ఆసుపత్రిలో చేరిన ఓ గర్భవతికి 22 రోజుల పాటు చికిత్స చేసినందుకుగాను ఏకంగా రూ.18లక్షల బిల్లు వేసి చుక్కలు చూపించారు. హర్యానాలోని ఫరీదాబాద్ ఏషియన్ హాస్పిటల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో రోగి బంధువులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకెళ్తే.. కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్న గర్భిణిని...ఆమె బంధువులు ఫరీదాబాద్‌లోని ఏషియన్ ఆసుపత్రిలో చేర్పించారు. 'టైఫాయిడ్ వచ్చిందని చెప్పి వైద్యులు వెంటనే ఆమెను ఐసీయూలో పెట్టారు. అనంతరం ఆమెకు గర్భస్రావం అయిందని, వెంటనే ఆపరేషన్ చేసి పిండాన్ని బయటకు తీయాలని చెప్పారు. రూ.3లక్షలు చెల్లించమన్నారు. 22 రోజుల పాటు ఆమెకు చికిత్స అందించినప్పటికీ.. ప్రాణాలు మాత్రం దక్కలేదు. ఆపరేషన్‌కు ముందే తాము రూ.10-12లక్షల వరకు ఆసుపత్రికి చెల్లించాం. కానీ ఆసుపత్రి యాజమాన్యం చివరికి రూ.18లక్షలు చెల్లించాల్సిందిగా బిల్లు వేసిందని రోగి తరఫు బంధువు ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. హాస్పిటల్ యాజమాన్యం తీరుపై విచారణ చేపట్టాలని, 22 రోజులకు రూ.18లక్షల బిల్లు ఎలా వేస్తారంటూ బంధువులు ఆందోళన చేస్తున్నారు. ఈ విషయంపై



ఏషియన్ హాస్పిటల్ క్వాలిటీ, సేఫ్టీ ఛైర్మన్ డా.రమేశ్ చంద్ర స్పందించారు. బాధితురాలు 8-10రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఆమె 32వారాల గర్భిణి. టైఫాయిడ్ సోకిందని రిపోర్టుల్లో తేలింది. వెంటనే ఐసీయూలో చేర్చి చికిత్స ప్రారంభించాం. ఆమె కడుపులో బిడ్డ చనిపోయాడు. గర్భస్రావం కావడంతో ఆపరేషన్ చేశాం. కానీ ఆమె ప్రాణాలు దక్కలేదని డా.రమేశ్ చెప్పుకొచ్చారు. రెండు నెలల క్రితం గురుగ్రామ్‌లోని ప్రముఖ ఫోర్టిస్ హాస్పిటల్ కూడా ఇదే విధంగా డెంగీ జ్వరంతో చికిత్స కోసం చేరిన ఏడేళ్ల చిన్నారికి రూ.16లక్షలు బిల్లు వేసింది. అందులో వైద్యులు చికిత్సకు ఉపయోగించిన గ్లౌజులకు కూడా ఛార్జీలు వేసింది. డబ్బు కడితేనే చిన్నారి మృతదేహాన్ని అప్పగిస్తా మంటూ ఆ ఆసుపత్రి సిబ్బంది అమానవీయంగా ప్రవర్తించిన విషయం తెలిసిందే.

మమతతో చర్చలకు సిద్ధం : బిమల్ గౌరంగ్

న్యూఢిల్లీ : డార్జిలింగ్‌లో సంక్షోభం తొలగించడానికి, గోర్ఖాల గుర్తింపు కోసం పోరుకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీతో చర్చించేందుకు సిద్ధమేనని గోర్ఖా జనముక్తి మోర్చ నాయకుడు బిమల్ గౌరంగ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గత ఏడాది నుంచి ఆందోళనలు, హింసతో డార్జిలింగ్ సంక్షోభంతో కొట్టుకులాడుతుందన్నారు. తాను వేర్పాటు వాదినని మమతాబెనర్జీ ఆరోపించడాన్ని ఆయన ఖండించారు. భారత రాజ్యాంగం పరిధికి లోబడే తమ పార్టీ డిమాండ్లు చేస్తుందన్నారు. దేశ సమగ్రతపై తానకు విశ్వాసం ఉందని చెప్పారు. తమ పార్టీ కార్యకర్తలపై రాష్ట్రపోలీసులు తప్పుడు కేసులు బనాయించారని, దీనిపై విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలన్నారు.

అవి కట్టుకథలట : నీలేకని ఉవాచ

న్యూఢిల్లీ: ఆధార్ గోప్యత విషయమై సాగుతున్నదంతా కట్టుకథలేనని యూఐడీఏఐ మాజీ అధ్యక్షుడు నందన్ నీలేకని అన్నారు. ఆధార్‌ను మసక బార్చేందుకు ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఆధార్ గోప్యత డొల్లేనంటూ ట్రిబ్యూన్ మీడియా సంస్థ కథనం ప్రసారం చేయడంపై ఆయన పై విధంగా స్పందించారు. గురువారం ఇక్కడ జరిగిన ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ అవార్డు కార్యక్రమంలో పాల్గొన్నఆయన తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ ఆధార్ గురించి వెలువడే ఊహాగానాలన్నీ కట్టుకథలేనన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ కన్నుమూత

పాట్నా : దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బీజేపీ ఎమ్మెల్సీ సత్యేంద్ర కుశ్వాహా గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన వయస్సు 49 సంవత్సరాలు. బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న కుశ్వాహాను రెండేళ్ల క్రితం ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చేర్చారు. చికిత్సపొందుతూ ఆయన చనిపోయినట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుశ్వాహా మృతికి సీఎం, డిప్యూటీ సీఎం నితీష్‌కుమార్, సుశీల్ కుమార్ షిండే సంతాపం తెలిపారు.

ముల్లపెరియార్‌పై మూడు కమిటీలు : సుప్రీం

న్యూఢిల్లీ : ముల్లపెరియార్ డ్యామ్ వద్ద ఊహించని విధంగా ఏదైనా విపత్తు ఏర్పడితే దానిని అధిగమించడానికి మూడు వేర్వేరు కమిటీలు ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్రం, తమిళనాడు, కర్నాటక ప్రభుత్వాలను సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. కేరళలో గల డ్యామ్‌కు విపత్తు వచ్చినప్పుడు మాత్రమే ఆ సమస్యకు ఈ ప్రతిపాదిత కమిటీలు పరిష్కారం కనుగొనాలని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖాన్ విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది.

రూ.3500 కోట్ల ఆస్తులు సీజ్

న్యూఢిల్లీ : బినామీలకు చెక్‌పెట్టే క్రమంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు దూకుడుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా 900 బినామీ ఆస్తులను అటాచ్ చేశారు. ప్లాట్లు, దుకాణాలు, ఆభరణాలు, వాహనాలు ఇలా సుమారు రూ.3500 కోట్ల ఆస్తులను సీజ్ చేసినట్టు ఐటీశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 2016, నవంబరు 1న అమల్లోకొ వచ్చిన బినామీ నివారణ చట్టం ప్రకారం బినామీలపై ఉక్కుపాదం మోపేలా ఐటీశాఖ చర్యలను ముమ్మరం చేసింది. ఈ చట్టం ప్రకారం ఆస్తులు, స్థిరాస్తులను జప్తు చేసుకోనే అధికారంతో పాటు బినామీదారుడిపై చర్యలు తీసుకునే అధికారాన్ని ఐటీశాఖకు ఉంది. పట్టుబడిన అక్రమ లావాదేవీలు జరిపిన బినామీదారుడికి ఏడేళ్ల కఠిన కారాగారంతో పాటు ఆస్తి మార్కెట్ విలువను బట్టి దానిపై 25శాతం మేర జరిమానా విధించే అవకాశం ఉంటుంది. బినామీ ఆస్తులపై వేగవంతంగా చర్యలు తీసుకునేందుకు వీలుగా దేశవ్యాప్తంగా ఉన్న ఇన్వెస్టిగేషన్స్ డైరెక్టరేట్ల క్రింద పనిచేసేట్లుగా 24 బినామీ నివారణ యూనిట్ల(బీపీయూ)ను 2017, మేలో శాఖ ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు 900కుపైగా బినామీ కేసులు నమోదైనట్టు ప్రకటనలో పేర్కొంది. నల్లధనాన్ని అరికట్టేందుకుగాను 1988లో బినామీ చట్టాన్ని తీసుకొచ్చారు.

జడ్జి లోయ మృతిపై సుప్రీంకోర్టు విచారణ నేడు

న్యూఢిల్లీ : సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారించిన సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి బి.హెచ్.లోయ మృతికి సంబంధించి స్వతంత్ర దర్యాప్తు జరపాలని కోరుతూ దాఖలైన పిటీషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం విచారించనున్నది. 2014, డిసెంబరు 1న లోయ మరణంపై దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటీషన్‌ను అత్యవసరంగా విచారించాలని అభ్యర్థనను ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఎ.ఎం.ఖనవిల్కర్, డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం గురువారం పరిగణనలోకి తీసుకుంది. మహారాష్ట్రకు చెందిన జర్నలిస్టు బి.ఆర్.లోనే ఈ పిటీషన్‌ను దాఖలు చేశారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, వేర్వేరు పోలీసులు అధికారుల పేరులు ఉన్న సున్నితమైన సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారించిన జడ్జి లోయ అనుమానాస్పద మృతిపై నిష్పాక్షిక దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందని జర్నలిస్టు లోనే పిటీషన్‌లో కోరారు. కాగా సహోద్యోగి కుమార్తె వివాహానికి హాజరై వస్తుండగా 2014, డిసెంబరు 1న నాగపూర్‌లో లోయ గుండెపోటుతో మరణించారు. అయితే న్యాయమూర్తి మరణానికి సంబంధించి అనుమానాలున్నట్లు ఆమె సోదరిని ఉటంకిస్తూ మీడియాలో వార్తలు వచ్చిన తర్వాత గత నవంబరులో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

2005 నవంబరులో గుజరాత్‌లో సోహ్రాబుద్దీన్ షేక్, ఆయన భార్య కౌసర్ బి, వారి సహచరుడు తులసీదాస్ ప్రజాపతిల నకిలీ ఎన్‌కౌంటర్ ఆరోపణలకు సంబంధించి ఒక పోలీసు అధికారితో సహా 23 మంది నిందితులుగా ఉన్నారు. అటు తర్వాత ఈ కేసు సీబీఐకి బదిలీ కాగా, విచారణ ముంబైకి మారింది. ఇదిలాఉండగా, జడ్జి మృతిపై దర్యాప్తు కోరుతూ ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని బాంబే లాయర్స్ అసోసియేషన్ జనవరి 8న బాంబే హైకోర్టులో దాఖలు చేసింది.

తొమ్మిదిమంది శవమయ్యారు

లక్నో : సరదాగా బంధువు ఇంటికి భోజనానికి వెళ్లారు. తీరా భోజనం చేశాక వారంతా మృత్యువాతపడ్డారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. లక్నోలోని థాల్ ఖుర్ద్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన బంధువులను ఇంటికి భోజనానికి పిలిచాడు. తొమ్మిది మంది అతడి ఇంటికొచ్చారు. అందరూ సరదాగా కూర్చుని విందు ఆరగించారు. ఇంతలో ఏం జరిగిందో తెలీదు కానీ ఒక్కసారిగా వచ్చిన తొమ్మిది మంది అస్వస్థతకు గురై మృత్యువాతపడ్డారు. వారిలో ఒకరు గుండెపోటుతో మరణించారు. భోజనానికి పిలిచిన వ్యక్తి పోలీసులకు సమాచారం అందించకుండా వెంటనే అంత్యక్రియలకు సిద్ధమయ్యాడు. ఇంతలో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని తొమ్మిది మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. భోజనానికి పిలిచిన వ్యక్తే విషం పెట్టి చంపాడా లేకపోతే కలుషిత ఆహారం తిని మరణించారా? అన్న కోణంలో దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు, భోజనానికి ముందు అందరూ ఇంటిలో తయారు చేసుకున్న మద్యం సేవించడం వల్లే మరణించినట్టు వార్తలు వస్తున్నాయి. మద్యంలో స్పిరిట్ ఎక్కువగా కలుపుకోవడం వల్ల ప్రాణాపాయం ఏర్పడినట్టు కొంతమంది చెబుతున్నారు.

నేడు జియాబాయి జయంతికి కేజ్రీవాల్

ముంబై : ఛత్రపతి శివాజీ తల్లి జియాబాయి జయంతి సందర్భంగా శుక్రవారం జరిగే ర్యాలీలో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ పాల్గొంటారు. బుల్దానా జిల్లా సింద్‌ఖేడ్ రాజాలో ర్యాలీ జరుగుతుంది. ప్రతిఏడాది ఈ ర్యాలీ జరుగుతుంది. రాజకీయంగా పలుకుబడి గల మరాఠీలు లక్షలాదిమంది హాజరవుతారు. రాజమాతకు ఘన నివాళి అర్పిస్తారు. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు ముందు అనుమతివ్వలేదు. అయితే, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్న వీస్‌తో ఆప్ నాయకులు సంప్రదింపులు జరిపిన తర్వాత అనుమతి లభించింది. అనుమతి లభించడంతో రాజమాత జయంతికి తాను వస్తున్నానని కేజ్రీవాల్ ట్వీట్ చేశారు.

దేశంలో అసహనం పెరుగుతోంది..

డి.లిట్ పట్టా అందుకున్న మమతా బెనర్జీ వ్యాఖ్య

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం డాక్టరేట్ ఆఫ్ లిటరేచర్(డి.లిట్) డిగ్రీని అందుకున్నారు. దక్షిణ కోల్‌కతా లోని నజ్రుల్ మంచా ఆడిటోరియంలో జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో కలకత్తా విశ్వవిద్యా లయం నుంచి ఈ పట్టా అందుకున్నారు. విశ్వ విద్యాలయం పూర్వ విద్యార్థి అయిన మమతా బెనర్జీ ఆమె చేసిన సామాజిక సేవకుగాను డి.లిట్ అందుకున్నారు. స్నాతకోత్సవంలో బెనర్జీ మాట్లా డుతూ 'దేశంలో అసహనం పెరుగుతోంది. చరిత్రను వక్రీకరించ కూడదు. భారతీయ మూలం వైవిధ్యమైనది. దానిని మనం గౌరవించాలి' అని పేర్కొన్నారు.



అయితే విశ్వవిద్యాలయం మమతకు డి.లిట్ ప్రదానం చేయాలన్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ రంజుగోపాల్ ముఖర్జీ ఈ వారంలో కలకత్తా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయంలో విశ్వవిద్యాలయానిది ఏక పక్ష నిర్ణయమని పిటిషన్‌లో తెలిపారు. అధికారంలో ఉన్న ఏ ముఖ్యమంత్రి అవార్డు అందుకోలేదని కూడా ముఖర్జీ పేర్కొ న్నారు. 'ఆమె అనర్హతకు సంబంధించి అనేక కోణాల్లో యూనివర్సిటీ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మేము పిల్ దాఖలు చేశాం' అని ఆయన తరఫు న్యాయవాది షమీమ్ అహ్మద్ తెలిపారు. 'మమతా బెనర్జీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వర్సిటీ సెనేట్ సభ్యుల నియామకం జరుగుతుంది. అదే సభ్యులు ముఖ్య మంత్రికి డి.లిట్ ప్రదానం చేయాలని నిర్ణయిం చారు' అని అహ్మద్ తెలిపారు. అయితే కోర్టులో బుధవారం విచారణ సమయంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం వాదిస్తూ 'రాజకీయ ప్రేరేపిత చర్య' అని, ఇందులో ఎటువంటి ప్రజాప్రయోజనం లేదని తెలిపింది.

జాతీయతాభావంపై మీ వైఖరేంటి?

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లను ప్రశ్నించిన శివసేన

ముంబై : జాతీయతా భావంపై ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ భజనపరులు స్పష్టమైన వైఖరి తెలపాలని శివసేన కోరింది. సినిమా హాళ్లల్లో జాతీయగీతం ప్రదర్శన ఒక ఆప్షనల్ అని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో బీజేపీ యూటర్న్ తీసుకోవడంపై శివసేన విమర్శిం చింది. గురువారం అధికార పత్రిక సామ్నాలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకం, విప్లవాత్మక మని పేర్కొంది. కోర్టు తీర్పు వెలువడిన తర్వాత సినిమాహాళ్లలో జాతీయ గీతం ప్రదర్శన అంత ముఖ్యమేమి కాదన్న బీజేపీ ప్రభుత్వం, ఆర్‌ఎస్ ఎస్‌లు దానిపై స్పష్టమైన వైఖరి తెలపాలని డిమాండు చేసింది. వందేమాతరం పాడితేనే దేశభక్తులు, పాడక పోతే దేశద్రోహులేనన్న పంథాలో పాలిస్తున్న మోడీకి కోర్టు తీర్పు ఝలక్ ఇచ్చిందని పేర్కొంది. జాతీయతా భావంపై రోజుకో అర్థం మార్చివేస్తున్నారని విమర్శించింది. ఇటీవల గోవులను సంరక్షించు వాళ్లు దేశభక్తులు, గోమాంసం తినేవారు దేశద్రోహులన్నారు.. అయితే బుధవారం బీజేపీ పాలక గోవాలో ముఖ్యమంత్రి తమ రాష్ట్రంలో గోమాంసాన్ని నిషేధించ లేదన్నారని గుర్తుచేసింది.

ఆ హుందా రోజులు పోయాయి

బీజేపీపై యశ్వంత సిన్హా విసుర్లు



న్యూఢిల్లీ: అధికార బీజేపీపై ఆపార్టీ సీనియరు నాయకుడు యశ్వంత సిన్హా మరో మారు విసుర్లు గుప్పిం చారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి, అగ్రనాయకుడు ఎల్కే అద్వానీల నాయకత్వంలో అనుభవించిన హుందాతనం ప్రస్తుతం పార్టీలో కనిపించడం లేదని సిన్హా విమర్శించారు. పార్టీలో సీనియర్లకూ సముచిత గౌరవం దక్కడం లేదన్నారు. అటల్, అద్వానీల హయాంలో దేశంలోని ఏమారు మూల ప్రాంతం నుంచి ఢిల్లీ వచ్చిన సామాన్య కార్యకర్తయినా ఎలాంటి ముందస్తు అపాయింట్‌మెంట్ లేకుండానే అగ్రనాయకులను కలుసుకోగలిగేవారు, బాధలు చెప్పుకోగలిగేవారు, పరిష్కారం పొందగలిగేవారు. అయితే, ఇపుడు తనలాంటి సీనియర్లకు కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి తీరిక లేనంతటి పనుల్లో ప్రధాని మోడీ మునిగి తేలుతున్నారని విమర్శించారు. మోడీని కలుసుకోవాలని 13నెలల క్రితం అపాయింట్ మెంట్ కోసం అధ్యక్షుడు అమిత్‌షాకు లేఖ ఇచ్చినా ఇంత వరకు ప్రత్యుందన కనిపించ లేదన్నారు. అందుకే తన మనోగతాన్ని మీడియా ద్వారా అటు ప్రజలకు,కార్యకర్తలకు ఇటు పార్టీ నాయకత్వం దృష్టికి తెచ్చే ప్రయత్నం చేస్తున్నానన్నారు. పార్టీకి, నాయకులకు తనేమీ వ్యతిరేకం కాదన్నారు. పార్టీ అమలు జరిపే విధానాల్లోని లోపాలను మాత్రమే తను ప్రస్తావిస్తున్నా ననే సంగతిని నాయకత్వం గుర్తించాలన్నారు. పార్టీ మేలు కోరే తను మాట్లాడుతున్నానని ఆయన చెప్పారు.

సూర్యనమస్కారాలకు ఎంపీ ప్రభుత్వం ఆదేశం

భోపాల్ : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జనవరి 12న సూర్యనమస్కారాలు, ప్రాణాయామం ఆచరించాలని అన్ని విద్యాసంస్థలను మధ్యప్రదేశ్ ప్రభుత్వం గురువారం ఆదేశించింది. అయితే, సూర్యనమస్కారాల్లో భాగస్వాములు కావడం తప్పనిసరి మాత్రం కాదని చెప్పి జాగ్రత పడింది. ఉదయం 9 గంటల నుంచి విద్యాసంస్థల్లో సూర్యనమస్కారాలు లేదా ప్రాణాయామం వేయాలని ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది.

అఫ్జల్ కుమారుడి అద్భుత విజయం

శ్రీనగర్ : పార్లమెంటుపై దాడి కేసులో శిక్ష అనుభవిస్తున్న అఫ్జల్‌గురు కుమారుడు గాలిబ్ గురు ఇంటర్‌మీడియట్‌లో డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యాడు. 2001లో పార్లమెంటుపై దాడి కేసులో 2013లో అఫ్జల్‌గురుకు శిక్ష పడింది. 88శాతం మార్కులతో గాలిబ్ గురు పాస్ అయ్యాడు. నవంబరులో జరిగిన పరీక్షలో 55,163 మంది విద్యార్థులకుగాను 33,893 మంది ఉత్తీర్ణులైనట్టు జమ్మూకాశ్మీరు బోర్డు ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు తెలిపారు.

కేంద్రం ఫోన్ ట్యాంపింగ్ : కన్నడ మంత్రి

బెంగళూరు : త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల ఫోన్లను బీజేపీ ప్రభుత్వం ట్యాప్ చేస్తోందని కర్ణాటక రాష్ట్ర హోంశాఖ మంత్రి రామలింగారెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కొంతమంది ఫోన్లను ట్యాప్ చేస్తున్నారని తాను చాలాకాలం నుంచే చెబుతున్నానని, ఈ ట్యాంపింగ్‌పై చాలా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కాగా ఎవరెవరి ఫోన్లు ట్యాపింగ్ అవుతున్నాయో మాత్రం ఆయన వెల్లడించలేదు.

'తమిళనాడు' గోల్డెన్ జూబ్లీ వేడుకలు

చెన్నై : 'తమిళనాడు' గా రాష్ట్రం పేరు మారి ఈ నెల 14న 50వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా రాష్ట్రంలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కే పళనిస్వామి గురువారం శాసన సభలో తెలిపారు. అప్పట్లో 'మద్రాస్ రాష్ట్రం'గా పిలిచిన రాష్ట్రం 1969 జనవరి 14న తమిళనాడుగా పేరు మారిందని ఆయన గుర్తుచేశారు.తమిళ భాష, తమిళ ప్రజల గొప్పతనాన్ని గుర్తిస్తూ వేడుకలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చిత్రకళ, క్రీడలు, వ్యాసరచన, కవిత్వం వంటి పోటీలు నిర్వహిస్తామన్నారు.

చిన్న వ్యాపారులను దెబ్బతీసే చర్య

- సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో వంద శాతం ఎఫ్‌డీఐలను వ్యతిరేకించిన సీఏఐటీ
- బీజేపీ ఎన్నికల హామీ విస్మరించింది
- నిరుద్యోగులకు అవరోధమే..

ముంబై : ఆటోమేటిక్ మార్గం ద్వారా సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)లను అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అఖిల భారత వాణిజ్య సమాఖ్య(సీఏఐటీ) బుధవారం వ్యతిరేకించింది. ఈ చర్య రిటైల్ వాణిజ్యంలో బహుళ జాతి కంపెనీలు(ఎంఎన్‌సీ)ల ప్రవేశాన్ని సులభతరం చేసేలా ఉందని పేర్కొంది. ప్రస్తుతం, ఆటోమేటిక్ మార్గం కింద 49 శాతం ఎఫ్‌డీఐలకు మాత్రమే అనుమతి ఉంది. కానీ పరిమితికి మించిన ఏ పెట్టుబడికైనా ప్రభుత్వ ఆమోదం అవసరం. ఎఫ్‌డీఐ క్లియరెన్స్‌ను మరింత వేగవంతం చేయడమే లక్ష్యంగా ఆటోమేటిక్ మార్గం ద్వారా అనుమతించింది. దీన్ని అవకాశంగా తీసుకున్ని మరిన్ని విదేశీ సంస్థలు భారత మార్కెట్‌లోకి ప్రవేశించే అవకాశం ఉంది. 'బీజేపీ ఎన్నికల హామీని ఉల్లంఘించింది. ఈ చర్య చిన్న వ్యాపారులకు సంబంధించి ఆందోళన కలిగించే విషయం. దేశంలోని ప్రస్తుత రిటైల్ వాణిజ్య అభివృద్ధి, ఆధునీకరణ, సంక్షేమాన్ని దెబ్బతీయడమే' అని సీఏఐటీ ఇక్కడ ఒక ప్రకటనలో పేర్కొంది. 'ప్రభుత్వం తీసుకున్న క్రూరమైన చర్య. పెద్ద సంఖ్యలోని నిరుద్యోగులకు అవరోధం కలిగించేది' వాణిజ్య సమాఖ్య తెలిపింది. ఇదిలాఉండగా వంద శాతం ఎఫ్‌డీఐలను అనుమతిస్తూ తీసుకున్న నిర్ణయం విదేశీ సంస్థలకు స్నేహపూర్వక పెట్టుబడుల వాతావరణాన్ని సృష్టించేందుకేనని ప్రభుత్వం మరోవైపు చెబుతోంది. ఇది ఆర్థికాభివృద్ధికి ఊతం ఇస్తుందని, ఉద్యోగాల సృష్టి జరుగుతుందని చెప్పుకొస్తోంది.

సిక్కుల ఊచకోతపై కొత్త సిట్

న్యూఢిల్లీ : సిక్కుల ఊచకోతకు సంబంధించిన 186 కేసులను తిరిగి దర్యాప్తు చేసేందుకు త్రిసభ్య ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను సుప్రీంకోర్టు గురువారం ఏర్పాటు చేసింది. ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్ఎన్ ధింగ్రా నేతృత్వంలో ఏర్పడిన ఈ సిట్‌లో ఐపీఎస్ అధికారి అభిషేక్ దులార్, రిటైర్డ్ ఐజీ హోదా అధికారి రాజ్‌దీప్ సింగ్ ఉన్నారు. రెండు నెలల్లో నివేదిక అందించాలని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రాతో కూడిన ధర్మాసనం సిట్‌ను ఆదేశించింది.తదుపరి విచారణను కోర్టు మార్చి 19కు వాయిదా వేసింది. 1984 అక్టోబర్ 31న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం సిక్కులపై జరిగిన దాడుల్లో ఒక్క ఢిల్లీలోనే 2,733 మంది ప్రాణాలు కోల్పోయారు.



రాష్ట్రంలో 23న కార్మికుల సమ్మె

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామారావు

విశాలాంధ్రబ్యూరో-నెల్లూరు: ఈ నెల 23వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 23 స్కీము వర్కర్లు సమ్మెలో పాల్గొంటున్నట్లు ఏఐటీ యూసీ రాష్ట్ర అధ్యక్షులు చలసాని వెంకట రామారావు తెలిపారు. నగరంలోని రామకోటయ్యభవన్‌లో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ నవంబరు 9, 10, 11 తేదీల్లో ఢిల్లీలో 10 కేంద్ర కార్మిక సంఘాల సమావేశంలో ఇచ్చిన పిలుపుమేరకు పార్లమెంటు ఎదుట మహా కూడలి నిర్వహించామన్నారు. చివరి రోజు వివిధ స్కీములకు చెందిన మహిళా కార్మికులు పాల్గొన్నారన్నారు. జనవరి 17వ తేదీన దేశవ్యాప్త కార్మికుల సమ్మెకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో మన రాష్ట్రంలో సంక్రాంతి సెలవుల నేపథ్యంలో సమ్మెను రాష్ట్రంలో 23వ తేదీన నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో నాలుగు లక్షల మంది స్కీము కార్మికులు పాల్గొంటారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ నెల 27వ తేదీన విద్యుత్ కార్మికులు సమ్మెలోకి దిగుతున్నట్టు వివరించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కొరవడిందని, కనీస వేతన చట్టం అమలు చేయడంలేదని, కార్మికులుగా కూడా గుర్తించలేని దుస్థితి నెలకొందన్నారు. కనీసం సలహా సంఘాన్ని కూడా వేయకపోవడం దారుణమన్నారు. కార్పొరేట్ సంస్థలకు తొత్తులుగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని మండి పడ్డారు. రాష్ట్రంలో ఆరోగ్యమిత్రలను తొలగించడంతో వారందరూ హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుంటే ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయడం దారుణమన్నారు. జీతాలు పెంచమని అడిగితే కోర్టులో ఉందని సాకులు చూపుతున్నారన్నారు. వేతన మండలి కార్మికులకు కనీస వేతనం 18 వేల రూపాయలు ఇవ్వమని చెప్పినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో రూ.3 వేల నుంచి రూ.5వేలకు మించి జీతాలు ఇవ్వడం లేదన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలకు కార్మికులు సంఘటితంగా తగిన బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, దామా అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం ఆ రెండు కులాలదేనా



విశాలాంధ్రబ్యూరో-శ్రీకాకుళం : రాష్ట్రంలో గత ఏడు దశాబ్దాలుగా వెనుకబడిన, బలహీనవర్గాలకు, దళితులకు రాజ్యాధికారం దక్కడం లేదని, ఆ రెండు కులాలు మాత్రమే శాసిస్తున్నాయని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఎద్దేవా చేశారు. శ్రీకాకుళంలోని స్థానిక హోటల్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టుపెట్టారని, గత ఏడాదికాలంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ అపాయిమెంట్ దొరకకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రతిపక్షనేత జగన్ ఫిట్‌నెస్ కోసమే పాదయాత్ర చేస్తున్నారన్నారు. వారానికోమారు కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇప్పటికే రూ.లక్ష కోట్లు బడ్జెట్ దాటి హామీలు గుప్పించారన్నారు. సీఎం రేసు నుంచి జగన్, చంద్రబాబు ఇద్దరూ తప్పుకోవాలని చింతామోహన్ డిమాండ్ చేశారు. మనదేశంలోని 29 రాష్ట్రాల్లో దళితులు, వెనుకబడినవర్గాల వారు సీఎంలు కాగలిగారని, 50 శాతం వెనుకబడిన తరగతుల ప్రజలు జీవిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఒక్కరు కూడా ముఖ్యమంత్రి కాలేకపోయారన్నారు. తెన్నేటి విశ్వనాథం, గౌతు లచ్చన్న లాంటి వారు పుట్టిన ఉత్తరాంధ్ర నుంచి, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి ఒక్కరైనా ముఖ్యమంత్రి కావాల్సి ఉన్నప్పటికీ అవకాశం ఇవ్వలేదన్నారు. పోలవరం పేరుతో దోచుకుంటున్నారని విమర్శించారు. సమావేశంలో రాయలసీమ దళిత నాయకుడు ప్రభాకర్, శ్రీకాకుళం జిల్లా నుంచి రాంబాబు పాల్గొన్నారు.

జన్మభూమి పేరిట దగా చేస్తున్నారు



విశాలాంధ్ర-శ్రీకాకుళం (పాతబస్టాండ్): జన్మభూమి కార్యక్రమం పేరుతో సీఎం చంద్రబాబు ప్రజలను వంచన చేస్తున్నారని శ్రీకాకుళం వైసీపీ నాయకులు తమ్మినేని సీతారాం అన్నారు. శ్రీకాకుళంలోని స్థానిక వైసీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో తమ్మినేని టీడీపీ గత పది రోజులుగా జరుగుతున్న జన్మభూమి కార్యక్రమంపై ఘాటుగా స్పందించారు. జన్మభూమిలో సమస్యలపై నిలదీసిన వారిపై తెలుగుదేశం కార్యకర్తలతో దౌర్జన్యం చేయిస్తున్నారని ఆరోపించారు. రైతులకు రుణాలు మాఫీ కాక, వడ్డీలు కట్టుకోలేక, కొత్త రుణాలు ఇవ్వక ఆత్మహత్యలు చేసుకుంటుంటే చంద్రబాబు మాత్రం రుణ మాఫీ అయిపోయిందని బాకాలు ఊదుతున్నారని అన్నారు. జిల్లాలో కిడ్నీ వ్యాధి ప్రధాన సమస్యగా ఉందని, ఈ సమస్య ఇప్పటి వరకూ తీరలేదన్నారు. జనాలను పరిగెత్తిస్తానన్న చంద్రబాబు, జనాలు నిలదీస్తున్నారనే భయంతోనే హెలికాప్టర్‌పై వచ్చి ఆకాశమార్గంలో వెళ్లిపోతున్నారని దుయ్యబట్టారు. అగ్రిగోల్డ్‌లో లోకేష్‌కి, ఎంపీ మురళీమోహన్‌కి సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. వంశధార నిర్వాసితులు పండుగ పోయే వరకూ కూల్చవద్దని, కాళ్లావేళ్లా పడినా నిర్దాక్షిణ్యంగా ఇళ్లను కూలగొట్టారని ఆరోపించారు. తెలుగుదేశం నాయకులకు జిల్లాలో జరుగుతున్న అన్ని కుంభకోణాల్లో హస్తముందని ఆరోపించారు. జన్మభూమి మీటింగుల్లో ఒక ఎంపీని గాని, ఎమ్మెల్యేని గాని మాట్లాడనివ్వరని దుయ్యబట్టారు. అధికారంలోకి రాగానే ఆమదాలవలస షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామన్నారు కానీ ఇప్పటివరకు ఆ ఊసే లేదన్నారు. జన్మభూమి మొత్తం ముగ్గులపోటీలతో, 7కె రన్, 10 కె రన్‌లతో, సీమంతాలతో గడిచిపోయిందని అన్నారు. ఒక్క సామాన్యుడికి కూడా న్యాయం జరిగిన దాఖలాలు లేవన్నారు. ప్రజలే రానున్న ఎన్నికల్లో తప్పకుండా చంద్రబాబు తగిన బుద్ధి చెబుతారని తమ్మినేని అన్నారు.

గ్రామీణుల స్థితిగతులపై అమెరికా ప్రొఫెసర్ల అధ్యయనం



విశాలాంధ్ర-దేవనకొండ : రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన స్థితిగతులపై గురువారం అమెరికా ప్రొఫెసర్ల బృందం అధ్యయనం చేపట్టింది. అమెరికాకు చెందిన లాసిఫిలింగ్‌మే, నిక్ రైసెల్, క్రిష్టిన్‌టైనల్, మౌట్‌అగ్‌న్‌జారిలు కర్నూలు జిల్లా దేవనకొండ, కుకటికొండ గ్రామాల్లో పర్యటించారు. ప్రజల జీవన విధానాలు, ఆహార అలవాట్లను తెలుసుకున్నారు. సజ్జ, కొర్ర, వరి, వేరుసెనగ పంటల సాగు వివరాలను సేకరించారు. వాటర్‌షెడ్ ద్వారా కలిగే ప్రయోజనాలు, ఉపాధి వివరాలను నేరుగా తెలుసుకున్నారు. పర్యటనలో నల్లచెలిమల వాటర్‌షెడ్ ప్రాజెక్టు అధికారి సిమ, మధుసూదన్, ఇక్రిశాట్ సైంటిస్టు ఆదినారాయణ పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రధాని సోదరుడు దామోదర్ ప్రహ్లాద్ మోడీ



విశాలాంధ్ర - తిరుచానూరు: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని గురువారం ప్రధాని నరేంద్రమోడీ సోదరుడు దామోదర్ ప్రహ్లాద్ మోడీ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు గావించారు. అనంతరం అమ్మవారి ఆశీర్వాద మండపంలో వేదపండితులతో ఆశీర్వాదం నిర్వహించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ మాధవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఈ-పాస్' ట్యాంపరింగ్ కలకలం

- పోలీసుల అదుపులో 120 మంది నెల్లూరు జిల్లా రేషన్ డీలర్లు
- రహస్యంగా ముమ్మర విచారణ
- ప్రతి నెలా దారిమళ్ళిన 500 టన్నుల బియ్యం
- అధికారుల లాగిన్లలోకెళ్లి మోసం



విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో: సాంకేతిక పరిజ్ఞానం కొంత పుంతలు తొక్కుతోంది. అక్రమా ర్కులు, హ్యాకర్లు సైతం కొత్త మార్గాల్లో అవినీతి పాల్పడుతూనే ఉన్నారు. నెల్లూరు జిల్లాలో తాజాగా ఈ పాస్ యంత్రాల ట్యాంపరింగ్ ప్రభుత్వ పెద్దలనే ఆందోళనను గురిచేస్తోంది. ప్రజాపంపిణీ వ్యవస్థలో డీలర్ల అక్రమాలను అడ్డుకునేందుకు ప్రభుత్వాలు ఎన్ని పద్ధతులు అనుసరించినా ప్రయోజనం లేకపో వడంతో కొత్తకొత్త ప్రయోగాలు చేస్తూ వచ్చాయి. మ్యాన్యువల్ పద్ధతిలో నడిచిన సమయంలో కొన్ని రోజులు సరుకులు పంపిణీ చేసిన డీలర్లు మిగిలినవి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ కార్డుదారులకు సరుకులు లేవని చెప్పి పంపించేవారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఈ పాస్ యంత్రాలను ప్రవేశపెట్టింది. ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ వాటిని కూడా ట్యాంపరింగ్ చేస్తూ ప్రతి నెలా పేదలకు దక్కాల్సిన నిత్యావసర సబ్సిడీ సరుకులను నెల్లూరు జిల్లాలో కొందరు డీలర్లు బయట మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ-పాస్ యంత్రాల్లో ట్యాం పరింగ్‌కు పాల్పడుతూ టన్నుల కొద్దీ రేషన్ బియ్యం స్వాహా చేసిన జిల్లాలోని నెల్లూరు, గూడూరు, కోవూరు తదితర ప్రాంతాల్లోని 120 మంది చౌకదుకాణాల డీలర్లను అదుపులోకి తీసుకున్న క్రైమ్ పోలీసులు రహస్యంగా విచారిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు దృష్టికి కొన్ని ఫిర్యాదులు రావడంతో నిఘా వేసిన ఆయన ఈ పాస్ యంత్రాలను ట్యాంపరింగ్ చేస్తున్నట్లు గుర్తించి విచారణ జరపాలని ఎస్పీ రామకృష్ణకు సూచించారు. దీంతో ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేస్తున్నారు. డీలర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు కుమ్మక్కై ప్రజా పంపిణీ వ్యవస్థకు చిల్లులు పెట్టి ప్రతి నెల లక్షల రూపాయాలు స్వాహా చేశారు. జాయింట్ కలెక్టర్, డీఎస్‌వో లాగిన్లను అక్రమంగా వినియోగిస్తూ అక్రమాలకు బాటలు వేశారు. ప్రతి నెలా ఈ పాస్ యంత్రాల్లో నమోదు చేసిన తర్వాత లబ్ధిదారులకు డీలర్లు సరుకులు ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో ఈ పాస్ యంత్రాలు సక్రమంగా పనిచేయడం లేదని కొన్నిచోట్ల, సరుకులు తక్కువ వచ్చాయంటూ మరికొందరు డీలర్లు చెబుతూ లబ్ధిదారులకు ఇవ్వడం లేదు. యంత్రాలు సక్రమంగా పనిచేయడం లేదంటూ సరుకు తిరిగి పంపేస్తున్నారు. వాస్తవంగా సరుకు మిగిలితే వచ్చే నెలలోకి చూపించాలి. వాటిని అధికారులు నమోదు చేసి తర్వాత నెలలో వచ్చే సరుకులను తగ్గించి పంపిస్తారు. ఇక్కడ మాస్టర్ ప్లాన్ వేసిన రేషన్ షాపు డీలర్లు కంప్యూటర్ ఆపరేటర్లతో కుమ్మక్కై కథ నడిపారు. సివిల్ సప్లయిస్ కార్యాలయంలోని కొందరు కంప్యూటర్లలతో చేతులు కలిపి డీఎస్‌వో, జేసీ లాగిన్ ఉపయోగించి సరకులు ఇచ్చినట్టు నమోదు చేసి చూపి పంపుతున్నారు. రేషన్ బియ్యాన్ని అధిక ధరలకు బయట మార్కెట్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలోని 8.63 లక్షల రేషన్ కార్డులకు సంబంధించి 1,863 చౌకదుకాణాలు ఉన్నాయి. ప్రతి నెల 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. వీటిలో ప్రతి నెల 500 టన్నుల బియ్యం పక్కదారి పడుతున్నట్టు తెలుస్తోంది. కిలో బియ్యం ధర రూ. 33.25 పైసల చొప్పున టన్ను బియ్యం రూ 33,250. ఇలా 500 టన్నుల బియ్యం విలువ బహిరంగ మార్కెట్‌లో కోటి 50 లక్షల రూపాయల వరకు ఉంటుందని అంచనా. జిల్లాలో కొందరు డీలర్లు ప్రతి నెలా కోటి రూపాయాలకు పైగానే అక్రమాలకు పాల్పడుతున్నారు. స్వాహా చేసిన బియ్యం సొమ్ములో కింది స్థాయి సిబ్బంది నుంచి వివిధ దశల్లో వాటాలు పంచుతున్నారనే విమర్శలు ఉన్నాయి. చౌకదుకాణంలో 70 శాతం ప్రజా పంపిణీ జరిగితే దానిని 80 శాతం జరిగినట్లు ట్యాంపరింగ్ చేస్తున్నట్టు సమాచారం. ట్యాంపరింగ్ చేసినందుకు కంప్యూటర్ ఆపరేటర్‌కు టన్నుకు రూ.3 వేల నుంచి రూ.4 వేలు చొప్పున చెల్లిస్తున్నట్లు సమాచారం. జేసీ, డీఎస్‌వో లాగిన్లను వారి తెలియకుండా వినియోగించినట్లు సమాచారం. ఈ మోసం జిల్లా యంత్రాంగం దృష్టికి రావడంతో క్రైం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కంప్యూటర్ ఆపరేటర్లను అదుపులోకి తీసుకుని విచారించారు. కంప్యూటర్ ఆపరేటర్లు ఇచ్చిన సమాచారంతో కొందరు డీలర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈపాస్ టాంపరింగ్ అక్రమాలపై ఒకటో నగర పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారు. కేసు విచారణ బాధ్యతను సీసీఎస్ డీఎస్పీ ఎం. బాలసుందరరావుకు ఎస్పీ అప్పగించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ షేక్ బాజీజాన్‌సైదా సమాచారం రాబడుతున్నారు. గతంలో మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై రూ.400 కోట్ల బియ్యాన్ని మింగేసిన కుంభకోణాన్ని ఏసీబీ అధికారులు బయటపెట్టారు. అయినప్పటికీ ఆ శాఖలో ఎటువంటి మార్పు రాకపోవడం గమనార్హం.



మావో కోరుకొండ దళ సభ్యుడి అరెస్ట్

విశాలాంధ్ర-చింతపల్లి: మావోయిస్టు పార్టీ కోరుకొండ దళసభ్యుడు పాంగి లింగారావును గురువారం విశాఖ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను చింతపల్లి డీఎస్పీ అనీల్‌పులిపాటి మీడియాకు వెల్లడించారు. బలపం పంచాయతీ వీరవరం గ్రామానికి చెందిన పాంగిలింగారావు మావోయిస్టుపార్టీలో మిలీషియా సభ్యులుగా 2013 నుంచి మావోయిస్టు కోరుకొండ దళంలో చురుకైన పాత్ర నిర్వహించారు. గత ఏడాది కోటగున్నల సమీపంలో మందుపాతర పేల్చి పోలీసు హోంగార్డు మృతి కేసుతోపాటు ఎస్సార్‌పైపులైన్ ధ్వంసం, బలపం పంచాయతీ సర్పంచ్ సీందేరికార్ల హత్య, దిగువ వలసపల్లి, ఎగజనబ ప్రాంతాల్లో కరువుదాడుల్లో పాల్గొన్నట్టు వివరించారు. తాజాగా అన్నవరంలో వ్యాపారి లోవశ్రీను హత్యలోనూ ఇతని ప్రమేయం ఉందన్నారు. ఇతనిపై తొమ్మిది కేసులున్నాయన్నారు. లక్ష రూపాయల రివార్డు కూడా ఉందన్నారు. కోరుకొండలో మావో నేత శరత్ హత్య అనంతరం మావో పార్టీ ఇతడ్ని దూరంగా పెట్టిందన్నారు. కొద్దికాలం తర్వాత మళ్లీ మావో కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. అన్నవరం ఎస్సై లక్ష్మీనారాయణ వాహన తనిఖీ చేస్తుండగా కోటగున్నల సమీపంలో అదుపులోకి తీసుకున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సీఐ చంద్రశేఖర్‌రావు, అన్నవరం ఎస్సై లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మహారాష్ట్ర గవర్నర్‌ను కలిసిన ఏయూ వీసీ

విశాలాంధ్ర -విశాఖపట్నం (ఏయూ): ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వర రావు శుక్రవారం ముంబయిలో మహారాష్ట్ర గవర్నర్ సి.విద్యాసాగర్‌రావును కలిశారు. అక్కడ ఏర్పాటు చేయనున్న ఏయూ డిఫెన్స్ సంయుక్త విద్య, పరిశోధక కార్యక్రమాలను గవర్నర్‌కు వివరించారు. రక్షణరంగ ఉద్యోగులకు ఉన్నత విద్య, నైపుణ్యాల పెంపు కోసం ప్రత్యేక కోర్సుల వివరాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ముంబాయి వర్సిటీ వీసీ దేవానంత్ షిండేతో సమావేశమయ్యారు. గవర్నర్ విద్యాసాగరరావు, ముంబాయి వర్సిటీ వీసీ షిండేలను సత్కరించారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్ అవధాని, అకడమిక్ డీన్ ఆచార్య కె.నిరంజన్, సమన్వయకర్త ఉజ్వల్ కుమార్ ఘటక్ పాల్గొన్నారు.

అందరి జీవితాల్లో నూతన కాంతులు నింపాలి

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



విశాలాంధ్ర - తిరుమల : ప్రపంచానికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా భారతదేశం విరాజిల్లుతోందని భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంక య్యానాయుడు ఉద్ఘాటించారు. రానున్న మకర సంక్రాంతి తెలుగు ప్రజల జీవితాల్లో నూతన కాంతులు నింపాలని ఆకాంక్షించారు. గురువారం ఉదయం ఆయన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఉపరాష్ట్రపతి పదవీబాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా శ్రీవారి దర్శనానికి విచ్చే శారు. శ్రీవారి దర్శనానంతరం ఉపరాష్ట్రపతి ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ మకర సంక్రాంతి ముందు శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకోవడం మహాభాగ్యమన్నారు. సర్వేజనా సుఖినోభవంతు అన్నట్టు అందరూ సుఖసంతో షాలతో ఉండాలన్నారు. టీటీడీ భక్తులకు సౌకర్యాల కల్పనతోపాటు హిందూ ధర్మ పరిరక్షణకు కృషిచేయాలన్నారు. ఉపరాష్ట్రపతి తొలుత పుష్కరిణి వద్ద శ్రీ వరాహస్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. మహాద్వారం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్, జేఈఓ శ్రీనివాసరాజులు శేషవస్త్రం, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని ఉపరాష్ట్రపతికి అందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రద్యుమ్న, సీవీఎస్ఓ ఆకే రవికృష్ణ, తిరుపతి అర్బన్ ఎస్పీ అభిషేక్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

పల్లెసీమల సేవే పరమాత్ముని సేవ

మంత్రి నారా లోకేష్



విశాలాంధ్ర - అవుకు: పల్లె సీమలకు సేవచేస్తే పరమాత్మునికి సేవ చేసినట్లేనని రాష్ట్ర పంచాయతీరాజ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. కర్నూలుజిల్లా అవుకు మండలంలోని రామాపురం గ్రామంలో గురువారం జరిగిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ముఖ్య అతిథిగా మంత్రి లోకేష్ హాజరయ్యారు. గ్రామంలో రూ.58 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించడం వల్ల రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కష్టపడి ప్రగతి పథంలో నడిపిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే రూ.25 వేల కోట్ల రుణమాఫీ చేసి రైతులకు రుణ విముక్తి కల్పించారన్నారు. రూ.200 పింఛన్‌ను వెయ్యి రూపాయలకు పెంచామన్నారు. ప్రతి పేదవాడు సంతోషంగా ఉండాలని సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ కానుకలు అందించడం జరుగుతున్నదన్నారు. అవుకు మండలంలో 9 నెలల కాలంలో రూ.5 కోట్లు ఖర్చుచేసి సీసీ రోడ్లను ఎమ్మెల్యే నిర్మించారని తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గంలో జిల్లాలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా అభివృద్ధి పథంలో వెళుతున్నారన్నారు. సభలో అగ్రిగోల్డ్ బాధితులు సమస్యలు పరిష్కరించాలని ఆయన్ను కోరగా, కాంగ్రెస్ హయాంలో అగ్రిగోల్డ్ కుంభకోణం జరిగిందని, టీడీపీ అధికారంలోకి రాగానే అగ్రిగోల్డ్ ఆస్తులను జప్తు చేయించడమైందని, త్వరలోనే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యనారాయణ, నంద్యాల ఆర్డీఓ రాంసుందర్ రెడ్డి, జెడ్పీసీఈఓ ఈశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి పార్వతి, మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర రెడ్డి, తహశీల్దార్ సంజీవయ్య, టీడీపీ నాయకులు ఏవీ సుబ్బారెడ్డి, ఐవీ పక్కీరారెడ్డి, ఉగ్రసేనా రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

భీమసింగి ఫ్యాక్టరీకి తీపి కబురు

ఎన్‌సీడీసీ నుంచి రూ.30 కోట్ల రుణం



విశాలాంధ్ర-జామి: కష్టాల్లో చిక్కుకున్న విజయనగరం జిల్లా జామిలోని భీమసింగి శ్రీవిజయరామ సహకార చక్కెర కర్మాగారానికి తీపి కబురందింది. ఇప్పటివరకు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఇబ్బంది పడుతున్న యాజమాన్యానికి కొంత ఊరట లభించనుంది. సహకార కర్మాగారాలు ఆప్కాబ్ నుంచి అధిక వడ్డీలకు అప్పులను తెస్తున్నాయి. అది కూడా ప్రభుత్వ గ్యారంటీతో రుణాలు మంజూరుచేస్తున్నారు. క్రషింగ్ అనంతరం వడ్డీతోసహా రుణం చెల్లించాల్సి వస్తోంది. తాజాగా జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) కర్మాగారాలకు రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎం.గిరిజా శంకర్ నాలుగు సహకార చక్కెర కర్మాగారాలకు రూ.235 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. భీమసింగి కర్మాగారానికి రూ.30 కోట్లు మంజూరయ్యాయి. ఈ రుణాన్ని మూలధన పెట్టుబడి కింద కేవలం 8.5 శాతం వడ్డీకి మంజూరు చేశారు. కర్మాగారానికి రుణం మంజూరు కావడంపై కార్మిక సంఘ నేతలు వర్రిశ్రీను, సూర్యనారాయణ, శిరికి ఎర్నాయుడు, సీరెడ్డి నాయుడు, విజయ్‌కుమార్, దేముడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.


ఊరట లభించినట్టే

కర్మాగారం ప్రస్తుతం ఆర్థిక చిక్కుల్లో ఉంది. అధిక వడ్డీలకు రుణాలు తెచ్చుకుంటున్న సమయంలో ఎన్‌సీడీసీ రుణం మంజూరు చేయడం కొంత ఊరటనిచ్చే అంశమే. కర్మాగార పరిస్థితిని, రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వడ్డీ మాఫీ చేయాలని కోరుతున్నాం. వచ్చిన మిగులును చెరకు రైతులకు అందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

వి.కృష్ణంరాజు
కర్మాగార గుర్తింపు సంఘం అధ్యక్షులు
(ఏఐటీయూసీ అనుబంధం)

టీడీపీ మీటింగ్ కాదు.. జన్మభూమి సభ

మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆగ్రహం



విశాలాంధ్ర-మంత్రాలయం: ఇది తెలుగుదేశం పార్టీ సమావేశం కాదు.. జన్మ భూమి కార్యక్రమం.. కనీసం వార్డు మెంబరు కూడా కాని వ్యక్తిని ఎలా ఆహ్వాని స్తారంటూ కర్నూలు జిల్లా మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి యంత్రాలయం ఎంపీడీవోపై నిప్పులు చెరిగారు. మంత్రా లయం జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో గురు వారం జన్మ భూమి కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి వచ్చారు. తొలుత సభకు వచ్చిన వారితో జన్మభూమి ప్రతిజ్ఞ చేయిం చారు. అనంతరం తిక్కారెడ్డి మాట్లాడుతున్న సమయంలో స్థానిక ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి, సర్పంచ్ బీమయ్య, మండల కన్వీనర్ భీమ్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి సభా ప్రాంగణానికి వచ్చారు. ఎమ్మెల్యే రాకతో తిక్కారెడ్డి సభ నుంచి నిష్క్రమించారు. దీనిని గమనించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది జన్మభూమి సమావేశమా.. లేక టీడీపీ సమావేశమా అంటూ అధికారులను ప్రశ్నిం చారు. ప్రొటో కాల్ ప్రకారం ఎమ్మెల్యేను పిలవాలని తెలి యదా... తిక్కారెడ్డి ఎవరు.. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఎలా అంటూ ఎంపీడీవో మధు సూదన్‌రెడ్డిని ప్రశ్నించారు. నియోజకవర్గంలో కొందరు వైసీపీ నాయకులపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అవి మానుకుని అభివృద్ధికి తోడ్పడాలన్నారు. దమ్ముంటే చంద్రబాబుతో మాట్లాడి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీచేస్తే తాను కూడా జగన్‌తో మాట్లాడి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని, గెలిచేది ఎవరో తెలుస్తుందని సవాల్ విసిరారు. చంద్రబాబు చెప్పేది ఎక్కువ చేసేది తక్కువ అన్నారు. తిక్కారెడ్డి, ఆయన సోదరుడు అవినీతికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ అధికారులు జన్మభూమి వేదికలను పార్టీ సభగా మారుస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్టేట్ అబ్జర్వర్ సెల్వం, నోడల్ అధికారి బాలు నాయక్, తహశీల్దార్ పద్మనాభ రావు, డిప్యూటీ డీఈవో ఈరన్న తదితరులు పాల్గొన్నారు.



మిత్రులను శత్రువులుగా మార్చుకోలేను: కమల్

చెన్నై: తన రాజకీయ ప్రయాణంలో స్నేహితులను శత్రువులుగా మార్చుకోలేనని ప్రముఖ నటుడు కమల్ హాసన్ అన్నారు. తన చిరకాల మిత్రుడు సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను ఉద్దేశిస్తూ కమల్ ఈ వ్యాఖ్యలు చేశారు. తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు డిసెంబనే 31న రజనీకాంత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో కమల్, రజనీ కలిసి ఒకే పార్టీ పెట్టబోతున్నారా? అన్న సందేహాలు మొదల య్యాయి. మరోపక్క రాజకీయం విషయంలో కమల్..రజనీతో ఎన్నటికీ చేతులు కలపరని వార్తలు వెలువడుతున్నాయి. దీనిపై కమల్.. ఓ తమిళ పత్రికకు రాసిన ఆర్టికల్‌లో స్పందించారు. 'నా రాజకీయ ప్రయాణంలో స్నేహితులను శత్రువులుగా మార్చుకోలేను. రాజకీయాల్లో నిలదొక్కుకోవడానికి ఇలాంటి పనులు చేయను. ఇలా చేయడం ప్రజలకు కూడా నచ్చదు' అని పేర్కొన్నారు. అనంతరం తాను ప్రారంభిస్తానన్న యాప్ గురించి కమల్ ఈ ఆర్టికల్‌లో ప్రస్తావించారు. 'యాప్ ప్రారంభించడంలో ఆలస్యమవుతోందని చాలామంది నాపై కామెంట్లు చేస్తున్నారు. యాప్ లాంచ్ చేయడం సినిమా విడుదల చేసినంత సులువేం కాదు. ఈ యాప్ ప్రజల కోసం. కాబట్టి తొందరపడకుండా ప్రతి విషయంలో ఆచితూచి వ్యవహరించాలి' అని పేర్కొన్నారు. మరోపక్క రజనీ తన పార్టీ గుర్తు, పేరు ప్రకటించడానికి సమయం పడుతుందని అంటున్నారు.. బాబా గుర్తును రజనీ పార్టీ గుర్తుగా వాడుతున్నట్లు వార్తలు వెలువడ్డాయి. కానీ ఈ వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని రజనీ స్పష్టంచేశారు.



స్పిల్ వే పనులు అడ్డుకున్న పోలవరం కార్మికులు

ట్రాన్స్‌ట్రాయ్‌కి మరో ఎదురుదెబ్బ

విశాలాంధ్ర-పోలవరం: పోలవరం ప్రాజెక్టు ప్రధాన కాంట్రాక్టు సంస్థ ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. దేనా బ్యాంకు... ట్రాన్స్‌ట్రాయ్ బకాయి చెల్లించాలని కొద్ది రోజుల క్రితం పనులు చేసే యంత్రాలను అడ్డుకుంది. రూ.53 కోట్లు బకాయిలు ఉండటంతో బ్యాంకర్లు నిలిపివేయడం చర్చనీయాంశమైంది. మరోవైపు పనులు చేస్తున్న కార్మికులకు మూడు నెలల బకాయి ఉండటంతో కార్మికులు గురువారం స్పిల్ వే పనులను అడ్డుకొని నిరసన గళమెత్తారు. దీంతో పోలవరం ప్రాజెక్టు పనులు కార్మికుల సమ్మెతో నిలిచిపోయాయి. మూడు నెలల జీతాలు చెల్లిస్తేనే విధులకు వస్తామని కార్మికులు తెగేసి చెప్పడంతో ప్రాజెక్టుకు కీలక నిర్మాణమైన స్పిల్ వే కాంక్రీట్ పనులు గురువారం ఉదయం నుంచి నిలిచిపోయాయి. ట్రాన్స్‌ట్రాయ్ స్పిల్ వే పనులు చేస్తోంది. ఆ సంస్థ ఇతర రాష్ట్రాలకు చెందిన సుమారు 3 వేల మంది కార్మికులను స్పిల్ వే కాంక్రీట్ పనులకు వినియోగిస్తోంది. అయితే మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఆపరేటర్లు, డ్రైవర్లు, సూపర్‌వైజర్లు విధులు బహిష్కరించారు. ఎన్నిసార్లు విన్నవించినా తమకు జీతాలు ఇవ్వకుండా యాజమాన్యం జాప్యం చేస్తున్నదని సిబ్బంది ఆరోపిస్తున్నారు. గతంలోనూ కార్మికులు, సిబ్బంది విధులు బహిష్కరించారు. అప్పట్లో ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థకు మొబిలైజేషన్ అడ్వాన్స్ చెల్లించి పనులు సాగేటట్లు చేసింది. మళ్లీ అదే పరిస్థితి ఎదురుకావడంతో కార్మికులు పనులు నిలిపివేశారు. ఇతర కార్మికుల వాహనాలు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా రాళ్లు, టైర్లు వేసి నిరసన తెలిపారు.

17న మోడీ-నెతాన్యాహు రోడ్ షో

అహ్మదాబాద్ : ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతాన్యహు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీలకు సాదర స్వాగతం పలికేందుకు అహ్మదాబాద్ నగరం ఎదురుచూస్తుంది. జనవరి 17న వీరి పర్యటన ఉండే అవకాశం ఉన్నట్లు గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ గురువారం తెలిపారు. గత ఏడాది జూలైలో ఇజ్రాయెల్‌ను మోడీ సందర్శించిన సమయంలో ఇద్దరు నాయకులు కలుసుకున్నారు. 1992లో రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడిన నాటి నుంచి ఒక భారత ప్రధాని తొలిసారిగా ఆ దేశం సందర్శించారు. కాగా ఈ ప్రధానులిద్దరూ ఇక్కడి సబర్మతి ఆశ్రమాన్ని కూడా సందర్శించే అవకాశాలున్నాయని రూపానీ చెప్పారు. ఇదిలాఉండగా నగరం నుంచి 8 కిలోమీటర్ల మేర సంయుక్తంగా రోడ్‌షో జరుగుతుందని, ఇందులో సబర్మతి ఆశ్రమ సందర్శన కూడా ఉండవచ్చని అహ్మదాబాద్ పౌర సంస్థ అధికారి ఒకరు తెలిపారు. గత ఏడాది సెప్టెంబరులో మోడీ, జపాన్ ప్రధాని షింజో అబే కూడా కలిసి రోడ్ షో నిర్వహించారు. షింజో అబే, ఆయన భార్యలు కూడా ప్రధాని మోడీతో కలిసి సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించారు. ఇక 2014లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఆయన భార్యతో కలిసి మోడీ ఇక్కడి నదీ తీరానికి వచ్చారు. తాత్కాలిక షెడ్యూల్ ప్రకారం, మోడీ, నెతాన్యహులు జనవరి 17న ఇక్కడకు చేరుకుని తొలుత సబర్మతి ఆశ్రమాన్ని సందర్శిస్తారు. ఉన్నతాధికారులు వారికి ఘన స్వాగతం పలుకుతారు' అని రూపానీ విలేకరులకు తెలిపారు. అలాగే మోడీ, నెతాన్యహులు ఆశ్రమం నుంచి నగరానికి సమీపంలోని బవ్లా పట్టణం వద్ద స్వయంప్రతిపత్తి కేంద్రం 'ఐక్రియేట్'కు వెళతారు. కాగా నెతాన్యహు నాలుగు రోజుల భారత పర్యటన జనవరి 14 నుంచి ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా భారత్, ఇజ్రాయెల్‌లు రక్షణ, భద్రతా రంగాల్లో సంబంధాలను మరింత మెరుగుపరుచుకొనే అవకాశాలున్నాయి. వాణిజ్యం, నీటి నిర్వహణ, వ్యవసాయం అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంలో సంబంధాల పెంపుపై కూడా రెండు దేశాలు చర్చించవచ్చు.

20 ఎత్తిపోతల పథకాలకు రూ.100.84 కోట్ల నాబార్డు రుణం



- రాష్ట్ర వాటా రూ.19.77 కోట్లు
- 9,965.56 హెక్టార్లకు సాగునీరు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలోని 20 ఎత్తిపోతల పథకాలకు జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డు) రూ.100.84 కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. గ్రామీణ మౌలిక సౌకర్యాల నిధి (ఆర్‌ఐ డీఎఫ్) కింద నాబార్డు ఈ రుణాన్ని మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.19.77 కోట్లను భరించనుంది. మొత్తం రూ.120.62 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎత్తిపోతల పథకాల ద్వారా తొమ్మిది జిల్లాల్లో 9,965.56 హెక్టార్లకు సాగునీటి సౌకర్యం కల్పించనుంది. ఈ మేరకు జలవనరులశాఖ కార్యదర్శి శశి భూషణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం రుణాన్ని మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల ఆయకట్టు అభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌ఐ డీసీ) జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ) గత ఏడాది జూలైలో ఒకసారి, ఈనెలలో మరోసారి ప్రతి పాదనలు పంపించారు. ప్రభుత్వ ఆర్థిక స్థితి అంతంతమాత్రంగా ఉండటంతో నాబార్డు నుంచి రుణాన్ని మంజూరు చేయాలని ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి నాబార్డుకు ప్రతిపాదనలు పంపించటంతో మొత్తం అంచనా వ్యయం రూ.120.62 కోట్లలో రూ.10084 కోట్ల రుణాన్ని మంజూరు చేసేందుకు నాబార్డు అంగీకరించింది. తాజాగా మంజూరు చేసిన రూ.100.84 కోట్లతో రాష్ట్రానికి నాబార్డు రుణం 2017-18లో రూ.720 కోట్లు దాటిందని నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) కె సురేష్‌కుమార్ తెలిపారు. అంతేగాకుండా ఆర్‌ఐడీఎఫ్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో విద్యా వసరులు, సాగునీటి వనరుల, గ్రామీణ అనుసంధానం కోసం రూ.13,634.33 కోట్ల రుణం మంజూరు చేసినట్లు ఆయన తెలియజేశారు. నాబార్డు మంజూరు చేసే ఈ రుణంలో అనంతపురం జిల్లాలో ఒక ఎత్తిపోతల పథకం, గుంటూరులో ఐదు, కడపలో ఒకటి, కృష్ణాలో ఐదు, కర్నూలులో రెండు, ప్రకాశం, విశాఖపట్నం, పశ్చిమ గోదావరిలో ఒక్కొక్కటి, శ్రీకాకుళంలో మూడు ఎత్తిపోతల పథకాల ద్వారా ఆయకట్టుకు సాగునీటిని అందించే అవకాశం ఉంటుంది.

నాబార్డు రుణంతో నిర్మించే ఎత్తిపోతల పథకాలు

జిల్లా	పథకం	మొత్తం ఆయకట్టు (హెక్టార్లలో)	అంచనా వ్యయం (రూ.కోట్లలో)	ఆర్‌ఐడీఎఫ్ రుణం (రూ.కోట్లు)	రాష్ట్రవాటా (రూ.కోట్లు)
శ్రీకాకుళం	మట్టల	526.10	9.64	8.00	1.63
శ్రీకాకుళం	కడుమ	469.00	10.07	8.40	1.66
శ్రీకాకుళం	సౌదాం	627.28	10.88	9.04	1.83
విశాఖ	శంకరం	113.00	2.58	2.18	0.39
పశ్చిమ గోదావరి	గురుకుమిల్లి-1, 2	80.94	2.44	2.08	0.35
కృష్ణా	కొండంగి-1	1,577.09	6.02	5.05	0.96
కృష్ణా	కొండంగి-2	2,011.33	5.23	4.41	0.82
కృష్ణా	దాసుళ్లపాలెం	109.67	2.22	1.86	0.36
కృష్ణా	వెలగలేరు -2	244.03	2.98	2.51	0.46
కృష్ణా	అరిపిరాల	1,456.00	8.90	7.48	1.41
గుంటూరు	ములుకుదురు	307.57	3.77	3.14	0.62
గుంటూరు	అచ్చంపాలెం	182.11	3.23	2.69	0.53
గుంటూరు	సుద్దపల్లి	161.88	4.65	3.86	0.78
గుంటూరు	ఇర్లపాడు	509.92	6.53	5.44	1.08
గుంటూరు	రాజుపేట	222.99	4.12	3.45	0.66
ప్రకాశం	వెలమవారిపాలెం	419.26	8.75	7.31	1.43
కడప	కమనూరు -2	101.98	2.28	1.90	0.37
కర్నూలు	జర్రేరు	612.71	21.01	17.53	3.48
కర్నూలు	సంగపట్నం	103.20	2.65	2.20	0.44
అనంతపురం	పెదచిగుల్లేరు	129.50	2.63	2.21	0.41
మొత్తం		**9,965.56**	**120.62**	**100.84**	**19.77**

వడ్డీరేట్లు పెంచిన ఇండియన్ బ్యాంకు

చెన్నై: ఇండియన్ బ్యాంకు వడ్డీరేట్లు పెంచుతున్నట్టుగా గురువారం ప్రకటించింది. గృహ, ఎన్‌ఆర్‌ఇ టర్మ్ డిపాజిట్లు రూ.5 కోట్ల వరకు వివిధ కేటగిరీలకు 25 బీపీఎస్ పాయింట్ల నుంచి 125 బీపీఎస్‌ల వరకు వడ్డీని పెంచారు. పెరిగిన రేట్లు 2018 జనవరి 8వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయి.

విశాలాంధ్ర ఎఫెక్ట్..

హమ్మయ్యా..! సాధారణ రైళ్లకు మోక్షం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఎట్టకేలకు దక్షిణ మధ్య రైల్వే స్పందించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా తెలుగు ప్రజల సౌకర్యార్థం జనసాధారణ్ ప్రత్యేక రైళ్లను నడిపేందుకు చర్యలు తీసుకుంది. సికింద్రాబాద్ నుంచి కాకినాడకు గురు, శుక్రవారాల్లో రెండు జనసాధారణ్ రైళ్లను ఏర్పాటు చేయడంతో పేద, మధ్య తరగతి ప్రయాణీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ప్రయాణీకుల గోడును పట్టించుకోకుండా ఉన్నత వర్గాలకే ప్రాధాన్యం ఇస్తూ దక్షిణ మధ్య రైల్వే వివిధ ప్రాంతాల నుంచి జనవరి నెలలో నిర్దేశించిన రోజుల్లో ఆయా మార్గాల్లో ఏసీ, స్లీపర్ తరగతి బోగీలతో కూడిన రైళ్లనే అధికారులు ఏర్పాటు చేశారు. అలాగే రోజువారి నడిచే రైళ్లతోపాటు వీక్లీ, ప్రత్యేక రైళ్లకు అదనంగా థర్డ్ ఏసీ, ఏసీ చైర్‌కార్, స్లీపర్ క్లాస్ వంటి బోగీలను మాత్రమే అమర్చి, జనరల్ బోగీల విషయాన్ని విస్మరించారు. దీనిపై ఈనెల 6వ తేదీన విశాలాంధ్ర 'మారాజులకు ప్రేమతో..!' శీర్షికతో వార్తను ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు సామాన్య ప్రయాణీకుల కోసం వరుసగా రెండ్రోజులు సికింద్రాబాద్ నుంచి అన్నీ జనరల్ సెకండ్ క్లాస్ బోగీలతో కూడిన రైళ్లను ఏర్పాటు చేయడం చాలా వరకూ ఊరట కలిగించే విషయం. పండుగ తర్వాత తిరుగు ప్రయాణంలో కూడా ఇదే రీతిలో జనసాధారణ్ రైళ్లను తిరుపతి, విశాఖపట్నం, కాకినాడ నుంచి సికింద్రాబాద్‌కు నడపాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

'పోలవరం ప్రాజెక్టు-కాంగ్రెస్ కృషి'పై..

ప్రభుత్వం బహిరంగ చర్చకు సిద్ధమేనా?

ముఖ్యమంత్రికి పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి బహిరంగ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలవరం ప్రాజెక్టు-కాంగ్రెస్ కృషిపై సీఎం చంద్రబాబు నాయుడు బహిరంగ చర్చకు సిద్ధపడ్డాలని పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి సవాల్ విసిరారు. ఈ మేరకు గురువారం చంద్రబాబుకు ఆయన 20 ప్రశ్నలతో కూడిన ఒక బహిరంగ లేఖ రాశారు. పోలవరం బహుళసార్థక సాధక ప్రాజెక్టును సత్వరమే పూర్తిచేయాలనే డిమాండుతో పీసీసీ ఈ నెల 7,8,9 తేదీల్లో చేపట్టిన 'మహాపాదయాత్ర', 10న సామూహిక సత్యాగ్రహాన్ని నిర్వహించిందని వివరించారు. సీఎం హోదాలో ఉండి పదేపదే అబద్ధాలు చెబుతూ రాష్ట్ర ప్రజల్ని తప్పుదోవ పట్టించడం నేరంతో సమానమని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు పనుల్లో కొనసాగుతున్న జాప్యాన్ని, ఆర్థిక సహాయం అందించడంలో కేంద్రం చేస్తున్న నిర్లక్ష్యం వైఖరిని నిరసిస్తూ నాలుగు ప్రధాన డిమాండ్లతో కాంగ్రెస్ పాదయాత్ర నిర్వహించిందని గుర్తుచేశారు. 2018-19 నాటికి పోలవరం ప్రాజెక్టు పనుల్ని పూర్తి చేయాలని, రాష్ట్రానికి ఆర్థికభారం లేకుండా కేంద్రమే పోలవరాన్ని పూర్తి చేయాలని, నిర్వాశితులకు పూర్తి చేయాలని చేయాలని, పోలవరం ప్రాజెక్టు పనుల్లో నాణ్యత పాటించాలని డిమాండు చేశారు. కాంగ్రెస్‌పై చంద్రబాబు నిత్యం అసత్యాలు చేయడం తగదని, పనుల నిర్వహణపై బహిరంగ చర్చకు సిద్ధమవ్వాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు 1981 మే 19న కాంగ్రెస్ ముఖ్యమంత్రి టి.అంజయ్య భూమి పూజ చేశారని గుర్తుచేశారు. 1994-2004 మధ్య 9ఏళ్ల సీఎంగా పని చేసిన పోలవరం ప్రాజెక్టు పనులపై టీడీపీ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు.

పెళ్లైన మూడేళ్ల వరకు

దరఖాస్తు చేసుకోవచ్చు..

కులాంతర వివాహాలకు ప్రోత్సాహకాలపై మంత్రి బేడీ

చండీగఢ్ : కులాంతర వివాహాలు చేసుకున్న వారు, పెళ్లి జరిగిన మూడేళ్లలోపు ముఖ్యమంత్రి సామాజిక సమస్త అంతర్జాతీయ వివాహ పథకం కింద దరఖాస్తు చేసుకొని లబ్ధిపొందవచ్చునని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి కిషన్‌కుమార్ బేడీ తెలిపారు. ఈ పథకం క్రింద ప్రయోజనం పొందాలంటే పెళ్లి జరిగిన నాటి నుంచి ఏడాదిలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేదని, ఇప్పుడు ఆ గడువును మూడేళ్ల వరకు పొడిగించామని చెప్పారు. మంత్రి కిషన్‌కుమార్ బేడీ గురువారం జిల్లాలు, తహశీల్ స్థాయి సంక్షేమాధికా రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మతసామరస్యాన్ని, కులాంతర వివా హారాలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్టు మంత్రి తెలి పారు. ఎస్సీ యేతరులను పెళ్లాడిన ఎస్సీలకు రూ.1.01లక్షల ప్రోత్సాహకాన్ని అందిస్తామన్నారు. సాధ్యమైనంత మందికి లబ్ధిని చేకూర్చేలా ఈ పథకాన్ని మరో సారి ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. పేదల కోసం ప్రవేశపెట్టిన కేంద్ర పథకాల నిధులను మురగబెట్టొద్దని, అధికారులంతా క్షేత్రస్థాయి పర్యవేక్షణలు క్రమంగా నిర్వహించాలని, ఎస్సీలు, బీసీలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని, తహశీల్ స్థాయిలో సీనియర్ సెకండరీ స్కూళ్లలో మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. వివిధ పథకాల పనితీరుపై మంత్రి గురువారం సమీక్షించారు. పేదల సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని, ఎలాంటి జాప్యం లేకుండా వారికి ప్రయోజనాలను అందించేందుకు కృషిచేస్తోందని అన్నారు.

మరుగుదొడ్డి నిర్మించకపోతే సత్యాగ్రహం

- రాష్ట్రాన్ని స్మార్ట్ వాటర్ గ్రిడ్ చేస్తాం
- బెల్టుషాపులు పెడితే తోలు తీస్తా
- ముఖ్యమంత్రి చంద్రబాబు



విశాలాంధ్ర ప్రతినిధి-అనంతపురం : ఈ ఏడాది మార్చి నెలఖారుకు బహిరంగ మలవిసర్జన రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు మరుగుదొడ్డిని నిర్మించుకోవాలని, లేనట్లయితే అలాంటి వారి ఇంటి వద్ద సత్యాగ్రహం చేస్తానన్నారు. గురువారం ధర్మవరంలో ఐదవ విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమం ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పేదరికంపై విజయం సాధిస్తామన్న ధీమా కలుగుతోందన్నారు. అభివృద్ధిలో అనంతపురం జిల్లా శరవేగంగా దూసుకుపోతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం, ఆనందం ఎంతో ముఖ్యమని సీఎం తెలిపారు. రాష్ట్రాన్ని స్మార్ట్ వాటర్ గ్రిడ్‌గా చేస్తామని, భవిష్యత్తులో గోదావరి, కృష్ణా, వంశధార, పెన్నా, నాగావళి నదులను అనుసంధానం చేస్తామన్నారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని బాగా నిర్వహించిన సర్పంచ్‌లు, కో-ఆర్డినేటర్లకు అవార్డులు ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. విద్యుత్, ఆర్‌డీ, పైలాన్ తదితర విభాగాలల్లో 36 అవార్డులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో హ్యాపీ ఇండెక్స్ పెట్టామని, ఇందులో అనంతపురం జిల్లా 9వ స్థానంలో ఉందని, భవిష్యత్తులో మొదటి స్థానానికి చేరుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి నెలకు రూ.10 వేలు ఆదాయం కల్పించడమే తమ లక్ష్యమన్నారు. అసంఘటిత రంగంలోని వారిని ఆదుకోవడానికి చంద్రన్న బీమాను, ఆడబిడ్డలకు కానుకగా చంద్రన్న పెళ్లికానుక అందజేస్తున్నామన్నారు. బెల్టుషాపులు పెడితే తోలు తీస్తామన్నారు. కుటుంబానికి 15 సూత్రాలు, సమాజ వికాసానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ 9 రోజుల్లో వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించామని ఆయన చెప్పారు. హంద్రీ-నీవా ద్వారా జిల్లాలోని బుక్కపట్నం, యాడికి, ధర్మవరం, రాప్తాడు, బత్తలపల్లి, తాడిమర్రి తదితర ప్రాంతాల్లో భూగర్భ జలాలు బాగా పెరిగాయన్నారు. ఫిబ్రవరి 24న జరిగే లేపాక్షి ఉత్సవాల లోపే లేపాక్షి, మడకశిర చెరువులను నీటితో నింపేందుకు చర్యలు తీసుకోవాలని, పరిటాల రవి వర్ధంతి రోజుకు బీటీపీ, పేరూరు ప్రాజెక్టులకు టెండర్లు పిలిచి పరిపాలన ఉత్తర్వుల జారీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. గొలుసుకట్ట చెరువులకు నీటిని అందించేందుకు సమగ్ర ప్రణాళికలను రూపొందించామన్నారు. జన్మభూమి కార్యక్రమం సందర్భంగా రాష్ట్రంలో 2,42,663 మందికి రూ.4,537.47 కోట్లు లబ్ధి చేకూర్చామన్నారు. మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, జవహర్, శాసనమండలి, శాసనసభ చీఫ్ విప్‌లు పయ్యావుల కేశవ్, పల్లె రఘునాథరెడ్డి, ఎంపీలు దివాకర్‌రెడ్డి, నిమ్మల కిష్టప్ప, ఎమ్మెల్యేలు గొనుగుంట్ల సూర్యనారాయణ, బి.కె.పార్థసారథి, ఎమ్మెల్సీలు దీపక్‌రెడ్డి, తిప్పేస్వామి, కలెక్టర్ వీరపాండియన్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలకు జిల్లాకు రూ.కోటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో ఈ ఏడాది గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఒక్కో జిల్లాకు కోటి రూపాయలను కేటాయించింది. మొత్తం 13 జిల్లాలతో పాటు సెక్రటేరియట్, రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక శాఖకు రూ.13.55 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సంక్రాంతి సంబరాలను తిరుపతి, కడప, విశాఖపట్నం, పుట్టపర్తిలోని శిల్పారామాల్లో విధిగా నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రామాల్లో కళాకారులు, సంప్రదాయ క్రీడలను నిర్వహించటంతోపాటు గంగిరెద్దుల ఆట, హరిదాసులు, గొబ్బిమ్మలు, బొమ్మల కొలువులు, రంగవల్లి తదితర కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. ఆయా కార్యక్రమాలకు ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఇతర ప్రజా ప్రతినిధులను ఆహ్వానించటంతోపాటు రైతులు, డ్వాక్రా గ్రూపు సభ్యులు, యువజన సంఘాలు, విద్యార్థి సంఘాలను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మొత్తం రూ.13.55 కోట్లలో జిల్లాకు రూ.కోటితోపాటు సృజనాత్మకత, సాంస్కృతిక కమిషనర్‌కు రూ.50 లక్షలు, సెక్రటేరియట్‌కు రూ.5 లక్షలను ప్రభుత్వం విడుదల చేసింది.

సిగరెట్ ఒక్కటైనా చాలు...

లండన్: సిగరెట్ ఒక్కటైనా చేసే చేటు తక్కువేమీకాదని తాజా అధ్యయనంలో తేలింది. సరదాగా ఒకసారి దీన్ని తాగుదామని భావించినవారిలో 61 శాతం మంది పొగరాయుళ్లుగా మారుతున్నారని వెలుగులోకి వచ్చింది. లండన్‌లోని క్వీన్‌మేరీ వర్సిటీ నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్‌లకు చెందిన 2,15,000 మంది సమాచారాన్ని వారు విశ్లేషించారు. 'ఓ వ్యసనానికి బానిస కావడంలో తొలి సరదాలు ప్రముఖ పాత్రపోషిస్తాయి. సిగరెట్ విషయంలో ఈ ముప్పు విపరీతంగా ఉంటోంది. ప్రతి ఐదుగురిలో ముగ్గురు ఇలానే పొగకు బానిసలు అవుతున్నారు. దీంతో అసలు సిగరెట్ జోలికి వెళ్లకుండాచూస్తే మంచి ప్రయోజనాలుంటాయి'అని పరిశోధనకు నేతృత్వం వహించిన పీర్ హెజెక్ తెలిపారు.

వాళ్లు 'హిందూ తీవ్రవాదులు'

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌పై సిద్ధరామయ్య తీవ్ర విమర్శ

బెంగళూరు: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు 'హిందూ తీవ్రవాదులు' అని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం ఆరోపించారు. దీనికి బీజేపీ స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ వేర్పాటువాదులకు మద్దతు ఇస్తుందని ప్రత్యారోపణ చేసింది. బీజేపీ నుంచి విమర్శల దాడిని ఎదుర్కొన్న సిద్ధరామయ్య బుధవారం మాట్లాడుతూ బీజేపీ, దాని అసలు మూలం ఆర్‌ఎస్‌ఎస్ ఉగ్రవాదులని పేర్కొన్నారు. అయితే గురువారం చామ్‌రాజ్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు 'హిందూ తీవ్రవాదులు' అని ఆరోపించారు. తర్వాత మైసూరులో విలేకరులతో మాట్లాడుతూ 'వారు హిందూ ఉగ్రవాదులని నేను చెబుతున్నా. నేను కూడా హిందువునే. కానీ మానవత్వం కలిగిన హిందువును. వారు మానవత్వం లేదని హిందువులు. ఇదే వారికి, నాకు మధ్య ఉన్న తేడా' అని తెలిపారు. ఇదిలాఉండగా, బీజేపీ నాయకులను ఉగ్రవాదులుగా పిలవడం సిద్ధరామయ్య బాధ్యతారాహిత్యమని బీజేపీ ఎంపీ శోభా కర్లందాజే ఆరోపించారు. నేడు దేశంలో ఉగ్రవాదానికి, కాశ్మీర్‌లో పరిస్థితికి కాంగ్రెస్ పార్టీనే కారణమని అన్నారు.

బీటీ కాటన్ విత్తనాలు నిషేధించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చిందన్నారు. రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం కనీసం రైతుల వంక తొంగి చూడలేదని, పత్తి చేను మాత్రం 6 నుంచి 7 అడుగులు ఎత్తు పెరిగినా కాపు మాత్రం లేదని, రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు కలిసి వస్తే తాము ముందుండి పోరాడతామన్నారు. మోనోశాంటో కంపెనీపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. రాష్ట్రంలో 15 లక్షల ఎకరాలు పత్తి సాగు చేశారని, వేల ఎకరాల పత్తి నష్టపోయినా వ్యవసాయ శాఖ మంత్రి, వ్యవసాయ అధికారులు రైతుల గురించి పట్టించుకోకుండా కార్యాలయాలకే పరిమితమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, రైతు సంఘ నాయ కులు ఎం.రమేష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.మాల్యాద్రి, గ్రామ రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్తి రైతాంగాన్ని ఆదుకోవాలి : అతుల్‌కుమార్ అంజాన్ డిమాండు

నకిలీ విత్తనాల కారణంగా పంట నష్టపోయిన పత్తి రైతులను ఆదుకునే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్ డిమాండు చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో పత్తి రైతుల జిల్లా సదస్సు ఇక్కడ మల్లయ్యలింగం భవన్‌లో గురువారం జరిగింది. సదస్సుకు రైతు నాయకులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి అతుల్ కుమార్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలను సరఫరా చేసే మోన్‌శాంటో, మైకా లాంటి కంపెనీలకు విత్తన పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల ఎకరాల భూమిని కేటాయించాయని, రైతులను మాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫ్యాక్టరీలు తగులబడితే రాయితీలు కల్పించే ప్రభుత్వాలు రైతాంగ రక్షణకు తీసుకునే చర్యలలో మాత్రం ఘోరంగా వైఫల్యం చెందాయని విమర్శించారు. రైతులు చెల్లించే ఇన్సూరెన్స్ ప్రీమియంలో సగం కేంద్రంగానీ, రాష్ట్రంగానీ భరించాలని డిమాండు చేశారు. పత్తి రైతాంగం సమస్యలను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రావుల వెంకయ్య మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీల అడుగులకు మడుగులొత్తుతున్న ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా, నకిలీ విత్తనాలను నిరోధించడమే లక్ష్యంగా రైతాంగం నడుంబిగించి ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. పత్తి పంటను నష్టపోయిన రైతాంగానికి కంపెనీల నుంచి పరిహారం ఇప్పించాలని, లేనిపక్షంలో ప్రభుత్వం పరిహారాన్ని చెల్లించాలని డిమాండు చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతాంగాన్ని ఆదుకోవడంలో భాగంగా స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, బీటీ పూజ విత్తనాల వలన నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.15 వేలు నష్టపరిహారాన్ని ప్రభుత్వం తక్షణమే అందించాలని డిమాండు చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ పత్తి పంట నష్టపోయి అనేక సమస్యలతో అల్లాడుతున్న రైతాంగాన్ని పట్టించుకోని ప్రజాప్రతినిధులను, అధికారులను నిలదీయాలన్నారు. నష్టాన్ని అంచనా వేసి పత్తి రైతులకు పరిహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకపోతుల శ్రీనివాసరెడ్డి, ముసునూరు రమేష్‌బాబు, ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిరెడ్డి హనుమంతరెడ్డి, సీపీఐ నాయకులు ఎం.రమణారెడ్డి, తాళ్ళూరి బాబురావు, పచ్చల సాంబశివరావు, రైతులు షేక్ బాబు, బిక్కి శ్రీనివాస్, మన్నవ రామారావు, హరిప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ
శుక్రవారం 12
జనవరి 2018
విశాలాంధ్ర

క్రీడలు

ఇది నాకు కొత్త ఆరంభం

భారత మహిళల క్రికెట్ టీంకు ఎంపికైన తానియా భాటియా



న్యూఢిల్లీ : త్వరలో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లే భారత మహిళల క్రికెట్ జట్టులో చోటు సంపాదించిన 20 ఏళ్ల తానియా భాటియా.. ఈ అవకాశం కోసం ఎప్పట్నుంచో ఆశగా ఎదురుచూస్తున్నానని, ఇది తనకు కొత్త ఆరంభమని తెలిపింది. భారత జట్టులో చోటు దక్కించుకున్న అనంతరం తానియా మాట్లాడుతూ.. 'ఇది నాకు కొత్త ఆరంభం. ఎప్పట్నుంచో భారత జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్నాను. గత ఏడాది ప్రపంచకప్ జట్టుకు మిస్సయ్యాను. ఖాళీ సమయంలో మంచి శిక్షణ పొందాను. భారత జట్టులో సుష్మా మనకు ప్రధాన వికెట్ కీపర్. సఫారీ పర్యటనకు ఆమె కూడా ఎంపికైంది. ఏదైనా మ్యాచ్‌కి సుష్మా స్థానంలో నాకు అవకాశం కల్పిస్తే తప్పకుండా మంచి ప్రదర్శన చేస్తాను. దక్షిణాఫ్రికాలో బౌన్సీ పిచ్‌లపై ఆడాలి.. ఆ పరిస్థితులకు అనుగుణంగా ప్రాక్టీస్ చేయాలి' అని చెబుతోంది భాటియా. ఏడేళ్ల వయసు నుంచి క్రికెట్ ఆడటం మొదలుపెట్టిన తానియా.. యువరాజ్ సింగ్ తండ్రి, మాజీ క్రికెటర్ యోగ్‌రాజ్ సింగ్ వద్ద శిక్షణ పొందింది. 13 ఏళ్ల వయసులోనే ఆమె పంజాబ్ జట్టుకు ఎంపికై చరిత్ర సృష్టించింది. తానియా తండ్రి సంజయ్ భాటియా సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో ఉద్యోగి. సంజయ్ కూడా క్రికెట్ ఆడేవాడు. తానియా భారత జట్టుకు ఎంపికవ్వడంపై సంజయ్ మాట్లాడుతూ..'నేను సాధించలేనిది ఈ రోజు నా కూతురు సాధించింది. చాలా సంతోషంగా ఉంది. ఏడేళ్ల వయసు నుంచి తానియా క్రికెట్ ఆడుతోంది. తానియా క్రికెట్ సాధన కోసం నా భార్య సప్న చాలా కష్టపడింది. మా కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది' అని సంజయ్ వివరించారు. తానియా ప్రస్తుతం ఎమ్‌సీఎమ్ దావ్ మహిళా కళాశాలలో బీఏ రెండో సంవత్సరం చదువుతోంది.

టీంలో మార్పు మూర్ఖత్వమే

భారత్‌కు ప్రొటీస్ మాజీ ఫాస్ట్‌బౌలర్ అలెన్ డోనాల్డ్ సూచన



సెంచూరియన్ : టీమిండియా వైస్ కెప్టెన్ అంజిక్యా రహానేను పక్కనబెట్టి ఓపెనర్ రోహిత శర్మను మేనేజ్‌మెంట్ ఎంపిక చేసిన సమయంలో సెలక్టర్ల నిర్ణయాన్ని పలువురు తప్పుబట్టారు. మొదటి టెస్టులో 72 పరుగులు తేడాతో టీమిండియా ఓటమి చవిచూసిన అనంతరం, రోహిత్ శర్మను పక్కనబెట్టి రహానేను ఎంపిక చేయనున్నారు. అలాగే ప్రొటీస్ కెప్టెన్ ఫా డుప్లెసిస్ కూడా రోహిత్‌శర్మ, ధావన్‌ల ఎంపికపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అయితే, శనివారం నుంచి మొదలు కానున్న రెండో టెస్టు గురించి ప్రొటీస్ మాజీ ఫాస్ట్ బౌలర్ అలెన్ డొనాల్డ్ గురువారం విలేకరులతో మాట్లాడాడు. ప్రస్తుతం ఉన్న టీంలో మార్పులు చేర్పులు చేయడం మూర్ఖత్వమే అవుతుందని అభిప్రాయపడ్డాడు. 'నా దృష్టిలో ప్రస్తుతం మార్పులనేవి అనవసరం. మరి అది సెలక్టర్ల నిర్ణయం. కానీ రహానే బెంచీల వెనుక కూర్చొని మైదానంలోకి డ్రింక్స్ తీసుకురావడాన్ని గమనించిన సౌతాఫ్రికా టీం ఆ ఘటనను చూసి ఆశ్చర్యపడింది' అని తెలిపాడు. రహానేను బెంచికే పరిమితం చేయడం దారుణమని అభిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ భీకరమైన ఫాంలో సౌతాఫ్రికా వచ్చాడని, అతడు వరల్డ్‌క్లాస్ ఆటగాడని ప్రశంసించాడు. 'క్రితం సంవత్సరం అతను ఇక్కడకు వచ్చినప్పుడు, ఇక్కడ అతడు మంచి ప్రదర్శన కనబరిచాడు. నావను సమర్థవంతంగా నడిపించగల ఆటగాడు రహానే అని నా అభిప్రాయం. అతని టెక్నిక్ అనేది భగవంతుడు ఇచ్చిన వరం' అని డోనాల్డ్ పేర్కొన్నాడు.

ఫిలాండర్‌ను ఇలా దెబ్బకొట్టండి

దక్షిణాఫ్రికా మాజీ ఫాస్ట్‌బౌలర్ లాన్స్ క్లూసనర్ సలహా



కేప్‌టౌన్: తొలి టెస్టులో తొమ్మిది వికెట్లు తీసి కోహ్లిసేనను కోలుకోలేని దెబ్బకొట్టాడు దక్షిణాఫ్రికా పేసర్ వెర్నాన్ ఫిలాండర్. రెండో ఇన్నింగ్స్‌లో 6/42తో కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. వైవిధ్యమైన బంతులతో ఇబ్బంది పెట్టిన ఈ సీనియర్ పేసర్‌ను ఎలా ఎదుర్కోవాలో సలహాలు ఇస్తున్నాడు దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ లాన్స్ క్లూసెనర్. అత్యంత వేగంగా బంతులు విసిరే అలాంటి పేసర్లను ఎదుర్కోవాలంటే క్రీజు నుంచి మీటరు దూరం ముందుకొచ్చి బ్యాటింగ్ చేయాలని క్లూసెనర్ సూచిస్తున్నారు. 'మీటర్ కుదరకపోతే బ్యాట్స్‌మన్ క్రీజు నుంచి కనీసం అరమీటరు ముందుకొచ్చి స్టాన్స్ తీసుకోవాలి. ఫిలాండర్‌ను తక్కువ లెంగ్త్‌తో బంతులు విసిరేలా ఒత్తిడి తేవాలి. అతడి సహజ శైలికి ఆటను దూరం చేయాలి. బ్యాట్స్‌మన్ క్రీజులోనే ఉండి అతడి బౌలింగ్‌ను ఆడాలనుకుంటే మాత్రం చిక్కుల్లో పడక తప్పదు' అని లాన్స్ పేర్కొన్నారు. మిగతా రెండు మ్యాచ్‌లు బౌన్సీ పిచ్‌లపైనే ఆడాలి కాబట్టి కోహ్లిసేన సిరీస్ గెలుస్తుందన్న నమ్మకం లేదని క్లూసెనర్ అన్నారు. క్రమం తప్పకుండా మంచి లైన్ అండ్ లెంగ్త్‌తో చురకత్తుల్లాంటి బంతులు విసిరే నలుగురు పేసర్లను ఎదుర్కొని బ్యాటింగ్ చేయడం చాలా కష్టమని పేర్కొ న్నాడు. 1-0తో ఓటమి, లేదంటే 1-1తో సిరీస్ సమం కావొచ్చని అంచనా వేశాడు.

గెలిచే అవకాశాలు తక్కువ



న్యూఢిల్లీ: మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో 72 పరుగుల తేడాతో ఓటమి పాలైన టీమిండియా తిరిగి తేరుకోవడం కష్టమని మాజీ ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్ పేర్కొన్నాడు. ఈ టెస్టు సిరీస్‌లో భారత్ విజయం సాధించే అవకాశాలు చాలా తక్కువని అభిప్రాయపడ్డాడు. టెస్టు సిరీస్‌లో భారత్ తిరిగి పుంజుకునే అవకాశం కేవలం 30 శాతం మాత్రమే ఉందని సెహ్వాగ్ స్పష్టం చేశాడు. 'టీమిండియా ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే గాడిలో పడటం చాలా కష్టం. విరాట్ సేన బరిలో నిలబడటానికి 30 శాతం ఛాన్స్ మాత్రం ఉంది. సెంచూరియన్‌లో జరిగే రెండో టెస్టుకు స్పిన్నర్ రవిచంద్రన్ స్థానంపై టీమిండియా మేనేజ్‌మెంట్ ఆలోచించాలి. అతని స్థానంలో బ్యాట్‌మన్‌ను తీసుకోవడం ఉత్తమం. అజింక్యా రహానేను తుది జట్టులోకి తీసుకుంటే బ్యాటింగ్ బలం పెరగడంతో పాటు ఆత్మవిశ్వాసంతో కూడా పెరుగుతుంది. కోహ్లి, రోహిత్ శర్మల బ్యాట్ నుంచి భారీ ఇన్నింగ్స్‌లు అవసరం' అని సెహ్వాగ్ విశ్లేషించాడు.



బ్రాడ్‌మన్ రికార్డు బ్రేక్

న్యూఢిల్లీ : సుమారు రెండేళ్ల ఫస్ట్‌క్లాస్ కెరీర్ అనుభవమే మాత్రమే ఉన్న అఫ్గానిస్తాన్ టీనేజ్ క్రికెటర్ బహీర్ షా సంచలనం సృష్టించాడు. ఏకంగా దిగ్గజ ఆటగాడు సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్ రికార్డును బద్దలుగొట్టాడు. ప్రపంచ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో వెయ్యి అంతకంటే ఎక్కువ పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో అత్యధిక సగటును నమోదు చేసి కొత్త చరిత్ర సృష్టించాడు. 18 ఏళ్ల బహీర్ షా.. ఏడు మ్యాచ్‌ల్లో 12 ఇన్నింగ్స్‌లో 121.77 సగటుతో 1096 పరుగులు చేశాడు. ఫలితంగా ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఇంతరవకూ బ్రాడ్‌మన్ పేరిట 95.14 సగటుతో ఉన్న రికార్డును తిరగరాశాడు. స్పీన్‌ఘర్ రీజియన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న షా తన తొలిమ్యాచ్‌లోనే అదరగొట్టాడు. అమో రీజియన్‌పై అజేయంగా 256 రన్స్ చేసి అరంగేట్ర ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లో రెండో అత్యధిక స్కోరు చేసిన క్రికెటర్‌గా మరో రికార్డు నెలకొల్పాడు. ఈ జాబితాలో భారత మాజీ క్రికెటర్ మజుందార్ (260) అగ్రస్థానంలో ఉన్నాడు. రెండేళ్ల రెండు నెలల ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో షా ఇప్పటికే 5 సెంచరీలు సాధించడం విశేషం.

ఆంచల్‌కు హిమాచల్ ప్రభుత్వ నజరానా



సిమ్లా: స్కీయింగ్‌లో భారత్‌కు తొలి పతకం అందించిన ఆంచల్ ఠాగూర్‌కు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం రూ.5లక్షల నజరానా ప్రకటించింది. టర్కీలో అంతర్జాతీయ స్కీ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆల్పైన్ ఎజ్డర్ 3200 కప్‌లో స్లాలోమ్ రేస్ విభాగంలో ఆంచల్ కాంస్య పతకం గెలిచిన సంగతి తెలిసిందే. బుధవారం ఆంచల్ పతకం గెలిచిన అనంతరం ప్రధాని మోడీ ట్విటర్ ద్వారా అభినందనలు తెలిపారు. 'చరిత్ర సృష్టించిన నిన్ను చూసి దేశం పారవశ్యం పొందుతోంది' అని మోడీ ట్వీట్ చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలికి చెందిన ఆంచల్.. తన తండ్రి రోషన్ వద్దే మొదట స్కీయింట్ పాఠాలు నేర్చుకుంది. 1997లో రోషన్ పారాగ్లిడింగ్‌కు సంబంధించి ఓ ఇన్‌స్టిట్యూట్ నడిపాడు. ఆ సమయంలో నరేంద్ర మోడీ హిమాచల్ ప్రదేశ్‌కు బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసేవారు. ఒకసారి రోషన్ ఇన్‌స్టిట్యూల్‌కు వెళ్లిన మోడీ పారాగ్లిడింగ్ చేశారు. ఆ తర్వాత అక్కడికి అనేక సార్లు వచ్చారట.

సెంచూరియన్‌లో టీమిండియా సాధన



సెంచూరియన్: ఆతిథ్య దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు కోసం కోహ్లిసేన కేప్‌టౌన్ నుంచి సెంచూరియన్ చేరుకుంది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం నిర్వహించిన ప్రాక్టీస్ సెషన్‌లో భారత ఆటగాళ్లు పాల్గొన్నారు. సెంచూరియన్‌లో నిర్వహించిన శిక్షణ శిబిరంలో కేప్‌టౌన్‌లో జరిగిన టెస్టులో ఆడని ఆటగాళ్లే ఎక్కువగా కనిపించారు. ఒక్క కోహ్లి, పాండ్య, పుజారా తప్ప. దీంతో రెండో టెస్టులో కోహ్లి కొన్ని మార్పులతోనే బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

జట్టులో జడేజా !

తొలి టెస్టు ప్రారంభానికి ముందు జ్వరంతో బాధపడిన రవీంద్ర జడేజా కోలుకున్నాడు. గురువారం సాధనకు హాజరవడంతో అనారోగ్యం నుంచి పూర్తిగా కోలుకుని రెండో టెస్టుకు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే రహానె, కేఎల్ రాహుల్, పాండ్య, పుజారా, కోహ్లి కూడా సాధన చేసిన వారిలో ఉన్నారు. మొదటి టెస్టు ఎంపిక సరిగా లేదంటూ పలువురు విమర్శలు చేయడంతో ఇప్పుడు రెండో టెస్టులో కోహ్లి ఎవరికి తుది జట్టులో స్థానం కల్పిస్తాడన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. విదేశీ గడ్డలపై మంచి రికార్డున్న రహానెను తప్పించడంపై దక్షిణాఫ్రికా సారథి డూప్లిసిస్‌తో పాటు ఎంతోమంది ఆశ్చర్యం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. శిఖర్ ధావన్‌ను తప్పించి కేఎల్ రాహుల్‌ను జట్టులోకి తీసుకోవచ్చన్న ఊహాగానాలు వినపడుతున్నాయి. అలాగే రోహిత్ శర్మకు కోహ్లి మరో అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం.

మూడేళ్ల తరువాత జట్టులోకి వైట్



మెల్‌బోర్న్ : దాదాపు మూడేళ్ల తరువాత ఆస్ట్రేలియా సీనియర్ ఆటగాడు కామెరాన్ వైట్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఇంగ్లండ్‌తో ఆదివారం నుంచి ఆరంభమయ్యే ఐదు వన్డేల సిరీస్‌లో కామెరాన్‌కు చోటు కల్పిస్తూ క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) సెలక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు సిద్ధం కావాలని కామెరాన్‌కు కబురు అందింది. 2015, జనవరి 23న ఆసీస్ తరపున చివరసారి కనిపించిన కామెరాన్.. సుదీర్ఘ విరామం తరువాత తాజాగా చోటు దక్కించుకోవడం విశేషం. గాయం కారణంగా ఇంగ్లండ్‌తో సిరీస్‌కు దూరమైన క్రిస్ లిన్ స్థానంలో 34 ఏళ్ల కామెరాన్‌కు అవకాశం దక్కింది. ఆసీస్ తరఫున కామెరాన్ 88 వన్డేలు ఆడాడు. అతడికి అవకాశం ఇవ్వడానికి అతని ప్రస్తుత ఫామ్‌ను పరిగణలోకి తీసుకున్నమని సీఏ సెలక్టర్ ట్రావెర్ హాన్స్ తెలిపారు.. కొంతకాలంగా దేశవాళీ లీగ్ మ్యాచ్‌ల్లో అద్భుతమైన గణాంకాలను నమోదు చేయడమే అతని ఎంపికకు ప్రధాన కారణమన్నాడు.

ప్రపంచకప్ కామెంటరీ ప్యానల్‌లో గంగూలీ



దుబాయ్ : భారత మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీకి అరుదైన అవకాశం దక్కింది. ఈ నెల 13 నుంచి న్యూజిలాండ్ వేదికగా అండర్-19 ప్రపంచకప్ పోటీలు జరగనున్నాయి. ఈ టోర్నీకి కామెంటేటర్ బాధ్యతలు నిర్వహించే వారి జాబితాను ఐసీసీ తాజాగా విడుదల చేసింది. 14మందితో కూడిన జాబితాలో భారత్‌కు చెందిన మాజీ క్రికెటర్లు సౌరభ్ గంగూలీ, అంజుమ్ చోప్రా చోటు దక్కించుకున్నారు. గంగూలీ, అంజుమ్ చోప్రా ఇప్పటికే అప్పుడప్పుడూ కామెంటేటర్ బాధ్యతలు నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. వీరితో పాటు ఆస్ట్రేలియా, శ్రీలంక తదితర దేశాలకు చెందిన మాజీ క్రికెటర్లు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్న టోర్నీ ఫిబ్రవరి 3తో ముగియనుంది. పృథ్వీ షా నాయకత్వంలోని భారత జట్టు ఈ టోర్నీలో బరిలోకి దిగనుంది. రెండు రోజుల క్రితం దక్షిణాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

సచివాలయం బాగుంది : నారాయణ



విశాలాంధ్ర-అమరావతి : నూతన రాజధానిని చూడాలని వచ్చాననీ, సచివాలయం చాలా బాగుందనీ, ప్లానింగ్ ఇంకా బాగుందని చెప్పారు సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ. గురువారం నారాయణ తన మిత్రులతో కలిసి సచివాలయానికి సైకిల్‌పై వచ్చారు. సెక్యూరిటీ సిబ్బంది లోనికి రానీయకపోవడంతో సచివాలయం బయటే సైకిల్‌పై షికారు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 60-70 ఏళ్లు ముందుకు వెళ్లి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కేబుల్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ప్రమాణస్వీకారం చేసిన మరుసటి రోజే వచ్చివుంటే శాశ్వత అసెంబ్లీ నిర్మాణం కూడా పూర్తయి ఉండేదన్నారు. రోడ్లు కూడా బాగుండేవనీ, ప్రజలు ఇంకా మద్దతు తెలిపేవారని, ప్రతిపక్ష పార్టీ నుంచి విమర్శలు లేకుండా పోయేవి అని తెలిపారు. అయినా కొత్త రాజధాని అన్న తరువాత ఇక్కట్లు ఉంటాయనీ, తాత్కాలికంగా నిర్మించిన అసెంబ్లీపై విమర్శలు చేయాల్సిన పనిలేదన్నారు. తాను రాజధానిని పరిశీలించాలనీ, ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. అనంతరం మందడంలో ఉన్న తుళ్లూరు సీపీఐ మండల కార్యదర్శి గుంటుపల్లి వెంకటేశ్వర్లు బార్బర్‌షాపునకు నారాయణ వెళ్లారు. ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రాజధాని రాకముందుకు, వచ్చిన తర్వాత ఆదాయం తగ్గిందా, పెరిగిందా అని ప్రశ్నించారు.

గీత కార్మికులకు పలకరింపు

సచివాలయానికి సైకిల్‌పై వస్తూ గీత కార్మికుడిని పలకరించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాజధాని ఏర్పడిన తర్వాత వృత్తిపై ఏమైనా ప్రభావం చూపిందా అని అడిగారు. దానికి స్పందించిన కార్మికుడు పెద్దగా మార్పేమీ లేదని సమాధానమిచ్చాడు. సుమారు 25 కిలోమీటర్లు సైకిల్‌పై వెలగపూడి, మందడం, క్రిష్టాయపాలెం, పెనుమాక, ఉండవల్లి గ్రామాల్లో పర్యటించారు. నారాయణతో పాటు కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, మురళి, శ్రీనివాసరావు, వెంకట్రావు, ఆలూరి కొండయ్య, భూషయ్య, జె.శ్రీనివాసరావు, వీరయ్య చౌదరి తదితరులు ఉన్నారు.





నేడు నింగిలోకి పీఎస్ఎల్‌వీ సీ-40

- కొనసాగుతున్న కౌంట్‌డౌన్
- ఒకే రాకెట్‌లో 31 ఉపగ్రహాలు



విశాలాంధ్ర-సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్) నుంచి శుక్రవారం 31 ఉపగ్రహాలను ఒకే రాకెట్ ద్వారా నింగిలోకి పంపనున్నారు. దీనికి సంబంధించి కౌంట్‌డౌన్ ప్రక్రియ గురువారం ఉదయం 5.29 గంటలకు ప్రారంభమైంది. సజావుగా 28 గంటలపాటు కౌంట డౌన్ ప్రక్రియ కొనసాగిన అనంతరం శుక్రవారం ఉదయం 9.29 గంటలకు శ్రీహరికోటలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్‌వీ సీ-40 నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకువెళ్లనుంది. శాస్త్రవేత్త బి.ఎన్.సురేష్ ఆధ్వర్యంలో ఎంఆర్ఆర్ మీటింగ్‌లో షార్ సంచాలకులు పి.పునిహికృష్ణన్ ఆధ్వర్యంలో ప్రయోగానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. శ్రీహరికోట నుంచి గత ఏడాది ఆగస్టు 31న పీఎస్ఎల్‌వి సీ-39 రాకెట్‌ను ప్రయోగించగా అది విఫలమైంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని శాస్త్రవేత్తలు అత్యంత చాకచక్యంగా రాకెట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి మళ్లీ ఈ ప్రయోగాన్ని విజయవంతం చేయాలని పీఎస్ఎల్‌వీ సీ-40ని ప్రయోగిం చనున్నారు. ఈ ఉపగ్రహం ద్వారా భూమిలోని ఖనిజాలను కనుగొనేందుకు వీలుంటుంది. సూక్ష్మ నానో శాటిలైట్‌ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసి ఈపీఎస్ఎల్‌వి సీ-40 ద్వారా ప్రయోగించనున్నారు. 28 విదేశీ ఉపగ్రహాలు, మన దేశానికి చెందిన మూడు ఉపగ్రహాలను ఇందులో పంపను న్నారు. వీఎస్ఎస్‌సీ డైరెక్టర్ శివన్ పర్యవేక్షణలో ఈ ప్రయోగం రూపుదిద్దు కుంది. ఈనెల 18న ఇస్రో చైర్మన్ కిరణ్‌కుమార్ పదవీకాలం ముగియ నుండడంతో 19న శివన్ బాధ్యతలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిసింది.

ఏపీ అసెంబ్లీలో సంక్రాంతి సంబరాలు



విశాలాంధ్ర-అమరావతి : అసెంబ్లీలోని మహిళా ఉద్యోగులకు గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఉద్యోగినులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగులతో నిండిన రంగవల్లులు అందరినీ ఆకట్టుకొన్నాయి. అమరావతిలో మొదటిసారిగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా సచివాలయం సహాయ కార్యదర్శులుగా వనిత రాణి, కామేశ్వరి, శకుంతల వ్యవహరించారు. గెలుపొందిన వారికి జనవరి 26న స్పీకర్ చేతులమీదగా బహుమతులు అందించనున్నారని అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు.



ఏఐటీయూసీ నాయకులు పీజే చంద్రశేఖర్‌రావు, రావులపల్లి రవీంద్రనాథ్, వెంకటసుబ్బయ్యలతో మాట్లాడుతున్న సురవరం సుధాకరరెడ్డి

ఏఐటీయూసీ నూతన భవనాన్ని సందర్శించిన సురవరం

విశాలాంధ్ర బ్యూరో- విజయవాడ : విజయవాడ నగర పరిధిలోని గొల్లపూడి వద్ద నూతనంగా నిర్మించిన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయ భవనాన్ని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి గురువారం ఉదయం సందర్శించారు. మొత్తం 5 అంతస్తులతో నిర్మించిన ఏఐటీయూసీ రాష్ట్ర నూతన కార్యాలయాన్ని ఈనెల 7వ తేదీ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా ఈనెల 8, 9, 10 తేదీల్లో విజయవాడ నగరంలో జరిగిన సీపీఐ జాతీయ సమితి సమావేశాలకు హాజరైన సురవరం సుధాకరరెడ్డి గురువారం ప్రత్యేకంగా నూతన కార్యాలయాన్ని చూసేందుకు గొల్లపూడి వచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పీజే చంద్రశేఖర్‌రావు, ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్, కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య తదితరులు ఆయనకు సాదరంగా స్వాగతం తెలిపారు. అతికొద్దికాలంలో అన్ని వసతులతో వేగవంతంగా భవనాన్ని నిర్మించడం విశేషంగా పేర్కొంటూ, ఇందుకోసం కృషి చేసిన ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వాన్ని సురవరం అభినందించారు. ఈ నూతన భవన కేంద్రంగా ఏఐటీయూసీ బలమైన ఉద్యమాలు నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.